fb/prajasakti, www.prajasakti.com

సిటీ


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 24 | విజయవాడ, గురువారం 25 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00













పోలీసు వలయంలో
గొట్టిపాడు

పెద్దఎత్తున వామపక్ష ప్రజాసంఘాల నాయకుల అరెస్టు



పోలీసు పహారాలో గొట్టిపాడు, అయినా ఆగని దళితుల ఆందోళన, కొనసాగిన అరెస్టుల పర్వం

- వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలింపు
- మహిళలపై పైశాచికం
- గొట్టిపాడులో మహిళల ఆందోళన
- 200 మంది అరెస్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'చలో పెద గొట్టిపాడు' సందర్భంగా వామపక్షాలు, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 200 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులోకి ఎవరినీ ప్రవేశించకుండా పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారు. ఎక్కడివారిని అక్కడ అరెస్టు చేశారు. పత్తిపాడులో ప్రదర్శనగా బయలుదేరిన నాయకుల్ని రోడ్లపై ఈడ్చిపడేశారు. మహిళల దుస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తొలగించి పైశాచిక ఆనందం పొందారు. అరెస్టు అనంతరం లారీలో తరలిస్తున్న సమయంలో డోరు ఊడిపోవడంతో కార్యకర్తలు కిందపడ్డారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు, డి.రమాదేవి, రైతు సంఘం నాయకులు జమలయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు, సిపిఎం పశ్చిమ గుంటూరు జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్యలను వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. తొలుత ప్రజా సంఘాల నాయకులు పత్తిపాడు మిగతా 3లో

సిఎం సీట్లో బాలయ్య



సిఎం సీట్లో కూర్చొని మంత్రి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న బాలకృష్ణ

వార్త 2లో

అవే సంస్థలు.. అవే చర్చలు..

- పెట్టుబడులపై మూసపోత విధానం
- దావోస్ పర్యటనలోనూ అదే తంతు
- రెండు పర్యటనల్లోనూ ఒకే సంస్థతో చర్చ
- విస్తుపోతున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోనైనా, దావోస్‌లోనైనా పెట్టుబడుల ఆకర్షణలో ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరించే విధానాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఒకే సంస్థతో పదే పదే చర్చలు సాగించడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత మూడు పెట్టుబడుల సదస్సుల్లో ఇదే పరిస్థితి కనిపించగా తాజాగా దావోస్‌లోను అదే పునరావృతమయ్యింది. కృష్ణపట్నంలో రిఫైనరీ ప్రాజెక్టు కోసం గతేడాది సౌదీ ఆరామ్కో సంస్థతో చర్చలు సాగించగా ఈ ఏడాది కూడా అదే సంస్థతో ఒప్పందాల కోసం చర్చించడం గమనార్హం. గతేడాది దావోస్ పర్యటనలో ఆరామ్కోతో సానుకూల ఒప్పందం జరిగిందని చంద్రబాబు ప్రకటించగా తాజా పర్యటనలో కూడా ఇదే సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చించడం గమనార్హం. అప్పట్లో సంస్థ అధ్యక్షునితో చర్చించగా ఈసారి ఉపాధ్యక్షునితో చర్చించటం కొసమెరుపు. దీంతో అప్పట్లో జరిగిన చర్చలు ఫలవంతం కాలేదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటువంటి కారణాల వల్లనే పెట్టుబడులు కార్యరూపం దాల్చడంలేదని వారు అభిప్రాయపడుతున్నారు.కాగా, విశాఖలో గత పెట్టుబడుల మిగతా 9లో

పద్మావత్‌ను అడ్డుకుంటాం

ఆరు రాష్ట్రాల్లో ఆందోళనకారుల విధ్వంసకాండ

- హైవేలను దిగ్బంధించిన కర్ణిసేన కార్యకర్తలు
- నాలుగు రాష్ట్రాల్లో చిత్ర ప్రదర్శన రద్దు
- మల్టిప్లెక్స్ అసోసియేషన్ నిర్ణయం



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన పద్మావత్ చిత్రం గురువారం విడుదల కానున్న తరుణంలో బుధవారం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, గోవాల్లో నిరసనలు, ఆందోళనలు, హింసాకాండ చెలరేగాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి పద్మావత్ చిత్రం ప్రదర్శనను అడ్డుకుంటామని శపథం చేసిన కర్ణిసేన వంటి గ్రూపులు బుధవారం రోడ్డెక్కాయి. మంగళవారం సాయంత్రం నుండి నిరసనలు, ఆందోళనలు ఉధృత రూపం దాల్చాయి. అహ్మదాబాద్, యుపిలోని కొన్ని ప్రాంతాల్లో గృహ దహనాలు, విధ్వంసకాండ జరిగినట్లు వార్తలందాయి. గురుగావ్‌లో స్కూలు బస్సుపై దాడి జరిగింది. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సును తగలబెట్టారు. రాజస్థాన్‌లో ఢిల్లీ-జైపూర్ హైవే, ఇతర రహదారులను దిగ్బంధించారు. ఉత్తరప్రదేశ్‌లో మార్కెట్లు మూతపడ్డాయి. గుజరాత్‌లో బుధ, గురువారాల్లో ఆందోళనలు సాగాయి. దేశవ్యాప్తంగా ఎక్కడా ఈ చిత్రం ప్రదర్శించనివ్వకుండా అడ్డుకోవాలని కర్ణిసేన సామాజిక సంస్థలను కోరింది. ఆందోళనల దృష్ట్యా రాజస్థాన్‌లో పద్మావత్‌ను ప్రదర్శించడానికి డిస్ట్రిబ్యూటర్లు నిరాకరిస్తున్నారు. ఆందోళనకారులు టైర్లను తగలబెట్టడంలో ఢిల్లీ-అజ్మీర్ హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. సికార్‌లో మిగతా 9లో



మొన్నటి తరం కలల రాణి
కృష్ణకుమారి మృతి

పూర్తి వివరాలు సినిమా పేజీలో

పాక్‌లో అమెరికా
డ్రోన్ దాడి

- హక్కాని కమాండర్ మృతి
- దాడిపై వ్యాఖ్యానించేందుకు అమెరికా ఎంబసీ నిరాకరణ

పెషావర్, పాకిస్తాన్ : పాకిస్తాన్‌లోని గిరిజన ప్రాంతంలో బుధవారం అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో హక్కాని నెట్‌వర్క్‌కు చెందిన కమాండర్ ఒకరు మృతి చెందినట్లు మిగతా 9లో

లాలూకు
మరో ఐదేళ్లు 'జైలు'

దాణా కేసులో సిబిఐ కోర్టు తాజా తీర్పు

జగన్నాథ్ మిశ్రాతో పాటు మరో 76 మంది దోషులు

నితీష్, బిజెపి, ఆరెస్సెస్‌ల కుట్ర - తేజస్వీ యాదవ్

పాట్నా/న్యూఢిల్లీ : దాణా కుంభకోణానికి చెందిన మరో కేసులో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌కు సిబిఐ కోర్టు మరో ఐదేళ్ళు జైలు శిక్ష విధించింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు మరో 48 మందిని రాంచీలోని ప్రత్యేక సిబిఐ కోర్టు బుధవారం దోషులుగా పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఆరుగురిని నిర్దోషులుగా వదిలిపెట్టింది. దాణా కుంభకోణానికి సంబంధించి దాఖలైన కేసుల్లో ఇది మూడోది. 1992-93 సంవత్సరంలో ప్రస్తుతం జార్ఖండ్‌లో ఉన్న చెయిబాసా జిల్లా ఖజానా నుండి రూ.33.67 కోట్లు మోసపూరితంగా డ్రా చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదయ్యింది. కాగా, దాణా కుంభకోణానికి సంబంధించిన రెండో కేసులో లాలూ దోషిగా శిక్ష అనుభవిస్తున్నారు. ఈ కేసులో ఆయనకు మూడున్నరేళ్ళు జైలు శిక్ష పడింది. గతేడాది డిసెంబరు 23న కోర్టు ఈ కేసుపై తీర్పు చెప్పింది. ఈ కేసు డియోఘడ్ ఖజానాకు సంబంధించినది. ఈ కేసులో దోషులుకు శిక్ష ఖరారు చేస్తూ ఈ నెల 6న న్యాయమూర్తి తీర్పు ప్రకటించింది. ఈ కేసులో తన తప్పేమీ లేదంటూ మిగతా 9లో

సమాజానికి ఉపయోగపడేలా
విద్యార్థులను తీర్చిదిద్దాలి

గవర్నర్ నరసింహన్



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

విశ్వవిద్యాలయాలు విద్యార్థులను సమాజానికి ఉపయుక్తమయ్యే పౌరులుగా తీర్చిదిద్దాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్.నరసింహన్ అన్నారు. బుధవారం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలో రాష్ట్రంలోని ఉపకులపతులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎయు సెనెట్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాన్సలర్‌గా రాష్ట్రంలోని వర్సిటీల విసిలతో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు. యూనివర్సిటీల్లో ఇంక్యుబేసిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తే నూతన ఆవిష్కరణలకు ఎంతో అవకాశముందన్నారు. ఆ దిశగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలూ కృషి చేస్తున్నట్లు విసిలు పేర్కొన్నారని చెప్పారు. వర్సిటీల్లో బయోమెట్రిక్ అమలు, మౌలిక వసతుల కల్పనతో చక్కటి ఫలితాలు లభిస్తాయన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో నవ్యాంధ్ర నాలెడ్జ్ హబ్‌గా రూపొందుతుందన్నారు. సమీక్షా సమావేశంలో విసిలందరూ యూనివర్సిటీల అభివృద్ధి గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి చూపించారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ మిగతా 9లో

ఇద్దరు ఐజిలకు ఎడిజిలుగా పదోన్నతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇద్దరు సీనియర్ ఐపిఎస్‌లకు అదనపు డిజిలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి)లు అమిత్‌గార్గ్, మహేష్ దీక్షితులకు అదనపు డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎడిజి)గా పదోన్నతి లభించింది. వీరిద్దరికీ సూపర్ టైమ్ స్కేల్ లెవల్ 15 ప్రకారం ప్రభుత్వం పే ఫిక్స్ చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



రిహార్సల్స్
విజయవాడలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ కోసం రిహార్సల్స్ చేస్తున్న ఏపి పోలీసులు

విజయవాడలో గణతంత్ర దినోత్సవ రిహార్సల్స్

పర్యవేక్షించిన డిజిపి మాలకొండయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు మరో 24 గంటలు మాత్రమే సమయం ఉండటంతో విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనే ఈ కార్యక్రమానికి సంబంధించి తుది రిహార్సల్స్‌ను బుధవారం పూర్తి చేశారు. రిహార్సల్స్ కార్యక్రమాన్ని డిజిపి ఎం.మాలకొండయ్య స్వయంగా పర్యవేక్షించారు. గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ దళాల కవాతు కార్యక్రమాన్ని పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ముఖ్యంగా బందోబస్తు ఏర్పాట్లతో పాటు ముఖ్య అతిథులు వచ్చే సమయాలు, వారు వచ్చే గేట్ల వివరాల్ని అధికారులు ఈ సందర్భంగా డిజిపికి వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు కూడా రిహార్సల్స్‌లో పాల్గొన్నాయి. 68వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంట్రీ పాస్‌లు ఉన్న వారు నిర్దేశించిన స్థానాల్లో సమయానికి వచ్చి ఆసీనులవ్వాలని అధికారులు తెలిపారు. కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాల్ని పార్కింగ్ చేయాలని, దీనివల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని సూచిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బుధవారం జరిగిన రిహార్సల్స్ కార్యక్రమంలో డిజిపితో పాటు విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్, జాయింట్ కమిషనర్లు రమణకుమార్, కాంతిరాణా టాటా, సిఎం సెక్యూరిటీ అధికారి జోషి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు బుధవారం వెల్లడించారు. ఉష్ణోగ్రతల్లో పెద్దగా హెచ్చుతగ్గులేమీ లేవని, రాష్ట్రంపై ఎలాంటి అల్పపీడన ప్రభావాల్లేవని తెలిపారు. చలి సాధారణంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. తమిళనాడులోని శ్రీరంగం దేవాలయానికి ఏ అవార్డు లభించింది?
2. పర్యావరణ పనితీరు జాబితా 2018లో భారత్ స్థానం ?
3. 'ఒక జిల్లా, ఒక ఉత్పత్తి' అనే పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
4. జాతీయ బాలికా దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
5. భారీ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలను మూసివేయడంతో ఏ రాష్ట్రానికి నోటీసులు జారీ చేశారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com** కు పంపవచ్చు.

రైతు ఉపకరణాలపై చంద్రబాబు ఆసక్తి

- యుపిఎల్ లిమిటెడ్ సిఇవో జైషరోవ్‌తో భేటీ
- దావోస్ మూడోరోజు పర్యటనలో పలు సంస్థలతో సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతన్నలకు ఉపకరించే ఉత్పత్తులు, ఉపకరణాల తయారీ సంస్థలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనలో పలు సంస్థలతో చర్చించారు. భూమిలో నీటిని గ్రహించి ఆ నీటిని కరువు సమయంలో తిరిగి విడుదల చేసే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి పరిచయం చేసేందుకు చంద్రబాబు చర్చించారు. ఈ కొత్త పరిజ్ఞానం కరువును నియంత్రించేందుకు దోహదం చేయడమే కాకుండా 30 నుంచి 40 శాతం వరకు ఉత్పాదకత పెంచగలదని అంచనా వేస్తున్నారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, ఉత్పాదకత పెంచడం తమ సంస్థ లక్ష్యమని గ్లోబల్ సీఈవో జైషరోవ్ సిఎంకు తెలిపారు. ఎపిని యుపిఎల్ ఉత్పత్తులకు ప్రయోగశాల చేసుకోవాలని ఆసంస్థ ప్రతినిధులకు చంద్రబాబు సూచించారు. నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సుబ్రా సురేష్‌తోనూ సిఎం సమావేశమయ్యారు.

స్టీఫెన్ నిగ్రోతో సమావేశం

హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నిగ్రోతోనూ సిఎం సమావేశమయ్యారు. హెచ్‌పి సంస్థ తమ సెంటర్లను ఎపిలో ఏర్పాటుచేసి ప్రజలకు త్రీడి ప్రింటింగ్ అనుభూతిని తెలియజేయాలని వారికి సూచించారు. ఇంటరాక్టివ్ లంచాన్ కార్యక్రమంలో టెక్నాలజీ ఫర్ ఇన్నోవేషన్స్ అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. నవ్యావిష్కరణలు మన జీవన విధానంలో మార్పులు తీసుకొస్తాయన్నారు. కష్టాలను అధిగమించి ముందుకు సాగాల్సిన అవసరముందున్నారు. 2050 నాటికి ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు.



సిఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో

ఎపిలో ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఐఐని ఆహ్వానించారు. సిఐఐతో తనకు సుదీర్ఘమైన అనుబంధం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అతిపెద్ద నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రహేజా మైండ్ స్పేస్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు చూపిన చొరవ, అందించిన సహకారం మరవలేనిదని రహేజా గ్రూప్ ప్రతినిధి రవిరహేజా తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకు రూ.4వేల కోట్లు కేటాయించాలి

సంక్షేమ సంఘం డిమాండ్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మహత్యలు పునరావృతం కాకుండా వారిని కాపాడేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. లేదంటే ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధమవుతామని, అందుకు తగిన కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించింది. అసోసియేషన్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాలు రెండు రోజుల పాటు విజయవాడలో జరిగాయి. సమావేశ నిర్ణయాలను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, అధ్యక్షులు విశ్వనాథరెడ్డి బుధవారం విలేకరులకు వివరించారు. గతేడాది జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను నేటికీ చెల్లించలేదన్నారు. ఈ నెలఖారులోగా ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితుల్లో ఆత్మ విశ్వాసం సడలకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు రెండూ బాధితులపక్షాన ఉన్నట్లు కనిపించినా పరిష్కారం లభించక మూడేళ్లు దాటిందన్నారు. ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థపట్ల నమ్మకం సడలడానికి ఇలాంటి కాలయాపనే కారణమవుతుందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు బాధితుల గడపగడపకూ వెళ్లి వారిలో ధైర్యాన్ని నింపుతామన్నారు. ఫిబ్రవరి 19,20,21 తేదీల్లో మండల కేంద్రాల్లో బాధితుల కుటుంబీకులతో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు.

బిజెపితో కలిసి పోటీ చేస్తామని చెప్పలేదు

మీడియా ఇంటరాక్షన్‌లో వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి



బిజెపితో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని తమ పార్టీ నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏనాడూ చెప్పలేదని, కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా సరే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఉద్ఘాటించారు. బుధవారం విశాఖ నగరంలోని మేఘాలయ హోటల్‌లో మీడియాతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు తైనాల విజయకుమార్, మళ్ల విజయప్రసాద్, గొల్ల బాబూరావు తదితరులతో ఆయన మీడియాతో ముచ్చటించారు. రాష్ట్రపతి అభ్యర్థిత్వం విషయంలో బిజెపికి ఎందుకు మీ పార్టీ మద్దతు తెలిపిందని, కాంగ్రెస్ మిగతా పక్షాలు బలపరచిన మీరాకుమారికి మద్దతు ఇవ్వకపోవడం పట్ల బిజెపికి అనుకూలంగా వ్యవహరించినట్లే కదా! అని విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాజ్యాంగ పదవులకు పోటీ ఉండకూడదనే అలా చేశామని ఆయన చెప్పడంతో రాజ్యాంగమే పోటీ చేయొచ్చని చెప్పినప్పుడు మీరు బిజెపికే ఎందుకు మద్దతిచ్చారంటూ మళ్లీ మీడియా వారు అందుకోవడంతో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మైకు అందుకుని సబ్జెక్టును డైవర్టు చేశారు.

సిఎం సీట్లో బాలకృష్ణ

- మంత్రి దేవినేని, ఐఎఎస్ అధికారులు హాజరు
- సిఎం క్యాంపు కార్యాలయంలో సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎమ్మెల్యే బాలకృష్ణ ముఖ్యమంత్రి సీట్లో కూర్చొని సమీక్ష నిర్వహించిన వార్త రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూర్చునే సీట్లో ఎమ్మెల్యే బాలకృష్ణ కూర్చోవడం అధికారులు, ఉద్యోగుల్ని విస్మయానికి గురిచేసింది. సిఎం సీట్లో ఒక ఎమ్మెల్యే కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సిఎం సీట్లో కూర్చొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనడం ఆనవాయితీ. కానీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన సమీక్షకు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారులు నీరబ్ కుమార్, ముఖేష్ కుమార్ మీనాతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొనడం విశేషం. ఇందులో హిందూపురం నియోజక వర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులు, లేపాక్షి ఉత్సవాల పై చర్చించినట్టు సమాచారం. ఇదిలా ఉంటే ఒక ఎమ్మెల్యే మంత్రుల్ని, అధికారుల్ని పక్క సీట్లో కూర్చోబెట్టి సమీక్ష నిర్వహించే అధికారం ఒక బాలకృష్ణకే ఉంటుందా? లేక తక్కిన ఎమ్మెల్యేలందరికీ ఉంటుందా అని అటు రాజకీయ నేతలు, ఇటు ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు. సిఎం చంద్రబాబుకి బాలకృష్ణ బావమరిది, మంత్రి లోకేష్‌కు మేనమామ కాకుండా, పిల్లనిచ్చిన మామ కావడం వల్లనే బాలకృష్ణకు ఇటువంటి ప్రత్యేక వెసులుబాటు ఉందేమో అని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మంత్రి వర్గ సమావేశాలకు సిఎం అగౌరవం తెచ్చారని, కేవలం మంత్రులు మాత్రమే పాల్గొనాల్సిన మంత్రివర్గ సమావేశాలలో కేబినెట్ స్థాయిలేని వారిని పక్క సీట్లలో కూర్చోబెట్టుకొని మంత్రి వర్గ సమావేశాల ప్రతిష్టను దిగజార్చానే విమర్శలు ఉన్నాయి. తాజాగా ఒక ఎమ్మెల్యే నేరుగా సిఎం సీట్లో కూర్చుని మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షలు చేయడంతో ప్రతిష్ట ఇంకా దిగజార్చినట్లయ్యిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నీట్ పీజీ ఫలితాలు విడుదల

వారం రోజుల ముందే ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ పీజీ-2018 ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బిఈ) బుధవారం ఫలితాల్ని వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రకటించిన షెడ్యూల్ కంటే వారం ముందే ఫలితాలు విడుదల కావడం విశేషం. కటాఫ్‌కు సంబంధించిన పర్సంటైల్‌ను కూడా ఎన్‌బిఈ ప్రకటించింది. మొత్తం 1200 మార్కులకు గాను జనరల్ కేటగిరీ అభ్యర్థుల కటాఫ్‌ను 321 మార్కులుగా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబిసి అభ్యర్థులకు 281 మార్కులు, వికలాంగ, ఇతర అభ్యర్థులకు 300 మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు. నీట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుపుతారు. ఎండీ, ఎంఎస్ తదితర పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకుగాను జనవరి 7న దేశవ్యాప్తంగా నీట్ పీజీ-2018 పరీక్షను నిర్వహించారు. అయితే ఈ ఏడాది నుంచి నీట్‌లో కొన్ని మార్పులు చేసింది. తొలిసారిగా ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించడంతో పాటు నెగటివ్ మార్కుల విధానాన్ని అమలు చేసింది. అలాగే రాష్ట్రంలోని 50 శాతం సీట్లు నేషనల్ పూల్‌కు కేటాయిస్తుండగా, మిగిలిన సీట్లు ఆయా రాష్ట్రాల విద్యార్థులతో భర్తీ చేస్తారు. కాగా తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది హాజరైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. గత ఏడాది 14 వేల మంది వరకు పరీక్ష రాసినా...చివరి స్లాట్‌లో పరీక్షలకు హాజరు కావడంతో ప్రశ్నా పత్రం క్లిష్టతరంగా రావడంతో దాదాపు 40 శాతం మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు.

ఓపెన్‌స్కూల్ విద్యార్థులూ అర్హులే

మరోవైపు నీట్ యూజీ-2018 పరీక్షకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) విద్యార్థులకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇంటర్ పరీక్షల్లో వివిధ కారణాలతో ఫెయిల్ అయి... ఎన్ఐఓఎస్ ద్వారా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్ని గతంలో నీట్‌కు అనుమతించే వారు కాదు. అయితే ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌ను కలిసిన ఎన్ఐఓఎస్ బృందం తమ విద్యార్థుల్ని నీట్‌కు అనుమతించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ఈ ఏడాది నీట్ పరీక్షకు ఎన్ఐఓఎస్ విద్యార్థులను అనుమతించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. దీంతో ఈ ఏడాది నుంచి నీట్‌కు ఎన్ఐఓఎస్ విద్యార్థులను అనుమతిస్తామని ఎంసిఐ ప్రకటించింది. ప్రతి ఏడాదీ దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది ఎన్ఐఓఎస్ ద్వారా ఉత్తీర్ణులవుతున్నారు.

శ్రీశైల మల్లన్న హుండీ అదాయం రూ.2.42 కోట్లు

ప్రజాశక్తి-శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల హుండీలలో యాత్రికులు, భక్తులు చెల్లించుకున్న కానుకలను బుధవారం లెక్కించారు. 36 రోజులకు రూ.2,42,87,049 నగదు, వీటితోపాటు విదేశీ కరెన్సీలు ఆస్ట్రేలియా డాలర్లు 100, ఇంగ్లాండ్ పౌండ్‌లు 25, కెనడ 20, సింగపూర్ 481, మలేషియా 52, యుఎఇ 225, ఎస్ఎయు 32 హుండీలలో లభించాయని ఇఒ భరత్‌గుప్తా తెలిపారు.

కృష్ణా మూడో జోన్‌కు సాగర్ జలాలు విడుదల చేయాలి

- కెఆర్ఎంబికి సాగునీటి సంఘాల విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా మూడో జోన్‌కు నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి నీటిని వెంటనే విడుదల చేయాలని జలవనరులశాఖ రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల చెన్న కేశవరావు కృష్ణానది యాజమాన్య బోర్డును బుధవారం కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏపిలోని నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద కృష్ణా జిల్లాలో తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఇందులో మిర్చీ, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మామిడి తదితర పంటల్ని రైతులు సాగు చేయగా ఎపి ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నవంబర్‌లో 4 టిఎంసిలు, డిసెంబర్‌లో 4 టిఎంసిల నీటిని కెఆర్ఎంబి నాగార్జున సాగర్ ఎడమ కాలువకు కేటాయించిందన్నారు. నవంబర్‌లో మొదటి విడతగా 2,3 జోన్లకు 3.780 టిఎంసిలు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మూడో జోన్‌కు సాగునీటిని విడుదల చేసి ఇప్పటికి 50 రోజులకు పైగా అవుతోందని, అయితే డిసెంబర్, జనవరి నెలల్లో ఇప్పటి వరకు రెండో విడత రెండో జోన్‌కు 1.35 టిఎంసిలు మాత్రమే ఇచ్చి ఏకపక్షంగా జనవరి 26న నాగార్జున సాగర్ డ్యాం దగ్గర హెడ్ రెగ్యులేటర్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. దీంతో ఇక్కడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. దీనివల్ల కృష్ణా జిల్లాలోని మూడో జోన్‌లో ఉన్న 2.30 లక్షల ఎకరాల ఆయకట్టులో ఉన్న ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఎపి రైతుల్ని దృష్టిలో పెట్టుకుని డిసెంబర్‌లో కేటాయించిన 4 టిఎంసిల నుంచి ఎపి బోర్డరు మూడో జోన్‌కు కనీసం 1500 క్యూసెక్కులు చొప్పున 15 రోజులపాటు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్ఎంబి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం వేణుగోపాల్, ఎపి జలవనరులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ కిరణ్, రైతు నాయకులు చావా వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి కృషి

కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి


ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ తెలిపారు. అనంతపురం జిల్లాలో బుధవారం కమిషన్ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని జడ్పీ హాలులో ఏర్పాటు చేసిన దళిత గిరిజనుల సమస్యల పరిష్కార వేదికకు కారెం శివాజీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు వంటి ప్రధాన సమస్యల పరిస్కారానికి కృషి చేస్తున్నట్లు చెపారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు అధికంగా వున్నా అధికారులు వ్యవహరాస్తున్న తీరుసరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతినిధులుగా అధికారులు వెనుకబడిన వారి అభివృద్ధికి కృషి చేయాలని, సంక్షేమ పథకాలను దరిచేసే క్రమంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.రవీంధ్ర, రాజారావు, జెడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

3నుంచి అమరావతిలో బౌద్ధ ఉత్సవాలు

- పర్యాటకశాఖ మంత్రి అఖిలప్రియ వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విశ్వశాంతి కోసం అమరావతిలో బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాల్ని నిర్వహించనున్నట్టు పర్యాటక శాఖా మంత్రి అఖిల ప్రియ తెలిపారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లాతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాల్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అమరావతి సాంస్కృతిక రాజధాని అని ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు. విదేశాల నుంచి భారీగా బౌద్ధ భిక్షువులు, ప్రముఖులు ఈ ఉత్సవాలకు తరలి రానున్నట్టు తెలిపారు. అమరావతిలోని బౌద్ధ స్థూపంతో పాటు నాగార్జున కొండ, తొట్లకొండ, అనుపు వంటి బౌద్ధారామాలను వారు సందర్శిందర్శిస్తారన్నారు. ఫిబ్రవరి 4న సుమారు వెయ్యి మంది బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. కొలంబో నుంచి తొలి బౌద్ధ సన్యాసిని భిక్కున్ని కుసుమ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. టిబెట్‌తో పాటు మలేషియా, సింగపూర్, శ్రీలంక, అమెరికా తదితర దేశాల నుంచి బౌద్ధ గురువులు వస్తారన్నారు. బౌద్ధ భిక్షువుల సమ్మేళనం, ప్రార్థనలతో ప్రపంచ రికార్డు నెలకొల్పనున్నట్టు తెలిపారు. ఇంత భారీగా జరగడం ఇదే ప్రథమమన్నారు. పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఈ ఉత్సవాల అనంతరం విదేశీ టూరిస్టుల సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. గతేడాది కన్నా ఈ ఏడాదిలో పర్యాటకంలో 11 శాతం వృద్ధి రేటు పెరిగిందన్నారు. విదేశీ పర్యాటకం వల్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఉత్సవాల కోసం బెంగుళూరు, బుద్ధ గయ, ధర్మశాల, హుబ్లీ వంటి ప్రాంతాల నుంచి వచ్చే భిక్షువుల కోసం ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా తెలిపారు. శ్రీలంక కనక సభ ఆర్ట్ సెంటర్ డైరెక్టర్ సిరి రామ, అమెరికా నుంచి ప్రజ్వల రత్న వజ్రాచార్య, ముంబై నుంచి మ్యూజిక్ డైరెక్టర్ రాజేష్ దబ్రీ వంటి ప్రముఖులు పాల్గొననున్నారని మంత్రి అఖిల ప్రియ తెలిపారు.

సంక్షిప్తం

సచివాలయంలో నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సచివాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రతిజ్ఞ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సచివాలయంలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఈ నెల 30 నుంచి 'విదేశీ విద్యా దీవెన' అభ్యర్థుల ఎంపిక

విదేశీ విద్యా దీవెన పథకానికి అర్హులైన అభ్యర్థుల్ని ఈ నెల 30, 31న ఎంపిక చేయనున్నట్లు కాపు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కోట్ల శివ శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల అభ్యర్థులకు విదేశీ విద్యను అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫేజ్-4 అభ్యర్థుల ఎంపిక విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించనున్నామన్నారు.

ఐజి షేక్ ఇక్బాల్ అహ్మద్‌కు రాష్ట్రపతి అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ ఐజి షేక్ ఇక్బాల్ అహ్మద్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి అవార్డును బుధవారం ప్రకటించింది. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పలువురికి ఉత్తమ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో రాష్ట్రం నుంచి ఇద్దరు పురస్కారాలకు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవ వేడుల సందర్భంగా ఆయన ఢిల్లీలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

'సీమ'లో హైకోర్టు కోసం ర్యాలీ

ప్రజాశక్తి కర్నూలు / కడప

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో న్యాయవాదులు చేపటిన రిలే దీక్షలు బుధవారం కొనసాగాయి. అనంతపురం జిల్లా కేంద్రంలో న్యాయవాదులు కోర్టు నుంచి బ్యానర్లు, ఫ్లెక్సీలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. జిల్లా జడ్జి బంగాళా వద్ద ఉన్న పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్దకు వెళ్ళి, పూలమాల వేసి నివాళులర్పించారు. రాయల సీమ పట్ల పాలకులు వివక్షత చూపుతున్నారని, 1937లో శ్రీబాగ్ ఒడంబడికలో పప్పూరు రామాచార్యులు సంతకం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

హైకోర్టును ఏర్పాటు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచీని ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు కొనసాగాయి. ఈ దీక్షలకు వైసిపి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రీరాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్‌ఖాన్ మద్దతు తెలిపి మాట్లాడారు. దీక్షలకు ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ, గౌరవాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లెక్కల జోగిరామిరెడ్డి దీక్షలకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మస్తాన్‌వలి, మాజీ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి, డిసిసి అధ్యక్షులు నజీర్ అహ్మద్, ఐలు జిల్లా అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసు వలయంలో గొట్టిపాడు





(మొదటి పేజీ తరువాయి)

చేరుకుని ప్రదర్శనగా బయలుదేరారు. వారిని అరెస్టు చేసి తాడికొండకు తరలించారు. అనంతరం మరో బృందం గొట్టిపాడు వెళ్లేందుకు ప్రయత్నించగా సినిమా హాలు సెంటర్లో అరెస్టు చేశారు. మూడో బృందం ప్రదర్శనగా బయలుదేరగా మల్లాయపాలెం సెంటర్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించారు. వారిని కూడా ఈడ్చి లారీలోకి విసిరేశారు. అరెస్టుల సమయంలో నాయకుల్ని రోడ్లపై పడేసి లాగడంతో పలువురికి కాళ్లపై స్వల్ప గాయాలయ్యాయి. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ అరెస్టుల పర్వంతో పత్తిపాడు సెంటర్ రణరంగంగా మారింది.



ఈమని అప్పారావు, నళినికాంత్, లక్ష్మీనారాయణ, కాకుమాను నాగేశ్వరరావు తదితరులకు స్వల్పంగా గాయలయ్యాయి.

మరోవైపు గొట్టిపాడు దళితుల్లో కీలకమైన వారి ఫోన్లను తీసేసుకున్నారు. బయట సమాచారం వారికి అందకుండా చేశారు. దీంతో అరెస్టులపై టీవీల్లో వచ్చిన వార్తల్ని చూసి రగిలిపోయిన దళిత మహిళలు పోలీసు ఆంక్షల్ని లెక్క చేయకుండా గ్రామంలో ధర్నా చేపట్టారు. తమకు సంఘీభావంగా వస్తున్న వారిని అడ్డుకున్నందుకు మండి పడ్డారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో కాలనీలోని అంబేద్కర్ సెంటర్‌లో బైఠాయించారు. తమకు న్యాయం చేయడంలో పాలకులు విఫలమయ్యారని నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి యువకులంతా అభిషేకం చేశారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, అరెస్టులు చేస్తామని పోలీసులు హెచ్చరించినా వారు వెనకడుగు వేయలేదు. మంచినీళ్ల తెచ్చి ఇచ్చినా తాగేందుకు నిరాకరించారు. పోలీసులు ఎంత వారించినా వినకుండా మహిళలు రోడ్డుపైనే బైఠాయించారు. 144 సెక్షన్ అమల్లో ఉందన్న ప్రతిసారీ ఎందుకు పెట్టారో చెప్పాలని మహిళలు పోలీసులను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం నుండే వారిపై ఆంక్షలు విధించారు. వారి నివాస ప్రాంతానికి సమీపంలో జలఫిరంగులు ఏర్పాటు చేశారు. బయటవాళ్లతో మాట్లాడకుండా ఆంక్షలు విధించారు. మనిషి చనిపోయారని, ఖర్మకాండలకు వెళ్లాలని చెప్పినా పంపించలేదు. బహిర్భూమికి పంపించేందుకూ నిరాకరించారు. అధార్‌కార్డులు చూపించినా అంగీకరించలేదు. బయట వాళ్లతో మాట్లాడేందుకు అనుమతి లేదంటూ ఖరాఖండిగా చెప్పేశారు. మరోవైపు అరెస్టు చేసిన వామపక్ష ప్రజా, దళిత సంఘాల నాయకులను గుంటూరులో నేరస్తులను ఉంచే సెల్‌లో ఉంచారు. వారి ఫోన్లనూ స్వాధీనం చేసుకుని బయటవారితో మాట్లాడేందుకు అంగీకరించలేదు. మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును రెండురోజుల తరువాత బుధవారం సాయంత్రం విడుదల చేశారు. ఎన్ని ఆంక్షలు విధించినా వందలమంది కార్యకర్తలు పెదగొట్టిపాడు చేరుకున్నారు. అక్కడ వారిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విడుదల అనంతరం నాయకులు మాట్లాడుతూ దళితులకు న్యాయం చేకూరే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పి.మధు, కె.రామకృష్ణ, శాంతకుమార్, వై.కోటేశ్వరరావు, కొరివి వినయ్‌కుమార్ ప్రకటించారు. దీన్ని రాష్ట్రస్థాయి ఉద్యమంగా మారుస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. దళితులపై దాడిచేసిన వారిని



నిర్బంధానికి నిరసనగా గుంటూరు జిల్లా గొట్టిపాడులో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



ఎందుకు అరెస్టు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్, ఆదేశ్వరరావు, ఈశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి నాగండ్ల బ్రహ్మయ్య, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు పోతురాజు, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణి రాజు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ప్రసాద్, ప్రగతిశీల న్యాయవాదుల సంఘం నాయకులు సురేష్ తదితరులున్నారు

అక్రమ అరెస్టుల్ని ఖండించిన వామపక్షాలు

గొట్టిపాడు దళితుల పై 23 రోజులుగా సాగుతున్న సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని చలో గొట్టిపాడు కార్యక్రమంలో పాల్గొన్న వామపక్షాలు, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని వామపక్షాల నేతలు ఖండించారు. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1న గొట్టిపాడు గ్రామంలో దళితులపై దాడి చేసి, వెలివేసిన అగ్రకుల పెత్తందారులు కౌలుకు ఇచ్చిన పొలాల్ని వెనక్కు తీసుకున్నారని తెలిపారు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతంలో దళితులకు ఇంత అన్యాయం జరుగుతుంటే రాష్ట్రప్రభుత్వం వారికి రక్షణ కల్పించలేకపోయిందని, పైగా పెత్తందారులకే వత్తాసు పలుకుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని, సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని కోరుతూ దళితులకు మద్దతుగా చలో గొట్టిపాడు నిర్వహిస్తున్న వామపక్షాలు, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తల్ని గుంటూరు, పత్తిపాడులో అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణను పత్తిపాడులో బుధవారం అరెస్టు చేసి పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. పలువురు రాష్ట్ర నాయకుల్ని ముందస్తు అరెస్టులు చేసి రెండు రోజులుగా స్టేషన్లు మార్చుతూ నిర్బంధించారని వివరించారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీల నాయకులతో పాటు గొట్టిపాడు దళితుల సంఘీభావ కమిటీ కన్వీనర్ నాయకుల్ని, ఎఐకెఎంఎస్, పిడిఎస్‌యు, దళిత హక్కుల పోరాట సమితి, ప్రగతి శీల న్యాయవాదుల సంఘాలకు చెందిన 129 మంది నాయకుల్ని బుధవారం అరెస్టు చేశారన్నారు. దళితులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే

విడుదల చేయాలని, గొట్టిపాడు దళితులపై దాడులు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. వై వెంకటేశ్వరరావు (సిపిఎం), ముప్పాళ్ల నాగేశ్వరరావు (సిపిఐ), వై సాంబశివరావు (సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ), గుర్రం విజయ్‌కుమార్ (సిపిఐ(ఎంఎల్), ఎం వెంకటరెడ్డి (ఎంసిపిఐ(యు), బి. బంగార్‌రావ్ (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ) బిఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యుసిఐ(సి), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్) జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) సంయుక్త ప్రకటన విడుదల చేసిన వారిలో ఉన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన
-పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చలో గొట్టిపాడు సందర్భంగా బాధితుల్ని పరామర్శించడానికి వెళ్తున్న దళిత, వామపక్ష, ప్రజాసంఘాల, కాంగ్రెస్ నాయకుల్ని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి, దళితులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.





మాట్లాడుతున్న మంత్రి పత్తిపాటి పుల్లారావు

రూ.8 వేల కోట్లతో రిజర్వాయర్ : మంత్రి పత్తిపాటి

ప్రజాశక్తి-వినుకొండ (గుంటూరు)

ప్రపంచ బ్యాంకు నిధులు రూ.8 వేల కోట్లతో గుంటూరు జిల్లా బొల్లాపల్లి మండలం అటవీ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎన్నికల్లోపు చేపట్టేందుకు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి పంపారని పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు వెల్లడించారు. గుంటూరు జిల్లా వినుకొండకు బుధవారం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వాయర్‌తో పల్నాడు ప్రాతంలో తాగు, సాగు నీటి సమస్యను అధిగమిస్తామని, లక్షల ఎకరాలు సాగులోకి వచ్చి ఏడాదికి రెండు మూడు పంటలు పండించొచ్చని అన్నారు. ఇందుకుగాను ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి మొదటి విడత రూ.3500 కోట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. నదుల నుంచి 3 వేల టిఎంసిలు సముద్రంలో కలిసి వృథా అవుతున్న దృష్ట్యా గోదావరి, పెన్నా నదులను అనుసందానం చేసేందుకు సిఎం తీవ్ర కృషి చేస్తున్నారని అన్నారు. కనీసం 1000 టిఎంసిలు నిల్వ చేస్తే నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలో నీటి కొరత ఉండదని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ కుడి కాల్వ నుంచి నీరు రాకున్నా తక్కువ నీరుతో సాగు, తాగు అవసరాలు తీర్చగలిగామని మంత్రి పేర్కొన్నారు.

పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు

విశాఖలో ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో జరగబోయే అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు మరోసారి విశాఖ వేదిక కానుంది. 2016-17 పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులు విశాఖ తీరానికి ఆనుకొని ఉన్న ఎపిఐఐసి మైదానంలో జరగ్గా 2018 సమ్మిట్ కూడా అదే మైదానంలో జరగనుంది. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సిఐఐ), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే ఈ సమ్మిట్‌లో దాదాపు 40 దేశాల నుంచి ఐదువేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. సమ్మిట్ జరిగే మూడ్రోజులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖలో మకాం వేయనున్నారు. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఒప్పందాలు జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు సమ్మిట్‌ల కంటే ఈసారి జరిగే సమ్మిట్‌లో పాల్గొనే దేశాలు, పారిశ్రామికవేత్తల హాజరు ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతినిధుల హాజరుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. దక్షిణ కొరియా, జపాన్, జర్మనీ దేశాల్లో పెద్ద పారిశ్రామికవేత్తలుగా పేరొందిన వారు ఈసారి పాల్గొనే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మొదటిసారి జరిగిన సమ్మిట్‌లో రూ.4.67 లక్షల కోట్ల విలువైన 328 ఒప్పందాలు, రెండోసారి జరిగిన సమ్మిట్‌లో రూ.10.54 లక్షల కోట్ల విలువైన 665 ఎంఒయులు జరిగాయి. 2018 సమ్మిట్‌లో రూ.15 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు జరిగే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది.



భాగస్వామ్య సదస్సు-2018 లోగో

రేపటి నుంచి తెనాలిలో 'తెలుగు సాహిత్య మహోత్సవం'

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకాంతో తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో జనవరి 26, 27, 28 తేదీల్లో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 'తెలుగు సాహిత్య మహోత్సవం' నిర్వహించనున్నామని శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషా చరిత్ర, వికాసం, అభివృద్ధి తదితర అంశాలపై ఈ మహోత్సవంలో చర్చించనున్నారన్నారు. 26వ తేదీన జరిగే కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. తొలిరోజు తెనాలిలోని రణరంగ చౌక్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తారన్నారు. అనంతరం రణరంగచౌక్ నుంచి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం వరకు 'తెలుగు కోసం నడక' ఉంటుందన్నారు. సమావేశంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ డి.విజయభాస్కర్, సాహిత్య మహోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న కామినేని, ఆలపాటి, నన్నపనేని

తెనాలిలో తల్లీపిల్లల వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలిటౌన్ (గుంటూరు)

గుంటూరు జిల్లా తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.15 కోట్లతో నిర్మించిన 150 పడకల తల్లీ పిల్లల వైద్యశాల భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాకే తలమానికమైన ఈ ఆస్పత్రిలో వైద్యులను త్వరలోనే నియమిస్తామన్నారు. ప్రతి బెడ్‌కూ ఆక్సిజన్ సరఫరా అందేలా రూపొందించామని తెలిపారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు అనుబంధంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎవరైనా ముందుకొస్తే ప్రభుత్వం తరపున సహకరిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆలపాటి రాజంద్రప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఏపిఎంఎస్ఐడిసి చైర్మన్ లక్ష్మీపతి, మెడికల్ కౌన్సిల్ చైర్మన్ వై.రాజారావు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సనత్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

108 వాహనాలకు 'బివిజి' కష్టాలు

- ఏజెన్సీ మారాక తీవ్రమైన ఇబ్బందులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

అత్యవసర సమయాల్లో రోగులకు, క్షతగాత్రులు, గర్భిణులకు ఆపద్బాంధవులా ఆదుకుంటున్న 108 వాహన సేవలకు కష్టాలు వీడడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి అనుకూలమైన బివిజి (భారత వికాస్ గ్రూపు) సంస్థకు ఈ వాహనాల నిర్వహణ బాధ్యత అప్పగించిన తర్వాత రోగులకు, సిబ్బందికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. ఇటీవల వరకూ వాహన మెయింటెనెన్స్, డీజిల్ సమస్యలు వెంటాడేవి. ఇప్పుడేమో 108 వాహనాల్లో తాజాగా మందుల కొరత కూడా ఏర్పడింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఈ వాహనాల్లో ఆస్పత్రికి తరలించేటప్పుడు ప్రథమ చికిత్స సైతం అందని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ మారిన తర్వాత నుంచి సిబ్బందికి జీతాలు విడుదల కావడం లేదు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. రాష్ట్రంలో ఈ వాహన సేవలు ప్రారంభమైనప్పటి నుంచి జివికె (గునుపతి వెంకట కృష్ణారెడ్డి) ఏజెన్సీ ఆధ్వర్యాన నడిచేవి. ఈ బాధ్యతను బివిజి సంస్థకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం అప్పగించింది. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి వల్లే జివికె సంస్థను తప్పించి బిజెపికి అనుకూలమైన బివిజికి అప్పగించారనే విమర్శలున్నాయి.

108 వాహనాల్లో ఎప్పుడూ లేని విధంగా ఈసారి మందుల కొరత ఏర్పడింది. వాహనాల్లో 130 రకాల



మందులు ఉండాలి. ప్రస్తుతం ఆక్సిజన్ తప్ప ఏమీ అందుబాటులో లేవు. గతంలో నిర్వహణ బాధ్యత చూసిన జివికె వద్ద ఉన్నప్పటి స్టాక్ తప్ప, కొత్తగా వచ్చిన బివిజి సంస్థ మందులు సరఫరా చేయడం లేదు. వాహనాల్లో సాధారణమైన ఫ్లూయిడ్లు, బెటాడిన్, గ్లౌజులు కూడా లేవని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనానికి డీజిల్, ఫోను ఖర్చులు, ఆక్సిజన్ వంటివి తప్ప, ఇతర వాటిని బివిజి సంస్థ పట్టించుకోవడం లేదని సిబ్బంది వాపోయారు.


మూలకు చేరుతున్న వాహనాలు

108 వాహనాలు మరమ్మతులకు నోచుకోక మూలకు చేరుతున్నాయి. జిల్లాలో 27 వాహనాలకుగానూ ఎస్.కోట, గజపతినగరం, మెంటాడ, గరివిడి, గరుగుబిల్లి వాహనాలు మరమ్మతులకు గురై గ్యారేజీల్లో మూలుగుతున్నాయి. వాటి రిపేర్లకు ప్రభుత్వంగానీ, బివిజి సంస్థగానీ నిధులు విడుదల చేయడం లేదు. మరమ్మతులకు గురైన వాహనాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువవుతున్నట్లు సమాచారం.

సిబ్బందికి బకాయిలు

జివికెకు ప్రభుత్వం రూ.20 కోట్ల బకాయి ఉన్నట్లు సమాచారం. ఆ సంస్థ 108 వాహనాల్లోని పైలెట్లు, ఇఎన్‌టి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు) 2,200 మందికి 53 రోజుల జీతాలు, 40 రోజులు పెయిడ్ లీవ్స్ నిధులు, 12 ఏళ్ల నుంచి రావాల్సిన గ్రాట్యూటీ చెల్లించలేదు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



అత్యధిక 108 వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయించాలి. సిబ్బందికి బకాయిలు చెల్లించాలి. వాహనాల్లో మందులు, ఇతర సౌకర్యాలు కల్పించి సక్రమంగా తిరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదు.

-ఎ.వి.నాగేశ్వర్రావు, 108 వాహన యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు

నెల్లూరులో 42 మంది డీలర్లు తొలగింపు

నెల్లూరు: నెల్లూరు జిల్లాలో పేదల రేషన్ బొక్కిన 42 మంది డీలర్లను విధుల నుంచి తొలగించారు. ఇటీవల ఈ డీలర్లు లబ్ధిదారుల వేలిముద్రలను ట్యాంపరింగ్ చేసి సరుకులను స్వాహా చేశారు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి గతేడాది ఫిబ్రవరి నుంచి ఈ అక్రమాలు జరుగుతున్నట్టు గుర్తించారు. సుమారు రూ.10లక్షలకుపైగానే విలువైన బియ్యం, చక్కెరను స్వాహా చేశారు. 42 మంది రేషన్ డీలర్లను తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆర్డీవోలు తొలగించారు.

యువకుడు అనుమానస్పద మృతి

విజయనగరం :

జిల్లాలోని గజపతినగరం మండలం మర్రివలస గ్రామంలో బుధవారం ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.



శ్రీకాకుళం జిల్లా వలగజ్జి పాఠశాలలో మధ్యాహ్న భోజన గుడ్లను పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ పుష్పరాజు

ఏజెన్సీలో ఫుడ్ కమిషన్ పర్యటన

మద్యం తాగి ఉన్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి- సీతంపేట (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ జె.ఆర్.పుష్పరాజు, డైరెక్టర్ రవిబాబు, సభ్యులు వెంకటరావు, విజయ్‌కుమార్, కృష్ణమ్మ, స్వర్ణగీత, శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. దిగువదారబ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వలగజ్జి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిశీలనలో ఆ పాఠశాల ఉపాధ్యాయుడు జి.రామారావు మద్యం తాగి ఉండడాన్ని గమనించి అతనిపై చర్యలకు ఐటిడిఎ పిఒ ఎల్.శివశంకర్‌ను ఆదేశించారు. దీంతో సంబంధిత ఉపాధ్యాయుడిని పిఒ సస్పెండ్ చేశారు. ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన గుడ్లు చిన్నవిగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీతంపేట సిహెచ్‌సిని, ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ఎన్ఆర్‌సి కేంద్రాన్ని సందర్శించారు. ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. అనంతరం కమిషన్ చైర్మన్ పుష్పరాజు విలేకరులతో మాట్లాడుతూ ఐటిడిఎలో పథకాలను పిఒ శివశంకర్ బాగా అమలు చేస్తున్నారని అభినందించారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

సంపాదకీయం


గొట్టిపాడు ఘోరం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడులో చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే మనం ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉన్నామా అన్న అనుమానం కలుగుతోంది. ఈ గ్రామంలో అగ్రకుల దురహంకారం బుసలుకొట్టింది. పెత్తందారీ దొరతనం దళితులపై దాడికి దిగింది. డిసెంబర్ 31న దళితులపై దాడిచేసిన పెత్తందారులు, మరుసటిరోజు మరింతగా బరితెగించారు. పట్టపగలు ట్రాక్టర్లో రాళ్లు, కర్రలతో వందమందికిపైగా దళితవాడపై దండయాత్ర చేసిన తీరు కారంచేడు, చుండూరు దారుణాలను గుర్తుకుతెస్తోంది. దీనికి తోడు అప్పటినుండి నిరవధికంగా కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ మరోవైపు. ఈ భయానక దాడితో భయోత్పాతానికి గురైన బాధిత ప్రజానీకానికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకపోగా వారిని పరామర్శించడానికి వెళ్లే వారిపై విరుచుకుపడిన తీరు మరీ దారుణం. ఈ దారుణం తెలుసుకుని అక్కడికి వెళ్ళడానికి ప్రయత్నించిన ప్రతి ఒక్కరినీ పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వెనక్కి పంపారు. ఇంత ఘోరం జరిగింది కాబట్టే వామపక్షాలు, దళితసంఘాలు, ఇతర అభ్యుదయ శక్తులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సివచ్చింది. బాధితులకు బాసటగా చలో గొట్టిపాడుకు పిలుపుఇవ్వాల్సివచ్చింది. ఈ కార్యక్రమంపైనా పోలీస్ యంత్రాంగం విరుచుకుపడిన తీరు ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెచ్చాయి. రెండు రోజుల ముందునుండే అరెస్టుల పర్వాన్ని ప్రారంభించింది. ఎక్కడ కనపడితే అక్కడ అరెస్టులు చేసింది. ఇళ్ళలో ఉన్న వారినీ వదలలేదు. అర్ధరాత్రి పూట ఇళ్లపై దాడులు చేసి మరీ తరలించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శితో సహా నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని సాగిన ఈ అరెస్టుల పర్వం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనంగా నిలుస్తోంది. గడిచిన రెండురోజుల్లో వందలాదిమందిని పోలీసులు అక్రమంగా నిర్బంధించిన తీరే దీనికి నిదర్శనం.

గొట్టిపాడు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నది ప్రభుత్వ వర్గాల వాదన. అదే నిజమైతే అక్కడకు వెళ్లనీయకుండా ఇన్ని ఆంక్షలు, ఇంత నిర్బంధం దేనికన్న ప్రశ్నకు సమాధానం లేదు. సర్కారీ వాదనలో నిజం లేదన్న విషయం బుధవారం నాడు గ్రామంలో దళితమహిళలు నిర్వహించిన ఆందోళనతో స్పష్టమైంది. తమకు రక్షణగా వస్తున్న వారిని ఎందుకు అడ్డుకుంటున్నారని వారు ప్రశ్నించడమే సమస్య ఇంకా కొనసాగుతోందడానికి స్పష్టమైన సంకేతం. ఈ వాస్తవానికి మసిపూసే ప్రయత్నాన్ని అధికారులు, పోలీసులు ఎందుకు చేస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం ఊహించడం కష్టమేమి కాదు. నిజానికి సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం కదిలి బాధితులకు అండగా నిలిచిఉండాలి. కానీ, జరిగింది వేరు. అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు పెత్తందారుల మంత్రాంగానికి దాసోహమన్నారు. రాజ్యాంగం ప్రకారం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీస్ యంత్రాంగం సర్కారు పెద్దల ఆదేశాలకు జీ హుజార్ అంది! ఫలితంగా బాధితులపైనే కేసులు బనాయించారు. కంటి తుడుపు చర్యగా పెత్తందారులపైనా కొన్ని కేసులు పెట్టినా నామమాత్రమే! అవి కూడా దాడిలో కీలక పాత్ర పోషించిన వారిపై పెట్టలేదని దళితులు చెబుతున్నారు. 23 రోజులుగా గ్రామంలో సాంఘిక బహిష్కరణ అమలవుతున్నా, దళితులను పనులకు పిలవకుండా, ఉన్న కొద్దిపాటి ఉపాధిని ఊడగొట్టినా, వివక్ష వికృతరూపం దాల్చి పాఠశాలలకు వ్యాపించినా అడిగేవారెవ్వరూ లేరన్నట్లు అధికారయంత్రాంగం వ్యవహరించింది. బాధిత దళితులకు మద్దతుగా ఎవరు ఆ గ్రామానికి వెళ్లినా బట్టబయలయ్యేది అధికారం ముసుగులో సర్కారు పెద్దలు చేసిన ఈ నిర్వాకమే! పెత్తందారుల అకృత్యాలతో అడుగడుగునా చెట్టాపట్టాలేసుకున్న వారి వికృత స్వరూపమే! అందుకే ఇంత నిర్బంధాన్ని ప్రయోగించారు. ప్రజా ఉద్యమకారులను అడుగడుగునా అడ్డుకున్నారు. వాస్తవాలు బాహ్య ప్రపంచానికి వెల్లడి కాకుండా చూడటానికి అన్ని విధాల ప్రయత్నాంచారు.

భారతీయ జనతా పార్టీ మద్దతుతో రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వం, అధికార పెద్దలు వారి భూములను బలవంతంగా లాక్కుంటున్నారు. వారిపై సాంఘిక బహిష్కరణలు పెరిగాయి. కోరలు చాస్తున్న ఈ అణచివేతకు దేవరపల్లి, గరగపర్రు, జెర్రిపోతుల పాలెం, నక్కలదిన్నె , మోదువలస సంఘటనలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. తాజాగా పెద్దగొట్టిపాడు! దళితుల అభివృద్ధి, సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఈ దారుణాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలి. దళిత ప్రజానీకానికి బాసటగా నిలవాలి. పెద్దగొట్టిపాడులో దళితులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలి. వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియలో అవసరమైన సహాయాన్ని బాధిత దళితులకు ప్రభుత్వం చేయాలి. దళితులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి. భవిష్యత్తులోనూ ఇటువంటి అమానుష చర్యలు జరగవన్న భరోసా వారికి ఇవ్వాలి. అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయడంతో పాటు, వారిపై కేసులు లేకుండా చూడాలి.

ఇదీ విషయం



అభివృద్ధంటే ఇక్కడ
పరబ్రహ్మ పదార్థం...
అన్యుల మస్తిష్కానికి
అర్థమవని ప్రయోగం!

మేక్ ఇన్ మాంత్రికులిప్పుడు
చేయబోవు చేతలు...
దేశ చిత్రపటంలో ఇక
పూడ్చలేని గోతులు!

- కొల్లూరు వెంకట్

అసమానతల భారతం

విశ్లేషణ

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారత దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. మన దేశంలో అసమానతలు పొరుగు దేశాలలో కన్నా ఎక్కువగా వున్నాయని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్), ఆక్స్‌ఫామ్ సంస్థలు విడుదల చేసిన తాజా నివేదికలు తెలియచేస్తున్నాయి. దేశంలో గత సంవత్సరం ఉత్పత్తి అయిన మొత్తం సంపదలో 73 శాతం సంపద కేవలం ఒక్క శాతంగా వున్న శత కోటీశ్వరుల దగ్గరే పోగుబడిందని, జనాభాలో సగానికి పైగా వున్న 63 కోట్ల మంది సంపద ఒక్క శాతమే పెరిగిందని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. ఈ ఆర్థిక అసమానతలకు పన్ను ఎగవేతలే ప్రధాన కారణంగా తెలిపింది. ఆర్థిక ప్రగతి విషయంలో పొరుగు దేశమైన పాకిస్తాన్ కంటే వెనుకబడి వున్నామని చెప్పింది. జిడిపిని కొలమానంగా తీసుకుని పరిశీలిస్తే అసమానతలు అధికంగా వున్నాయని డబ్ల్యుఇఎఫ్ పేర్కొంది. గ్లోబల్ వెల్త్, నేషనల్ శాంపిల్ సర్వే, ఫోర్బ్స్ బిలియనీర్స్ డేటా పరిశీలిస్తే అమెరికాలోని టాప్ 1 శాతం ప్రజానీకం దగ్గర వున్న సంపద ... అక్కడి 42 శాతం ప్రజల సంపద కన్నా ఎక్కువగా వుంది. అదే మన దేశంలో టాప్ 1 శాతం దగ్గర వున్న సంపద 58.4 శాతం ప్రజల దగ్గర వున్న సంపద కన్నా ఎక్కువగా వుంది. ఇదేదో హఠాత్ పరిణామం కాదు. 25 సంవత్సరాలకు పైగా అనుసరిస్తున్న నూతన ఆర్థిక సరళీకరణ విధానాల వలనే ఏర్పడింది.




యు ఎస్ రవికుమార్

2004వ సంవత్సరంలో భారతదేశంలో వచ్చిన కొత్త చట్టం ప్రకారం పార్లమెంటుకు పోటీ చేసే వ్యక్తులు తమ సంపద, ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో ఇవ్వాలి. 2004వ సంవత్సరంలో ప్రకటించిన అఫిడవిట్ల ప్రకారం 32 శాతం లోక్ సభ ఎం.పి.లు కోటీశ్వరులు. అది కూడా స్వచ్ఛందంగా. ఇక వారు చెప్పని సంపద ఎంతున్నదో! 2009వ సంవత్సరపు అఫిడవిట్ల ప్రకారం 53 శాతం లోక్‌సభ ఎం.పి.లు కోటీశ్వరులు. 2014 అఫిడవిట్ల ప్రకారం 82 శాతం ఎం.పి.లు కోటీశ్వరులు. అంటే 434 మంది కోటీశ్వరులు చట్ట సభలలో కూర్చొని నిజంగా ప్రపంచంలోకెల్లా అత్యంత పేద ప్రజానీకం కోసం పని చేస్తారా? అని మనం ఆలోచించాలి?

2011-2013 సెన్సెస్ (సామాజిక ఆర్థిక కుల గణాంకాల ప్రకారం) భారత దేశంలో 69 శాతం ప్రజానీకం గ్రామీణ ప్రాంతంలో వున్నారు. ఇందులో 75 శాతం కుటుంబాల్లో నెలకు తలసరి ఆదాయం రూ. 5,000 కన్నా తక్కువగా వుంది. 90 శాతం గ్రామీణ కుటుంబాల్లో నెలకు తలసరి ఆదాయం రూ.10,000 కన్నా తక్కువగా వుంది. 8 శాతం గ్రామీణ ప్రజానీకం మాత్రమే రూ. 10,000 కన్నా ఎక్కువ సంపద ఉంది. బహుశా వీరు ప్రభుత్వ రంగ ఉద్యోగులు, లేదా టీచర్లు అయి వుండొచ్చు. భారత దేశంలో చరిత్రలో ఎప్పుడూ లేనంత వ్యవసాయ సంక్షోభం ఇప్పుడు వుంది. రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా వుంది. భారత ప్రభుత్వం జాతీయ శాంపిల్ సర్వే 2013 ప్రకారం రైతాంగ కుటుంబాల్లో నెలకు తలసరి ఆదాయం రూ.6,426 మాత్రమే. ఇది కూడా ఒక్క వ్యవసాయం వలన వచ్చింది కాదు. వారు కూలి పని, తాపీ పని, గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీటన్నింటి వలన వచ్చినది. అంటే కుటుంబంలో ఐదుగురు సభ్యులు వుంటే సరాసరి మనం లెక్కిస్తే ఒక మనిషికి రూ.1300 కన్నా తక్కువ. 2011 జనాభా లెక్కల ప్రకారం 40 కోట్ల మంది భారతీయులు బడి ముఖం చూడలేదు. 11 శాతం గ్రామీణ ప్రజానీకం మాత్రమే హైస్కూల్ దాటుతున్నారు. 3.41 శాతం గ్రామీణ ప్రజానీకం మాత్రమే గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్నారు. అంటే 130 కోట్ల ప్రజానీకంలో 3.41 శాతం ప్రజలు మాత్రమే గ్రామీణ ప్రాంతాల నుండి డిగ్రీ పూర్తి చేస్తున్నారు. వీళ్ళలో అత్యధిక శాతం కుల వివక్ష, సామాజిక అణచివేతల నుండి పైకి వస్తున్నారు.

'ఒక కంపెనీలో టాప్ సి.ఇ.ఓ, ఆ కంపెనీలో చిన్న కార్మికుడి సంపద నిష్పత్తి 1:100 వుంటే అక్కడ ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుంది అని అర్థం' అని నోబెల్ బహుమతి గ్రహీత పాల్ క్రుగ్‌మెన్ అన్నారు. అప్పుడు అక్కడ 1:1000 శాతం వుంది. అదే భారత దేశంలో అంబానీ సంపద, ఆయన కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడి సంపద నిష్పత్తిని పరిశీలిస్తే 1:50,000, లేదా 1:1,00,000 వుంటుంది. అప్పుడు మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుంది అందామా? ఇంకేమైనా అందామా?



గత సంవత్సరం మన దేశంలోని ఏడు ప్రసిద్ధ ఐటి కంపెనీలు 76,000 మందిని ఉద్యోగాల నుండి తొలగించాయి. నూతన ఆర్థిక విధానాలు వచ్చిన కొత్తలో భారత్‌లో ఐటి పరిశ్రమలు అత్యధిక శాతం ఉద్యోగలు ఇస్తాయని 20 ఏళ్ళ పాటు ఈ ఐటి కంపెనీలకు పన్ను మినహాయింపులు, ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు, తక్కువ ధరకు వందల వేల ఎకరాల భూములు కట్టబెట్టింది. పైగా ఆ కంపెనీలకు హైర్ అండ్ ఫైర్ విధానాలు అమలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ఏడు ఐటి కంపెనీలు అత్యధిక లాభాలు గడిస్తున్నవే. ఉద్యోగాలు కోల్పోయిన వారంతా మధ్య వయస్సులో వున్న వారే. నెలకు రూ. 2 లక్షల ఆదాయం చూసుకొని పిల్లలకు అత్యున్నత స్థాయి విద్యను ఇప్పిస్తున్నారు. నెలసరి అత్యధిక ఇఎంఐ లు కడుతున్నారు. ఒక్కసారి వీరంతా రోడ్డు మీదకు వచ్చేశారు. కానీ ఆశ్చర్యకర అంశం ఏమిటంటే వారి స్థానంలో పాలిటెక్నిక్ చేసిన వారిని, ఐటిఐ చేసిన వారిని 50 వేల రూపాయలకు నియమిస్తున్నారు. ఈ జాబ్ లాస్, అసమానతల మీద ఎక్కడా చర్చ లేదు.

ప్రసిద్ధ అమెరికా కాలమిస్టు, నోబెల్ బహుమతి గ్రహీత పాల్ క్రుగ్‌మెన్ 'న్యూయార్క్ టైమ్స్'లో 2002లో ఒక కీలకాంశాన్ని పేర్కొన్నారు. 'ఒక కంపెనీలో టాప్ సి.ఇ.ఓ, ఆ కంపెనీలో చిన్న కార్మికుడి సంపద నిష్పత్తి 1:100 వుంటే అక్కడ ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుంది అని అర్థం' అని. అప్పుడు అక్కడ 1:1000 శాతం వుంది. అదే భారత దేశంలో అంబానీ సంపద, ఆయన కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడి సంపద నిష్పత్తిని పరిశీలిస్తే 1:50 000, లేదా 1:100000 వుంటుంది. అప్పుడు మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుంది అందామా? ఇంకేమైనా అందామా? ఈ అసమానతలు 25 ఏళ్ళ పాటు ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవస్థీకృత విధానాల వలన ఏర్పడినవే.

భారత దేశంలో ఇప్పుడు ప్రమాదకర, తీవ్ర సామాజిక అణచివేత వుంది. అందుకు నిదర్శనమే రోహిత్ వేముల ఉదంతం. దళితులు, మైనారిటీల మీద దాడులు, హత్యలు. దభోల్కర్, గోవింద్ పన్సారే, కుల్బుర్గి, గౌరీ లంకేష్ లాంటి హేతువాదులను పక్కా ప్రణాళిక ప్రకారం చంపడం ఏంటి ? మనం తీవ్రమైన సామాజిక అణచి వేతకు గురవుతున్నాం. కొత్త తరహా అసమానతలు, అంటరానితనం ప్రవేశిస్తున్నాయి. గత సంవత్సరం అంబేద్కర్ 125వ జయంతి వేడుకలు చేసుకున్నాం. ఆ సందర్భంలో బెజవాడ విల్సన్ బృందం చేసిన భీమ్ యాత్ర వందలాది జిల్లాల నుండి ఢిల్లీ చేరింది. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో ఒక సభ్యుడిని కోల్పోయిన వారే. వారు సెప్టిక్ ట్యాంకుల కింద, మ్యాన్‌హోల్స్‌లో పడి మరణించిన సఫాయి కర్మచారీలే. ఇంత కంటే నీచమైన పని ప్రపంచంలో ఎక్కడా లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ పారిశుధ్య కార్మికులు 2 నుండి 3 లక్షల మంది వుంటారు. ఇందులో 80 శాతానికి పైగా మహిళలు. వీరికి ప్రత్యామ్నాయం చూపాలంటే మనిషికి రూ.3 లక్షలు ఇస్తే చాలు. అంటే 3 లక్షల మందికి రూ. 9,000 కోట్లు. అదే డబ్బును విజయ మాల్యా బ్యాంకులకు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారు. ఆయన మనకు ఆఫర్ ఇచ్చారు. రూ.4,500 కోట్లు తిరిగి ఇచ్చేస్తానని. అంటే పి.పి.పి. విధానంలో మనం భారత దేశంలో సగానికి పైగా ఈ నీచ వృత్తిని పారదోలవచ్చు. అసలు ఇలాంటి విషయాలు మీద చర్చే లేదు.

ఈ మధ్య కొంత మంది స్వాతంత్ర్య సమర యోధులు పాల్గొన్న టీవీ చర్చలు చూసాను. 'పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి. పై మీ అభిప్రాయం ఏమిటి? మీరు ఆ రోజులలో చేసిన పోరాటం ముఖ్య ఉద్దేశ్యం ఏంటి?' అని ప్రశ్నించినప్పుడు 'మా రోజులలో మేం లండన్‌వాలా బ్యాంకులు కొల్లగొట్టి, ప్రజలకు ఇచ్చాం. ఇప్పుడు ప్రజలను కొల్లగొట్టి బ్యాంకులకు ఇస్తున్నారు' అని చెప్పారు. 'ఆ రోజు మా పోరాటం ముఖ్య ఉద్దేశ్యం స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమానత్వం. కానీ మనం స్వాతంత్ర్యం మాత్రమే సాధించాం. మన రాజ్యాంగంలో ఉన్నట్లు పని హక్కు, ఆహార హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు సాధించాలి' అన్నారు. పైన చెప్పినట్లు అసమానతలు తీవ్రస్థాయిలో వుండడం క్షమించరాని నేరం. కానీ మన పాలకులు రాష్ట్రాలను, దేశాన్ని 2020 నాటికి ఏదో రంగంలో నెం.1 చేస్తామని 2045 నాటికి ప్రపంచంలోనే అన్ని రంగాలలో నెం.1 చేస్తామని చెప్తున్నారు. కానీ ముందుగా...2018లో ప్రపంచంలో ఎక్కడా లేని స్థాయిలో అసమానతలకు కారణమైన విధానాలను మార్చుకొని... ఆర్థిక, సామాజిక అసమానతలను ఏ విధంగా తగ్గించాలో ఆలోచించాలి.

(రచయిత ఎ.పి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర కార్యదర్శి, సెల్ : 9440181912)

చర్చ

చైనాలో శాస్త్ర పరిశోధనలకు పెద్ద పీట



ఈ మధ్య ఔరంగాబాద్‌లో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ మాట్లాడుతూ డార్విన్ పరిణామవాదాన్ని ప్రశ్నించాడు. పద్మావత్ సినిమాను నిషేధించకపోతే సామూహికంగా ఆత్మహత్య చేసుకుంటామని జైపూర్‌లో మహిళలు కత్తులు తీసుకుని మరీ బెదిరించారు. ఇటువంటి అంశాల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు నేపథ్యంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో చైనా సాధిస్తున్న ప్రగతి, ఇందుకు అక్కడి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం గమనించాలి. అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్, నేషనల్ సైన్స్ బోర్డ్‌లు ఇటీవల సైన్స్, ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన ద్వైవార్షిక సూచీలను విడుదల చేశాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలలో చైనా సూపర్ పవర్‌గా ఎదుగుతోందని ఈ సూచీలను రూపొందించిన రాబర్ట్ శామ్యూల్సన్ వివరించారు. చైనా ఆర్థిక వ్యవస్థతో పోల్చుకుంటే ఇది అనూహ్యమైనదేమీ కాదని, పరిశోధనా అభివృద్ధి రంగాలలో అక్కడి ప్రభుత్వ ప్రోత్సాహలే ఈ ప్రగతికి కారణమని ఆయన వివరించారు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనల వ్యయంలో ప్రపంచంలో అమెరికా తరువాత చైనా రెండో స్థానంలో నిలిచిందని, 2020 నాటికి ఈ విషయంలో అమెరికాను అధిగమిస్తుందని ఆయన పేర్కొన్నారు. శాస్త్ర పరిశోధనల ప్రచురణలో చైనా ఇప్పటికే అమెరికాను అధిగమించింది. టెక్నాలజీకి సంబంధించిన పరిశోధనా పత్రాల ప్రచురణ చైనాలో ఇటీవల బాగా పెరిగింది. అదే విధంగా చైనాలో 2000 సంవత్సరం నుండి సాంకేతిక నిపుణుల సంఖ్య ఇప్పటి వరకూ 16.5 లక్షల మేర పెరిగింది. ఇందులో ప్రపంచంలో మరే ఇతర దేశంలో లేనంత స్థాయిలో బిఎస్సీ (శాస్త్ర విజ్ఞాన) పట్టభద్రుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం గమనార్హం. అయితే శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహిస్తూ పిహెచ్‌డి పట్టభద్రులను తయారు చేస్తుండటంతో పాటు అనేక మంది విదేశీ విద్యార్థులను అమెరికా ఆకర్షిస్తోందన్న విషయం తెలిసిందే. కానీ తాజా అంతర్జాతీయ పరిస్థితుల్లో అమెరికన్ కళాశాలల్లో విద్యార్థుల నమోదు దశాబ్ద కాలంలో తొలిసారిగా 2017లో తక్కువగా వుంది. అమెరికాలోని ప్రస్తుత ట్రంప్ సర్కారు వలసదారులపై కత్తి దూస్తుండటంతో విదేశీ విద్యార్థులు అమెరికాలో చదువంటేనే భయపడే పరిస్థితికి వస్తున్నారు. ఇందుకు భిన్నంగా చైనా ప్రస్తుతం వున్న హైటెక్ పరికరాల అసెంబ్లింగ్ స్థాయి నుండి సూపర్ కంప్యూటర్, అత్యాధునిక విమానాల తయారీ రంగాల వైపు అడుగులు వేస్తోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో పరిశోధన, అభివృద్ధి వంటి అంశాలను ప్రోత్సహించేందుకు అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను గమనిద్దాం. కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, విద్యుత్ వాహనాల తయారీ వంటి రంగాలలో ప్రపంచంలో అగ్రస్థానాన్ని సాధించటంపై చైనా దృష్టి సారించిందన్న భావన కలుగక మానదు.

ప్రస్తుతానికి పేటెంట్ల సాధనలోనూ, వాటిపై ఆదాయార్జనలోనూ అమెరికా తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తూనే వుంది. కానీ అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు ఇప్పుడు చైనా అత్యంత ఆకర్షణీయ గమ్యంగా మారింది. ఈ విషయంలో అమెరికా, బ్రిటన్‌ల తరువాత చైనా మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఈ రంగంలో రెండో స్థానాన్ని దక్కించుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. దీంతో పాటే విదేశాలలో స్థిరపడిన తమ దేశానికి చెందిన శాస్త్ర పరిశోధకులను వెనక్కి రప్పించే అంశంపై కూడా చైనా దృష్టి సారించింది.అదే విధంగా ఇతర దేశాలకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్శిటీల నుండి పిహెచ్‌డిలు పొందిన శాస్త్రవేత్తలను ఆకర్షించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ కార్యక్రమంలో పేరు నమోదు చేసుకున్న వారికి ఏకమొత్తంగా 80 వేల డాలర్లకు సమానమైన నగదును ఇవ్వటంతో పాటు వారి పరిశోధనలకు 1.5 లక్షల నుండి 3 లక్షల డాలర్ల వరకూ గ్రాంట్‌లను మంజూరు చేసేందుకు కూడా హామీ ఇస్తోంది. క్రమంగా ఈ కార్యక్రమానికి నిధులను పెంచుకుంటూ వస్తున్న చైనా ప్రభుత్వం 2011లో 1,100 మంది దరఖాస్తు చేసుకోగా 143 దరఖాస్తులకు ఆమోదముద్ర వేసింది. అలాగే 2016లో 3,040 మంది దరఖాస్తు చేసుకోగా 590 మందిని అనుమతించింది. ప్రభుత్వం మాత్రమే కాక యూనివర్శిటీలు సైతం భారీ మొత్తాలలో పారితోషికాలను ప్రకటిస్తూ శాస్త్రవేత్తలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ బ్యాటరీల రంగంలో ఎంఐటి పోస్ట్ డాక్టోరల్ ప్రోగ్రామ్ నుండి పట్టభద్రుడైన నిపుణుడికి 65 వేల నుండి 9 లక్షల డాలర్ల గ్రాంట్‌తో పాటు ఇంటి కొనుగోలు కోసం 2.5 లక్షల డాలర్ల నగదును అందచేస్తున్నాయి. ఈ విషయంలో అమెరికా, చైనాలతో పోల్చుకుంటే భారత్ స్థానం ఎక్కడో అట్టడుగు స్థాయిలో కన్పిస్తుంది. ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వంలోని పలువురు నేతల శాస్త్ర వ్యతిరేక ధోరణి దేశ వైజ్ఞానిక ప్రగతికి గండి కొడుతోంది. దేశంలో ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో పెట్టుబడుల ఆకర్షణ కోసం ప్రస్తుతం దావోస్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ దేశ ఆర్థికాభివృద్ధికి శాస్త్ర, సాంకేతిక రంగాలే మూల స్థంభాలన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం వుంది. 2050 నాటికి ప్రపంచంలో నెం.1 స్థాయికి ఎదుగుతామంటున్న చైనా మనకు చెబుతున్న సత్యం కూడా ఇదే.

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జన వాక్యం

కట్టుకథలే ప్రామాణికమా!

డార్విన్ సిద్ధాంతం మీద కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ సిల్లీ మాటలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. పూర్వం అమ్మమ్మ, నానమ్మలు చెప్పిన కథల్లో కోతి నుండి మానవుడు పుట్టినట్లు లేదు కాబట్టి, డార్విన్ సిద్ధాంతం అసత్యమని ప్రకటించేశారు. ఇది వింటుంటే ఒక సంఘటన గుర్తుకొస్తోంది. 1957లో చంద్రుని చూస్తున్న నేను అక్కడ ఉన్న మచ్చను చూసి ఒకింత ఆశ్చర్యంతో మా నానమ్మను అదేమిటని ప్రశ్నించాను. ఆ మచ్చ పొన్న చెట్టు అని, ఆ చెట్టు కింద ఒక పేదరాశి పెద్దమ్మ గుగ్గిళ్ల అమ్ముతోందని చెప్పింది. ఆ దగ్గర్లో ఒక పిల్లవాడు పశువులను మేపుతున్నాడని, ఒకసారి రాహు, కేతువులనే పాములు, ఆ పిల్లవాడిని మింగడానికి వచ్చాయని చెప్పింది. అప్పుడు అతను పేదరాశి పెద్దమ్మను ఆశ్రయిస్తే, ఆమె సూర్య, చంద్రుల సహాయం కోరిందంట! దాంతో వారు ఆ బాలునికి బదులుగా వంతుల వారిగా తమను మింగమని చెప్పారని, అందుకే గ్రహణాలు పడతాయని చెప్పింది. ఇది జరిగిన కొన్నేళ్లకు అంటే సరిగ్గా 1969ల్లో చంద్రునిపై నీల్ ఆమ్‌స్ట్రాంగ్ కాలు మోపాడని, అక్కడ రాళ్ళు, రప్పలు సేకరించి భూమి మీదకు తీసుకొచ్చారని పత్రికల్లో వచ్చింది. అది చూసిన నేను మళ్లీ మా నానమ్మను ప్రశ్నించాను. అయితే అప్పుడు ఆమె ఏమో నాయనా! కలికాలం వచ్చేసింది. ఈ గోల ఏంటో నాకర్థం కావడం లేదంటూ మౌనంగా వుండిపోయింది. ఇదీ అప్పటి నానమ్మల పరిస్థితి. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందడంతో సూర్య, చంద్రులు, రాహువు, కేతువులు గ్రహాలని నిరూపితమై నానమ్మ చెప్పిన కథ కంచికి చేరింది. అయినా ఇప్పటికీ అమ్మమ్మలు, నానమ్మల కట్టుకథలనే నమ్ముదామా! మంత్రి గారూ దీనికి మీ సమాధానమేంటి?

కొలనుపాక బాల సూరయ్యాచారి, విజయవాడ.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

అంతర్జాతీయం

అమెరికా 'దుకాణం బంద్' ఓ ప్రహసనం!


ప్రపంచ అగ్రరాజ్యం అమెరికాలో జనవరి 19 రాత్రి పన్నెండు గంటల నుంచి ప్రభుత్వం పని చేయటం ఆగిపోయింది. ఈ అంశం మూడు రోజుల తరువాత ముగిసింది. దీనికంటే ముఖ్య విషయం ఏమంటే డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆ పెద్దమనిషి పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది గడచిన సందర్భంగా లక్షలాది మంది మహిళలు అమెరికా అంతటా పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేశారు. ఇదిలా వుంటే ప్రభుత్వం మూతపడటం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యేది మిలటరీ కాబట్టి ప్రభుత్వాన్ని తెరిచేందుకు తక్షణం ముందుకు రావాలని మూతకు కారకులైన డెమోక్రాట్లకు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు. ఏడాది పాలనలో తన ఆర్థిక విజయం, సంపదల సృష్టికి గాను పండుగ చేసుకొనేందుకు, మహిళలు ప్రదర్శనలు చేసుకొనేందుకు ఇది సరైన సమయం అంటూ వారిని రెచ్చగొట్టే విధంగా మరో ట్వీట్ చేశారు. నిజానికి ప్రభుత్వ మూత అనేది పెద్ద ప్రహసనం. డెమోక్రాట్లను బందీలుగా మార్చటంతో మరో మార్గం లేక దిగి వచ్చారని అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో మూత ముగిసిన తరువాత ట్వీట్ చేశారు. అధ్యక్షుడు తమతో తెరవెనుక ఒప్పందానికి వచ్చారని డెమోక్రాట్ సెనెటర్ ఒకరు వ్యాఖ్యానించారు. వలసదారుల సమస్యలపై తరువాత చర్చ జరిపేందుకు రిపబ్లికన్లు సమ్మతించారు గనుక డెమోక్రాట్లు మూత ఎత్తివేతకు అంగీకరించారని వార్తలు. అయితే అలాంటి చర్చ జరుగుతుందో లేదో హామీ లేదని, డెమోక్రాట్లు దేనిమీదా గట్టిగా నిలబడరని మరోసారి రుజువైందని అనేక విమర్శలు వచ్చాయి.



ఎం కోటేశ్వరరావు

ప్రపంచంలో ఎక్కడా ఏ రోజూ, ఏ క్షణం కూడా ప్రభుత్వ వ్యవస్థలు మూతపడింది లేదు. ట్రంప్ ఒక సామ్రాజ్యవాద ప్రతినిధి కనుక ఆయన నోటి నుంచి ఆ భాషే వెలువడుతుంది. నిజానికి మూతపడిన రోజుల్లో పనికి దూరమైన ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు నష్టపో తారు, వారు చేసే ఖర్చు తగ్గుతుంది కనుక ఆమేరకు వ్యాపార లావాదేవీలు, వ్యాపారులకు లాభాలు తగ్గుతాయే తప్ప నష్టపోయే దేమీ వుండదు. అదే సందర్భంలో సంక్షేమ పథకాలు నిలిచిపో తాయి.

అసలు అమెరికా ప్రభుత్వం ఎందుకు మూతపడింది? నాలుగు దశాబ్దాల క్రితం సవరించిన రాజ్యాంగం ప్రకారం బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంట్‌లోని ఉభయ సభలు నిర్ణీత మెజారిటీ ఓటుతో ఆమోదించాల్సి వుంది. పార్లమెంట్ ఎగువ సభ సెనెట్‌లోని వంద స్థానాలకు గాను రిపబ్లికన్లకు 51, డెమోక్రాట్లకు 47 మంది, ఇద్దరు స్వతంత్రులు వున్నారు. బడ్జెట్ ఆమోదానికి కనీసం 60 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రభుత్వ ఖర్చుల



ఆమోదానికి జనవరి 19న (మన ఓట్‌ఆన్ అకౌంట్ మాదిరి) జరిగిన ఓటింగ్‌లో అనారోగ్యం కారణంగా రిపబ్లికన్ పార్టీకి చెందిన ఒకరు గైర్హాజరు అయ్యారు. దీంతో 50 మంది అనుకూలంగానూ 49 వ్యతిరేకంగానూ ఓటు చేశారు. ఐదుగురు అధికార పక్ష సభ్యులు ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఓటు చేస్తే, ఐదుగురు ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి అనుకూలంగా తమ పార్టీ వైఖరికి విరుద్ధంగా ఓటు చేశారు. దాంతో తగిన మద్దతు లేక బిల్లు వీగిపోయింది. నిధుల మంజూరు అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచి నిలిచిపోయింది. దీన్నే ప్రభుత్వ మూత అంటున్నారు. ఒప్పందం కుదిరిన తరువాత జరిగిన ఓటింగ్‌లో సెనెట్‌లో 81-18, దిగువ సభ కాంగ్రెస్‌లో 266-150 మెజారిటీతో ప్రతిష్టంభన ముగిసింది.

బడ్జెట్‌కు ఉభయ సభల ఆమోదం, అదుపునకు సంబంధించి నిబంధనలను సవరించిన తరువాత 1976 నుంచి ఇలాంటి మూతలు తాజా ఉదంతంతో సహా పద్దెనిమిది సార్లు జరిగాయి. ఇవి ముగ్గురు రిపబ్లికన్లు, ముగ్గురు డెమోక్రాట్ పార్టీల అధ్యక్షుల హయాంలో జరిగాయి. పదకొండు సార్లు డెమోక్రాట్లు కారణం అయితే, ఏడు రిపబ్లిక్ పార్టీ ఖాతాలో వున్నాయి. వీటిని స్థూలంగా పరిశీలించినప్పుడు అత్యధిక సందర్భాలలో కార్మిక వర్గానికి వ్యతిరేకమైన ప్రతిపాదనలను ముందుకు తెచ్చినపుడే జరిగాయని గమనించవచ్చు. రెండు పార్టీలు ఒకే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాయనే విషయంలో ఎలాంటి భ్రమలకు లోనుకానవసరం లేదు. వున్నంతలో ఏది తక్కువ హాని చేసే పార్టీ అని బేరీజు వేసుకొని మెజారిటీ కార్మికవర్గం, వలస కార్మికులు డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారులుగా వుంటున్నందున వారిని నిలబెట్టుకొనేందుకు ఆ పార్టీ, రిపబ్లికన్లతో పోల్చితే సంక్షేమ చర్యల గురించి ఎక్కువగా మాట్లాడుతోంది.

తాజా మూత విషయానికి వస్తే బాలలుగా వున్నపుడు అమెరికాకు అక్రమంగా తీసుకువచ్చి వారి చేత తక్కువ వేతనాలకు పని చేయించుకొని ఇప్పుడు పెరిగి పెద్ద వారైన తరువాత మార్చి నెలలో బయటకు గెంటివేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సమస్యపై వారి సంక్షేమం కోసం నిధుల కేటాయింపు సక్రమంగా లేదంటూ డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. అక్రమంగా వలస వచ్చిన వారి బెదిరింపులకు లొంగకూడదంటూ రిపబ్లికన్లు పట్టుబట్టారు. ప్రతిసారీ అత్యధిక సందర్భాల్లో ఏదో ఒక రాజకీయంలో భాగంగానే ఇది జరుగుతోంది. ఇప్పుడు అమెరికాకు వలస వచ్చిన వారి గురించి అధికార ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పని లేకుండా ఇళ్లకు పోవటం లేదా తరువాత వేతనాలు తీసుకొనే ప్రాతిపదికన పని చేయటం ఇలాంటి సందర్భాలలో సర్వసాధారణం. మిలిటరీలో పని చేసే పౌర ఉద్యోగులకు కూడా ఇదే వర్తిస్తుంది. మిలిటరీ, గూఢచార, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో వున్న సిబ్బందికి ఈ మూత వర్తించదు కనుక వారికి ఎలాంటి ఇబ్బంది వుండదు. కొన్ని కవాతులు, మిలటరీలోకి తీసుకోవటం కొన్ని కార్యక్రమాలకు పరిమితంగా ఆటంకం కలుగుతుంది తప్ప అమెరికన్లు విదేశాల్లో జరిపే దాడులు, దుండగాలకు, పోలీసు, అత్యవసర సేవలుగా ప్రకటించిన వాటికి మాత్రం ఎలాంటి ఇబ్బంది వుండదు. ఐదు సంవత్సరాల క్రితం ఒబామా హయాంలో 16 రోజుల మూత సమయంలో ఎనిమిది లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను వేతనాలు లేకుండా ఇళ్లకు పంపివేశారు. అమెరికాలో పని చేయకపోతే వేతనం ఇచ్చే విధానం లేని విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అలాంటిదే జరుగుతుంది. అందువలన ముందే చెప్పుకున్నట్లు జరిగే నష్టం కార్మిక వర్గానికే.

'జనవరి 20 నాటికి డోనాల్డ్ ట్రంప్ పదవీ కాలం ఏడాది పూర్తవుతుంది. దానికి ముందుగానే ఇటువంటిదేదో జరగనుంద'ని కొన్ని సూచనలు వెలువడినా ప్రభుత్వ యంత్రాంగం అంత తీవ్రంగా తీసుకోలేదని వార్తలు వెలువడ్డాయి. జరిగిన నష్టం ఎంతో తరువాత వెల్లడి అవుతుంది. ఈ ఏడాది 4.1 లక్షల కోట్ల డాలర్ల మేరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. దీనిలో సగానికి పైగా మిలిటరీకి ఇతర సంస్థలకు కేటాయిస్తారు. మూడోవంతుకు అటూ ఇటూగా వున్న మొత్తానికి మాత్రమే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి వుంటుంది. డెమోక్రాట్లు సృష్టించిన ఈ మూత, దానికి కారణమైన రిపబ్లికన్ల ప్రతిపాదనలు రెండూ ఈ ఏడాది నవంబరులో జరగనున్న పార్లమెంటు దిగువసభ ఎన్నికల దృష్టితోనే అన్నది గమనించాలి.

jeevanapageps@gmail.com

జీవన the family

ప్రజాశక్తి

విజయవాడ గురువారం 25-1-2018 5

JEEVANA



రంగస్థలంపై రెడ్‌లైట్

అక్కడున్న వారంతా సామాజిక వివక్షను ఎదుర్కొన్న బాధితులే, హింసను అనుభవిస్తున్నవారే. కామతిపుర కథలు కోకొల్లలు. ఒకప్పుడు అది.. ముంబయి నగర నిర్మాణం కోసం పొట్ట చేతపట్టుకుని వెళ్లిన తెలుగువారి నివాసం. తర్వాత కథ మారింది. ఎర్రని వెలుతుర్లో చీకట్లు కమ్ముకున్నాయి. కథలు కథలుగా ఎన్నో సినిమాలకు ఆసరాగా నిలిచిన ఆ జీవితాలు ఇప్పుడు నాటకంగా రూపుదిద్దుకున్నాయి. 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్'గా ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రదర్శనల తర్వాత మొట్టమొదటిసారి తెలుగునేలపై ప్రద్రర్శించారు. ఈ సందర్భంగా 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' నాటకం ఏం చెబుతోంది? ఎర్రటి వెలుతురులో.. కనిపించే చీకటి కథలేంటి? తెలుసుకుందాం పదండి!

ముంబయి మహానగరంలో శివారున ఉండేదే కామతిపుర ప్రాంతం. ఆసియాలోనే అతిపెద్ద 'రెడ్‌లైట్ ఏరియా'ల్లో రెండవస్థానం దానిది. తెలుగు ప్రాంతం నుంచి 1795 కాలంలో భవననిర్మాణ కార్మికులుగా వెళ్లిన కామతీల (కార్మికుల) నివాస ప్రదేశమది. తర్వాత ఎందరో వచ్చి చేరారు. గుజరాత్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులకు ఆవాసమిచ్చిన ఆ ప్రాంతం 19వ శతాబ్దంలో రెడ్‌లైట్ ఏరియాగా మారిపోయింది. అలాగని అక్కడ రెడ్‌లైట్లు ఉండవు. ఇరుకు గదుల్లో, అతుకుల బొంతలపై, శరీరాన్ని అమ్ముకుంటేగానీ రోజు గడపలేని అభాగ్యులుండే 'ఎర్రని వీధి (లాల్ బజార్)' అది. 1992 లెక్కల ప్రకారం 50 వేల మంది సెక్స్ వర్కర్లు ఉండేవారక్కడ. కొన్నేళ్లకు తగ్గుతూ వచ్చారు. అయినా హింస, వివక్ష మాత్రం తగ్గనే లేదు. అందుకే సెక్స్ వర్కర్లకు పుట్టిన అమ్మాయిలు కొందరు కలిసి 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' (రెడ్‌లైట్ ఎక్స్‌ప్రెస్) అనే నాటకాన్ని రూపొందించారు. ప్రపంచమంతటికీ ఈ నాటక ప్రదర్శన



ద్వారా తాము అనుభవిస్తున్న జీవితాలను తెలియజేస్తున్నారు.

లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్

ఇప్పటికే యుఎస్, లండన్, కేంబ్రిడ్జ్, డబ్లిన్, మంచెష్టర్, ఈడెన్‌బర్గ్ వంటి దేశాల్లో ప్రదర్శించిన లాల్‌బత్తి ఎక్స్‌ప్రెస్ నాటకం జనవరి 23న మొట్టమొదటిసారి హైదరాబాద్‌లో ప్రదర్శించారు. ఈ నాటకాన్ని చూడటానికి సుమారుగా 1000 మంది ప్రేక్షకులు వస్తారనుకుని నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తే, 3000 మంది హాజరవడం అందర్నీ ఆశ్చర్యపరచింది. బాలలపై ఆత్యాచారం, వివక్ష అంశాలే ఈ నాటకంలోని ఇతివృత్తాలు. ఇందులో నటించిన వారిలో ఒకప్పటి సెక్స్‌వర్కర్లు, సెక్స్‌వర్కర్ల పిల్లలు, బాల్యంలోనే లైంగిక హింసను ఎదుర్కొన్నవారు ఉన్నారు. గంట నిడివిగల ఈ నాటకంలో పిల్లల జీవితాలను రైలు ప్రయాణంగా మార్చితే, ఒక్కోస్థాయిలో ఒక్కో స్టేషన్‌గా కనిపిస్తుంది. సమస్యాత్మకమైన వారి బాల్యం, ఎదుర్కొన్న వివక్ష, పెరిగే వయసులో వారిపై జరిగిన లైంగిక హింస, ప్రస్తుత సమాజం వారి పోరాటానికి ఇవ్వాల్సిన మద్దతు, అందించాల్సిన సంతోషం అనే అంశాలు వివిధ అంకాల ద్వారా కనిపిస్తాయి. 'ఇందులో నటించిన వారంతా అలాంటి జీవితాన్ని అనుభవించినవారే కనుక.. వారికి నటనలో తర్ఫీదు ఇవ్వాల్సిన అవసరం రాలేదని అంటారు.. నాటకానికి దర్శకత్వ సహకారం అందించిన పంకజ్ తివారి.



మూడు అంకాలుగా...!

నాటకం మొదటి అంకంలో.. అమ్మాయిలు ప్రేక్షకుల నుంచి కొందరు వాలంటీర్లను పిలుస్తారు. వారంతా కలిసి రైలులా ఒకవైపు వరుసగా నిల్చుని ఉంటారు. తర్వాత అమ్మాయిలు సమాజంలో మతాలు, కులాలు, లైంగిక ఆసక్తిని బట్టి ఎలాంటి వివక్షలున్నాయో చెబుతూ, అలాకాక మనుషులందర్నీ సమానంగా చూడాలంటూ వివరిస్తారు. రెండో అంకంలో.. ఈ అమ్మాయిల బాల్యం ఎలా ఉండేదో చెబుతూ, విద్యాసంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆరోగ్యకేంద్రాల్లో, ఆర్థిక, మత పరిస్థితుల్లో వీళ్లు ఎదుర్కొన్న వివక్షను తెలియజేస్తారు. చివరి అంకంలో అమ్మాయిలంతా వృత్తాకారంలో కూర్చొని, ఒక్కొక్కరిగా వారి ఉద్దేశాల్లో విజయం అంటే ఏమిటో, దాన్ని సాధించడానికి వారు ఎలాంటి అడ్డంకులను ఎదుర్కొన్నారో చెబుతారు. ఈ నాటకంలో నాటకీయత తక్కువగా ఉండి, కథనానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండటం విశేషం. నాటకాన్ని రూపొందించి, ముంబయికి చెందిన 'క్రాంతి' అనే ఎన్‌జిఓ విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వడానికి సహకరించింది. ఈ అమ్మాయిలంతా 'క్రాంతి' పాఠశాలలో విద్యార్థులే.

ఆదుకున్న 'క్రాంతి'

'క్రాంతి' వీరికి విద్య నేర్పించడంతో పాటు ప్రఖ్యాతి చెందిన యూనివర్సిటీల్లో చదువుకునే విధంగా ఈ పిల్లలకు మార్గం చూపుతూ, వారి అభివృద్ధికి తోడ్పడుతుంది. ఇందులో భాగంగానే 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కామతిపురలో సెక్స్‌వర్కర్ల పిల్లలు చదువుకుని, మంచి భవిష్యత్తు పొందడానికి ఇదొక వేదిక. 'క్రాంతి' సహకారంతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్వేతా కత్తి సాధించిన విజయం చెప్పకోదగింది. ఈమె రెడ్‌లైట్ ఏరియా నుంచి ఒక విదేశీ విశ్వవిద్యాలయంలో చదివిన మొట్టమొదటి భారతీయ అమ్మాయిగా గుర్తింపు పొందింది. కామతిపురలో అందరి అమ్మాయిల్లా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న శ్వేతా తన తల్లినీ, కుటుంబాన్నీ ఆ ప్రదేశం నుంచి బయటకు తీసుకురావాలని నిశ్చయించుకుంది. దానికోసం ఉన్నతంగా చదవాలనుకుంది. అందుకే ఎన్నో కష్టాలకోర్చి, తన ఆశయసాధనలో ముందుకుపోతున్న శ్వేతకు ఐక్యరాజ్యసమితి అందించే 'యూత్ కరేజ్ అవార్డు-2014' దక్కింది. కామతిపురలో ఎందరో అమ్మాయిలు శ్వేతలా ఏదో ఒకటి సాధించాలనే కలలు కంటున్నవారే. అలాంటి వారందరికీ 'క్రాంతి' సహాయ సహకారాలు అందిస్తుంది.



తల్లితో శ్వేత

రాబిన్ చౌరాసియా

'క్రాంతి' స్కూల్ స్థాపకురాలు, నిర్వాహకురాలు రాబిన్ చౌరాసియా. యునైటెడ్ స్టేట్స్ ఎయిర్‌ఫోర్స్‌లో అధికారిగా చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి ముంబయి వచ్చేసింది. కామతిపురలో ఎందరో ఆడపిల్లలు.. ఓ అమ్మకం వస్తువుల్లా మారడాన్ని భరించలేకపోయింది. వారి అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేసింది. రాబిన్ ఈ పిల్లల గురించి చెబుతూ, 'హింసతో కూడిన వారి గతం నుంచి బయటకు రావడానికి చికిత్సతో పాటు నాటకకళ చాలా సహాయం చేస్తుందని' చెబుతుంది. వీరి కోసం ఆమె చేస్తున్న కృషికి మెచ్చి 'వార్కి ఫౌండేషన్స్ 2017' గ్లోబల్ టీచర్ ప్రైజ్‌కు నామినేట్ చేసింది. ఈమె నిర్వహించే 'క్రాంతి' స్కూల్లో ప్రతి అమ్మాయినీ దృష్టిలో పెట్టుకుని, సిలబస్ రూపొందిస్తారు. ఎందుకంటే ఇక్కడ కొందరికి వివిధ భాషల్లో ప్రవేశం ఉంటే, మరికొందరు నిరక్షరాస్యులు. అందుకే ఇక్కడ ప్రతి వ్యక్తినీ ప్రత్యేకంగానే చూస్తారు. ఇంగ్లీష్ పాఠాలతోపాటు, ఐటి, ఆరోగ్యం గురించి బోధిస్తారు. అంతర్జాతీయ సమకాలీన అంశాలు, భూగోళశాస్త్రం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, యోగా, మెడిటేషన్ వంటి అంశాల్లో తర్ఫీదు ఇస్తారు. అంతేకాకుండా వివిధ సామాజిక అంశాల్లో స్వచ్ఛందంగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఇవన్నీ రాబిన్ చౌరాసియా ఆలోచనలే. ఈ పిల్లలందరూ కూలి పనులు చేసుకోకుండా జర్నలిస్టులుగా, డ్యాన్సర్లుగా, చిత్రకారులుగా, అంతరిక్ష పరిశోధకులుగా అత్యున్నతమైన స్థాయిల్లో నిలబడాలనే రాబిన్ కోరుకుంటుంది. ఈ నాటకం గురించి 'క్రాంతి' సహస్థాపకురాలు బనీదాస్ మాట్లాడుతూ.. 'సెక్స్‌వర్కర్లను శ్రమజీవులుగా గుర్తించినప్పుడే సమాజంలో వీరిపై ఉన్న వివక్ష తగ్గుతుంది' అంటారు.



రాబిన్ చౌరాసియా

రాబిన్ చౌరాసియా ఆలోచించినా, 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' ప్రదర్శించినా... వీటి వెనుక ఉన్న సంకల్పం అందరూ అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' బృందం కేరళలో నిర్వహించబోయే అంతర్జాతీయ నాటకోత్సవాల్లో తమ నాటకాన్ని ప్రదర్శించడానికి సిద్ధమవుతోంది. **వీరి సమస్యల గురించి చర్చించడానికి 'లాల్ బత్తి ఎక్స్‌ప్రెస్' అనే నాటకం ఒక వేదిక మాత్రమే. ఇలాంటివారు మరింత మంది సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్నారు.** ఇలాంటి వారంతా అభివృద్ధి పథంలో నడవడానికి మరిన్ని 'ఎక్స్‌ప్రెస్‌లు' రావాలని కోరుకుందాం!!

- జీవన డెస్క్

కోరిక తీరని చిరుమొలక

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి నర్సరీలో ఒక చిరుమొలక ఉంది. అది పుట్టినప్పటి నుంచి ఏదైనా స్కూల్‌లో తనను నాటితే బాగుండు అని రోజూ అనుకుంటుండేది. అది అనుకున్నట్లే ఒకరోజు ఒక తోటమాలి నర్సరీలో ఉన్న ఈ చిరుమొలకను కొని, తను పనిచేసే స్కూలులో నాటాడు. తన కోరిక తీరినందుకు ఆ మొలక ఎంతో సంతోషించింది. రోజూ పసిపిల్లల నవ్వుల మొహాలు చూడాలనీ, వారి ముద్దుముద్దు మాటలు వినాలనీ, ఇంకా పసిపిల్లల లేత పాదాల నర్తనలు చూసి కొమ్మలు ఊగించాలని అనుకునేది. చిన్నారులు ఎండబారిన పడకుండా గొడుగులా తాను మారాలనీ.. పిల్లలకు స్వచ్ఛమైన గాలిని అందించాలనీ... ఇలా ఎన్నో రకాల కోరికలున్నాయి చిరుమొలకకు. కానీ కొన్నిరోజుల్లోనే దాని ఆనందమంతా ఆవిరై పోయింది. చిరుమొలక అక్కడి పరిస్థితులకు ఆశ్చర్యపోయింది. తన తండ్రి, తాతలు చెప్పినట్టుగా పిల్లలు ఆనందంగా లేరు.

బస్తాలు మోసే కూలీల్లా వీపులపై బ్యాగులు, అప్పుల్లో మునిగిపోయిన వారి మొహాలలో ఆందోళన.. ఎప్పుడూ ఏదో హడావిడి.. కాసేపట్లో యుద్ధం జరగపోతుందన్నంతగా గబగబా పనులు.. ఒకరినొకరు పలకరించుకోవడాలు లేవు. కేరింతలు, తుళ్లింతలు అసలే లేవు. నవ్వులు మరిచిన మొహాలకు కళ్లద్దాలు. ప్రయోగశాలలో శాస్త్రవేత్తల్లా ఏదో ఆలోచనల్లో మునిగిపోయి, ఎటు వెళ్తున్నారో తెలియకుండా వాళ్లల్లోవాళ్లు మాట్లాడుకుంటున్నారు. 24 గంటలు పుస్తకాలు కళ్లముందే పెట్టుకొని చదవడం, వందలసార్లు ఇంపోజిషన్లు రాయడం, స్లిప్‌టెస్ట్‌ల పేరుతో రోజూ టెన్షన్ పడటం ఇవే చిన్నారుల దినచర్య. ఇలా స్కూలు పిల్లల జీవితాన్ని చూసిన మొలక చాలా బాధపడింది. ఆదివారాలైనా తన దగ్గరకు వచ్చి ఆడుకుంటారేమోనని ఎంతగా ఎదురుచూసినా చిన్నారులెవరూ రావడం లేదు. ఆదివారాలూ వారి దినచర్యలో ఎలాంటి మార్పూ లేదు. సరే మిగతా రోజుల్లోనైనా మైదానంలో ఆటలైనా ఆడుకుంటారేమో అని చూస్తే వారికి డ్రిల్ పీరియడే లేదట! ఇక మొక్కకు విసుగొచ్చింది. వాళ్ల నవ్వులు చూసి తాను మురిసిపోవాలనుకుంటే అసలు తనను గమనించేవాళ్లే లేరు. ఛీ ఏమిటీ జీవితం అనుకున్నది. తన జీవితానికో అర్థంలేదని బాధపడింది. క్రమంగా మొలక తన ఆశలు అడియాసలు అయినందుకు రోజురోజుకు క్షీణించడం మొదలెట్టింది. అలా క్షీణించిన మొలక చెట్టుగా మారకుండానే ఒకరోజు చనిపోయింది. మొక్క చనిపోవడం గమనించిన తోటమాలి "సారవంతమైన మట్టిలో నాటాను.. రోజూ నీళ్లు పోస్తున్నాను. అయినా ఈ మొక్క చచ్చిపోయిందే" అని బాధపడ్డాడు. కానీ, తోటమాలికేమి తెలుసు. ఏదైనా బతకడానికి నీరు, ఆహారం మాత్రమే కాదు ఆనందం కూడా ముఖ్యమని. ★



సన్నబడ్డాక మొహంపై ముడతలా?

కొంతమందిలో బరువు తగ్గిన తరువాత చర్మం ముడతలు పడి ముఖవర్చస్సు తగ్గుతుంది. అలాంటి వాళ్లు ఈ చిట్కాలు పాటించడం ద్వారా చర్మం బిగుతుగా అవుతుంది.

బరువు తగ్గాక చర్మం ముడతలు పడుతుంది. దీన్ని నివారించాలంటే అధిక



పోషకాలుండే పదార్థాలు తీసుకుంటే చర్మం బిగుతుగా తయారవుతుంది. అది కూడా విటమిన్-ఎ,సి ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి త్వరగా బయటపడొచ్చు. అలాగే జింక్, సెలీనియం వంటి ఖనిజాలు అధికంగా లభించే గింజల్ని తీసుకోవడంవల్లా ముడతలు పోతాయి. అంతేకాకుండా చికెన్, ఫిష్ వంటి ప్రోటీన్ ఫుడ్‌ని ఆహారంలో భాగంగా చేసుకోవాలి. వీలైనంత వరకు పచ్చి కూరగాయలు, పండ్లు తీసుకుంటుండాలి. ఇవి తినడంవల్ల చర్మసౌందర్యానికి ఉపయోగపడే అనేకరకాల విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా అందుతాయి. వీటితోపాటు చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే నీళ్లు ఎక్కువగా తాగడం చాలా అవసరం. లేకపోతే చర్మం పొడిబారి, ముడతలు మరింత ఎక్కువవుతాయి. అలాగే శరీరాన్ని బ్రష్‌తో రుద్దడం వల్ల మృతకణాలు తొలగిపోయి చర్మానికి పటుత్వం తిరిగొచ్చే అవకాశం ఉంది. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ కూడా బాగా జరుగుతుంది. అలాగే ప్రతిరోజూ బాదం నూనెతో చర్మాన్ని మర్దనా చేసుకోవడం వల్ల బిగుతుగా అవుతుంది. ఆముదంలో కొన్ని చుక్కలు నిమ్మరసం, లావెండర్ నూనెని కలిపి రాత్రి పడుకోబోయే ముందు ముఖానికి మాస్క్‌లా వేసుకోవాలి. ఇలా చేయడంవల్ల చర్మం కొద్దిరోజుల్లోనే బిగుతుగా, అందంగా తయారవుతుంది.

జీవన సౌరభం

విజయాలే లక్ష్యాలు కావు, విలువలున్న వ్యక్తిగా ఎదగడమూ ముఖ్యమే.

మీ కోసం



బి-కాంప్లెక్స్ క్యాప్యూల్స్‌ను ఓపెన్ చేసి ఫ్లవర్‌వాజ్‌లో వేస్తే పువ్వులు ఎక్కువరోజులు తాజాగా ఉంటాయి.

ఆకుకూరతోనే ఆరోగ్యం

దేహానికి అవసరమైన ఖనిజలవణాలు పుష్కలంగా ఉండేది ఆకుకూరల్లోనే. ఎందుకంటే సున్నం, భాస్వరం, ఉప్పు, ఇనుము తదితర ఖనిజలవణాలను సరాసరి స్వీకరించి, జీర్ణించుకునే శక్తి మనకు లేదు. ప్రకృతి ఆ శక్తిని వృక్షాలు, మొక్కలకు ఇచ్చింది. ఖనిజ లవణాలను అవి స్వీకరించి, సేంద్రియ లవణాల రూపంలో కాండాలలోను, ఆకులలోను, కాయలలోను, పండ్లలోను, పూలు, దుంపలలోను పదిలపరచుకుంటాయి. వాటిని మనం ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఆకుకూరలలో ఇనుము విశేషంగా ఉంటుంది. ఎ,బి,సి,డి విటమిన్లూ సమృద్ధిగా ఉంటాయి. అందుకే ఆకుకూరలను దేహ రక్షక పదార్థాలుగా పరిగణిస్తుంటారు. ఆకుకూరలలోగల మాంసకృత్తులు సులభంగా జీర్ణమై, త్వరగా శరీర ధాతువులలో కలిసిపోవు స్వభావాన్ని కలిగి ఉంటాయి. ప్రతి మనిషికి సగటున రోజుకు రెండు మొదలు నాలుగు ఔన్సుల వరకూ ఆకుకూరలను తీసుకోవటం అవసరమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బలవర్ధకమైన ఆహారం కావలసిన వారికి ఆకుకూరలు సహాయపడవు. వ్యాధి ఉధృతిని తగ్గించటానికి, తిండి ఎక్కువై, వ్యాధులు వచ్చిన వారికి ఆకుకూరలు సహాయపడతాయి. ఆకుకూరలు కన్నా కాయగూరలే మంచివి. ఎండలో కాయకష్టం చేసేవారికి ఆకుకూరలు అనవసరం. సూర్యరశ్మి సూటిగా తగలని వారిలో (కార్యాలయాల్లో పనిచేసేవారికి) సేంద్రియ లవణాల కొరతను ఆకుకూరలు పూరిస్తాయి. ★





టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

స్ట్రెస్ హార్మోన్ అని దేనికి పేరు?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

అంతఃస్రావిక వ్యవస్థ

అంతఃస్రావిక వ్యవస్థ అధ్యయనాన్ని 'ఎండోక్రైనాలజీ' అంటారు.

✧ ఎండోక్రైనాలజీ పితామహుడు – థామస్ ఎడిసన్
✧ శరీరంలోని వివిధ భాగాల మధ్య సమన్వయం కోసం కృషిచేసే అవయవ వ్యవస్థలు నాడీవ్యవస్థ, అంతఃస్రావిక వ్యవస్థ.
✧ నాడీవ్యవస్థ ద్వారా ప్రచార సమాచారం వేగంగా జరుగుతుంది.
✧ అంతఃస్రావిక వ్యవస్థ ద్వారా సమాచారం నెమ్మదిగా జరుగుతుంది.

1. బహిస్రావిక గ్రంథులు / నాళ గ్రంథులు

ఈ గ్రంథులు స్రవించే రసాయనాలను ఎంజైములు అంటారు.
✧ మొదట కనుగొన్న ఎంజైమ్ – జైమేజ్
✧ ఎంజైములు నాళాల ద్వారా ప్రయాణించి చర్య అనంతరం తిరిగి ఏర్పడతాయి.
✧ ఇవి రసాయనికంగా ప్రోటీన్స్‌చే నిర్మితమవుతాయి.

2. అంతఃస్రావిక గ్రంథులు/ వినాళ గ్రంథులు

ఈ గ్రంథుల నుంచి స్రవించే రసాయనాలను హార్మోన్లు అంటారు.
✧ ఈ హార్మోన్లు రక్తం ద్వారా ప్రయాణించి, చర్య అనంతరం విసర్జితమవుతాయి.

హార్మోన్స్ : రసాయన రాయబారులను హార్మోన్లు (కెమికల్ మెసెంజర్స్) అంటారు.
✧ హార్మోన్లను కనుగొన్నది – బెలిన్ అండ్ స్టార్లింగ్
✧ హార్మోన్ ముఖ్య లక్షణం – ఒకచోట ఉత్పత్తయ్యి మరొక చోటకి రవాణా చెంది, రవాణా చెందిన ప్రదేశంలో తమ చర్యను పూర్తిచేస్తాయి.
✧ రసాయనిక స్వభావాన్ని బట్టి హార్మోన్లు మూడు రకాలు...

1. స్టిరాయిడ్ హార్మోన్లు / లైంగిక హార్మోన్లు
ఉదా : టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్, కార్టిసాల్, ఆల్డోస్టిరాన్

2. అమైనో ఆమ్లాలతో నిర్మితమైన హార్మోన్లు
ఉదా : అడ్రినలిన్, థైరాక్సిన్, మెలనిన్, వాసోప్రెసిన్

3. ప్రోటీన్లతో నిర్మితమైన హార్మోన్లు
ఉదా : సొమాటో ట్రోఫిక్ హార్మోన్, కాల్సిటోనిన్, ఆక్సిటోసిన్

✧ అంతఃస్రావిక గ్రంథులు మూడు రకాలు..
1. నిర్దిష్ట అంతఃస్రావిక గ్రంథులు
2. మిశ్రమ గ్రంథులు
3. ఇతర గ్రంథులు

1. నిర్దిష్ట అంతఃస్రావిక గ్రంథులు

ఎ. థైరాయిడ్ గ్రంథి/ అవటు గ్రంథి

ఇది వినాళ గ్రంథుల్లోకెల్లా అతి పెద్ద గ్రంథి.
✧ స్వరపేటిక కింద భాగంలో (మెడలో) ఉంటుంది.
✧ దీనిని **'ఆడమ్స్ ఆపిల్'** అంటారు.
✧ ఇది రెండు లంబికలను కలిగి హెచ్ ఆకారంలో ఉంటుంది.
✧ ఈ గ్రంథి నుంచి థైరాక్సిన్, కాల్సిటోసిన్ అనే హార్మోన్లు ఉత్పత్తవుతాయి.

థైరాక్సిన్ : దీనిలోని మూలకం – అయోడిన్ (12)
✧ ఇది రక్తంలో ఆక్సిజన్ రవాణాను అధికం చేసి, పెరుగుదలలో సహాయపడుతుంది.

బిఎంఆర్ : గది ఉష్ణోగ్రత వద్ద ఎటువంటి ఆహారం తీసుకోకుండా, కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తరువాత జీవక్రియ వేగాన్ని బిఎంఆర్ అంటారు.

✧ చిన్నపిల్లల్లో ఈ హార్మోన్ పూర్తిగా లోపించడం వల్ల 'క్రిటినిజం' అనే వ్యాధి కలుగుతుంది. దీనినే 'జడవామనుడు' అనీ అంటారు. ఈ వ్యాధి ప్రధాన లక్షణం బుద్ధి మందగించడం, వంధ్యత్వం కలగడం, పుట్టిన కొన్ని నెలల్లోపే మరణించడం.
✧ పెద్దవారిలో ఈ హార్మోన్ లోపం వల్ల 'మిక్సోడియా' అనే వ్యాధి కలుగుతుంది. ఈ వ్యాధి ప్రధానలక్షణం కన్నులు ముందుకు పొడుచుకుని రావడం. శరీర బరువు పెరగడం.
✧ పెద్దవారిలో ఈ హార్మోన్ ఎక్కువ కావడం వల్ల 'గ్రేవ్స్' లేదా 'ఎగ్జాప్తాల్మిక్ గాయిటర్' అనే వ్యాధి కలుగుతుంది. దీని ప్రధాన లక్షణం – కనుగుడ్డు అతికించినట్లు ఉండటం.
✧ సాధారణంగా మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపం వల్ల 'గాయిటర్' అనే వ్యాధి కలుగుతుంది.
✧ **థైరాక్సిన్ హార్మోన్, అయోడిన్ మూలకాలు కప్పలార్వా రూప విక్రియ చెంది ప్రౌడ కప్పగా మారడానికి సహాయపడుతుంది.**

కాల్సిటోసిన్ : ఇది రక్తంలో క్యాల్షియం గాఢతను క్రమపరుస్తుంది.

బి. అధివృక్క గ్రంథి

దీనిని సుప్రారీనల్ గ్రంథి అంటారు. ఇవి ఒక జత మూత్రపిండాలను అతుక్కొని ఉంటాయి.
✧ ఈ గ్రంథిలోని రెండు భాగాలు..
1. వల్కలం, 2. దవ్వ


1. వల్కలం (కర్టెక్స్)

దీని నుంచి మూడు రకాల హార్మోన్లు ఉత్పత్తవుతాయి.

ఎ. ఆల్డోస్టిరాన్

ఇది సోడియం, పొటాషియం మూలకాల పరిమాణాన్ని నియంత్రిస్తుంది. ఈ మూలకాలు నాడీ ప్రచోదనాలలో ఎలక్ట్రోలైట్‌లుగా పనిచేయడంలో తోడ్పడతాయి.
✧ ఈ హార్మోన్ తక్కువ కావడం వల్ల 'ఎడిసన్స్' అనే వ్యాధి కలుగుతుంది. ఈ వ్యాధి ప్రధానలక్షణం చర్మం ఇత్తడి రంగులోకి మారుతుంది. ఛాతీపై మచ్చలు ఏర్పడతాయి.

1. పీనియల్ దేహం
2. పిట్యూటరీ గ్రంథి
3. థైరాయిడ్ గ్రంథి
4. పేరా థైరాయిడ్
5. థైమస్ గ్రంథి
6. అధివృక్కగ్రంథి (అడ్రినల్ గ్రంథి)
7. క్లోమము
8. స్త్రీ బీజకోశం (అండం)
9. పురుష బీజకోశం (ముష్కము)



బి. ఆండ్రోజెన్స్

ఇవి ఒక రకమైన లైంగిక హార్మోన్లు.
✧ పురుషుల్లో, స్త్రీలల్లో కూడా ఉత్పత్తవుతాయి.
✧ స్త్రీలలో ఈ హార్మోన్ ఎక్కువైనా, 'విరిడిజం' అనే వ్యాధి కలుగుతుంది. అనగా అవాంఛిత రోమాలు, మీసాలు, గడ్డాలు వస్తాయి.

సి. కార్టిసోల్

దీనిని స్ట్రెస్ హార్మోన్ అంటారు.
✧ ఇది శారీరక, మానసిక ఒత్తిడికి గురైనప్పుడు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది.
✧ ఈ హార్మోన్ పిండి పదార్థాలు, కొవ్వుల జీవక్రియలో ప్రధానపాత్ర వహిస్తుంది.
✧ ఇది అధికంగా స్రవించడం వల్ల 'కిస్సింగ్స్ సిండ్రోమ్' అనే వ్యాధి కలుగుతుంది. అంటే పిండి పదార్థాలు, కొవ్వుల జీవక్రియ అస్తవ్యస్తమైన ఫలితంగా ముఖం, గొంతుకు దగ్గర కొవ్వు పేరుకుపోయి మెడ వేలాడేటట్లు కనిపించడం. ఈ స్థితిని బఫ్పెల్లోనెక్ స్థితి అంటారు.

2. దవ్వ (పిథ్)

దీని నుంచి రెండు రకాల హార్మోన్లు స్రవిస్తాయి.

ఎ. ఎడ్రినలిన్

దీనిని అత్యవసర హార్మోన్ అని, పోరాట పలాయన హార్మోన్ అని 3ఎఫ్ హార్మోన్ అని అంటారు.
✧ ఇది మానవునిలో భయం, బాధ, కోపం, ప్రేమ సమయాలలో విడుదలవుతుంది.

బి. నాన్ ఎడ్రినలిన్

ఇది రక్త పీడనాన్ని (బి.పి) నియంత్రిస్తుంది.

3. పీయూష గ్రంథి/ పిట్యూటరీ గ్రంథి

దీనిని అతి ప్రధాన గ్రంథి అని, మాస్టర్ గ్రంథి అని పిలుస్తారు.
✧ ఇది మెదడు దగ్గర బఠాని గింజ పరిమాణంలో ఉంటుంది.
✧ మెదడులో మూడు లంబికలు ఉంటాయి.
1. పూర్వ లంబిక, 2. మధ్య లంబిక, 3. పర లంబిక
✧ పూర్వ, పర లంబికను కలిపి 'ఎడినో హైఫోఫైసిస్' అంటారు.
✧ మధ్య లంబికను 'న్యూరో హైపోఫైసిస్' అంటారు.

1. ఎడినో హైఫోఫైసిస్ నుంచి స్రవించే హార్మోన్

ఎ. ఎస్‌టిహెచ్ : సొమాటో ట్రోపిక్ హార్మోన్)

దీనిని పెరుగుదల హార్మోన్ అంటారు.
✧ జీవుల్లో ఇది పెరుగుదలను నియంత్రిస్తుంది.
✧ పిల్లల్లో ఈ హార్మోన్ ఉత్పత్తి తక్కువ అయితే మరుగుజ్జుతనం (డ్వార్ఫిజం) కలిగి ఫలితంగా పొట్టిగా తయారవుతారు. మరుగుజ్జుతనం రెండు రకాలు...

1. లోరియస్ మరుగుజ్జు : ఈ వ్యాధిగల పిల్లల్లో పెరుగుదల మాత్రమే లోపిస్తుంది.

2. ఫ్రాలిక్ మరుగుజ్జు : ఈ వ్యాధిగల పిల్లల్లో శారీరక, మానసిక వంధ్యత్వం వస్తుంది.

✧ పిల్లల్లో ఎస్‌టిహెచ్ ఉత్పత్తి ఎక్కువైనా 'అతి దీర్ఘకాయత్వం' (జైగాంటిజం) (7–8 అడుగుల ఎత్తు) పెరుగుతారు. పెద్దవారిలో ఎస్‌టిహెచ్ ఎక్కువైనా 'ఎక్రోమెగాలి' అనే వ్యాధి కలుగుతుంది. అంటే గొరిల్లా లక్షణాలు కలిగి ఉంటారు.
✧ పెద్దవారిలో ఎస్‌టిహెచ్ ఉత్పత్తి తక్కువనా 'సైమండ్స్' అనే వ్యాధి కలుగుతుంది. అంటే అధికనిద్ర, బలహీనత.

బి. ఎల్‌టిహెచ్ (ల్యూటియో ట్రోఫిక్ హార్మోన్)

ఇది స్త్రీలలో క్షీరగ్రంథుల పైన ప్రభావాన్ని చూపుతుంది.

సి. ఎఫ్ఎస్‌హెచ్ (ఫాలికిల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్)

దీనినే పుటికా ఉద్దీపన హార్మోన్ అని కూడా అంటారు.
✧ ఈ హార్మోన్ స్త్రీలలో గ్రాఫియన్ పుటికలను, పురుషులలో శుక్రనాళంలోని పుటికలను ప్రేరేపించి, ఈస్ట్రోజన్ టెస్టోస్టిరాన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది.

డి. టిఎస్‌హెచ్ (థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్)

ఇది శరీరంలోని పుటికలను ప్రేరేపిస్తుంది.
✧ ప్రొజెస్టిరాన్ అనే హార్మోన్‌ను తయారుచేస్తుంది. అండం విడుదలను ప్రోత్సహిస్తుంది.

2. న్యూరో హైపో ఫైసిస్ నుంచి స్రవించే హార్మోన్లు

ఎ. వాసోప్రెసిన్

దీనిని అతి మూత్ర నిరోధక హార్మోన్/ యాంటీ డై–యూరేటిక్ హార్మోన్ అంటారు.
✧ ఇది మూత్రపిండాల ద్వారా అధిక నీటి నష్టాన్ని నివారిస్తుంది.
✧ ఈ హార్మోన్ లోపం వల్ల 'డయాబెటిస్ ఇన్సిపిడస్' అనే వ్యాధి కలుగుతుంది.

ఇ. ఆక్సిటోసిన్

ఇది ప్రసవ సమయంలో గర్భాశయంలోని మృదుకండరాలను వదులు చేసి, శిశు జననాన్ని తేలిక చేస్తుంది.
✧ క్షీరగ్రంథుల నుంచి క్షీరం విడుదలకు సహాయపడుతుంది.

సి. ఎం.ఎస్.హెచ్ (మెలనోసైట్ స్టిమ్యులేటింగ్ హార్మోన్)

ఇది మెలనిన్ అనే రంగు పదార్థాన్ని స్రవిస్తుంది. ఈ మెలనిన్ అనే పదార్థం చర్మానికి రంగును ఇస్తుంది.
✧ పుట్టుకతోనే శరీరంలో ఎక్కడా మెలనిన్ ఏర్పడని వ్యాధిని 'ఆల్బినిజం' అంటారు. ఇది జన్యు సంబంధ వ్యాధి.

4. బాల గ్రంథి/ థైమస్ గ్రంథి

ఇది వక్ష భాగంలో (ఊపిరితిత్తుల మధ్య గుండెకు దగ్గరగా) ఉంటుంది.
✧ ఇది పిండంలో ఆరో వారంలో ఏర్పడుతుంది.
✧ ఇది ఏర్పడినప్పుడు 15 నుంచి 20 గ్రాముల వరవుండి, చివరకు 40 గ్రాముల వరకూ పెరిగి ఆగిపోతుంది. కౌమారదశ వచ్చే సమయానికి ఈ గ్రంథి పూర్తిగా నశించిపోతుంది.
✧ ఈ గ్రంథి నుంచి 'థైమోసిన్' అనే హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. ఇది బి లింఫోసైట్ కణాల పరిపక్వతను ప్రేరేపిస్తుంది. ఫలితంగా ప్రతిరక్షకాలు ఉత్పత్తయ్యి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

5. పీనియల్ గ్రంథి

ఇది చిన్న వినాళగ్రంథి
✧ ఇది మెదడులోని హైపోథలామస్ పైభాగంలో ఉంటుంది. దీనిని మూడోనేత్రం అనీ పిలుస్తారు.
✧ మెలటోనిన్ అనే హార్మోన్‌ను ఇది స్రవిస్తుంది.
✧ ఈ హార్మోన్‌లో మెలనిన్ అనే రంగు పదార్థం ఉంటుంది. ఇది చర్మానికి రంగును ఇస్తుంది.

2. మిశ్రమ గ్రంథులు

క్లోమ గ్రంథి (దీని గురించి జీర్ణవ్యవస్థలో ఉన్నది)

3. ఇతర గ్రంథులు

1. బీజకోశాలు : ఇవి రెండు రకాలు (గొనాడ్స్)

ఎ. పురుష బీజకోశాలు (టెస్టిస్) : వీటి నుంచి టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ స్రవిస్తుంది. ఇది పురుష లైంగిక లక్షణాలను అధికం చేస్తుంది.

బి. స్త్రీ బీజకోశాలు (ఓవరీస్) : ఇవి ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ అనే హార్మోన్లను స్రవిస్తాయి. ఇవి స్త్రీ లైంగిక లక్షణాలను అధికం చేస్తాయి. స్త్రీలలో ద్వితీయ లైంగిక లక్షణాలను అధికం చేస్తాయి. గర్భాశయ గోడకు పిండస్థాపనకు సహాయపడుతుంది.

2. రిలాక్సిన్ : ఇది శిశు జననాన్ని తేలిక చేస్తుంది.

3. ప్రొలాక్టిన్ : ఇది స్త్రీలలో పాల ఉత్పత్తికి సహాయపడుతుంది.

4. గ్యాస్ట్రిన్ : ఇది జీర్ణాశయం నుంచి ఉత్పత్తవుతుంది. ఇది పెప్సిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది.

5. కొరియానిక్ గొనడో ట్రోపిక్ హార్మోన్ : ఇది జరాయువు నుంచి స్రవిస్తుంది. వివిధ రకాల పదార్థాల ప్రసరణలో సహాయపడుతుంది.

6. సెక్రటిన్ : ఇది క్లోమరస ఉత్పత్తిని అధికం చేస్తుంది.

7. కొలిసిస్టోకైనిన్ : ఇది పిత్తాశయం నుంచి ఉత్పత్తి చేస్తుంది. పిత్తాశయంలో రాళ్లు ఏర్పడకుండా ఉండడానికి సహాయపడుతుంది.

★

బ్యాంకులకు బాసట!

- మార్చి నాటికి రూ.88,139 కోట్ల సాయం
- బాండ్ల జారీ ద్వారా భారీ నిధుల సమీకరణ
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టికరణ



న్యూఢిల్లీ: మొండి బాకీలు, నిరర్థక ఆస్తుల బెడదతో కునారిల్లుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదుకొనే దిశగా సర్కారు కార్యాచరణను మొదలు పెట్టింది. ఇందులో భాగంగా 20 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.88,139 కోట్ల మేర నిధు లను సమకూర్చనున్నట్టుగా తెలిపింది. ఈ విషయమై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం ఒక ప్రకటన చేశారు. ఆయా బ్యాంకులకు ఎంత మొత్తంలో నిధుల సమకూర్చాలన్న అంశంపై ఆర్థిక మంత్రుత్వ శాఖ సమగ్ర అధ్యయనం జరపుతున్నట్టుగా ఆయన తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నిరర్థక ఆస్తులు పెరగడం వల్ల ఆర్థిక రంగం ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో పరిస్థితిని మెరు గుపరిచేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్టుగా జైట్లీ తెలిపారు. భారీ మొత్తంలో రుణాలను ఎగవేసిన వారిపై ఖచ్చితమైన నిఘాతో పాటు రూ.250 కోట్లకుపైగా రుణాలు తీసుకున్న వారు ఖచ్చితంగా రిపోర్టింగ్ చేసేలా నిబంధనలను రూపొందించినట్టుగా ఆయన తెలిపారు.

ఐడీబీఐకి అధిక మొత్తం...

సర్కారు అందించనున్న సాయంలో దాదాపు రూ.8,139 కోట్లను బడ్జెటరీ కేటాయింపుల ద్వారా సర్కారు అందించ నుంది. మిగతా రూ.80,000 కోట్ల మొత్తాన్ని రిక్యాపిటలైజేషన్ బాం డ్లను జారీ ద్వారా సమకూర్చ నుంది. మొత్తం సాయంలో అత్యధిక మొత్తంలో (దాదాపు రూ.10,610 కోట్లు) ఐడీబీఐ బ్యాంకుకు అందనున్నట్టుగా సమాచారం.

ఎస్‌బీఐకి రూ.8,800 కోట్లు...

పీఎస్‌బీలను నిలబెట్టుకొనే క్రమంలో సర్కారు జరపనున్న మూలధనీకరణ చర్యల్లో దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బీఐకి రూ.8,800 కోట్లు, ఐడీబీఐకి రూ.10,610 కోట్లు, పీఎన్‌బీకి రూ.5473 కోట్లు, బీవోబీకి రూ.5,375 కోట్లు, కెనరా బ్యాంకుకు రూ.4,865 కోట్లు, యూనియన్ బ్యాంకుకు రూ.4,524 కోట్లు, సిండికేట్ బ్యాంకు రూ.2,839 కోట్లు, ఆంధ్రా బ్యాంకుకు రూ.1,890 కోట్లు, విజయ బ్యాంకుకు రూ.1,277 కోట్లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుకు రూ.785 కోట్లు, బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ.9,232 కోట్లు, యూకో బ్యాంక్‌కు రూ.6,507 కోట్లు, ఐవోబీకి రూ.4,694 కోట్ల చొప్పున సాయం అందనుంది.

4% మందికీ చేరని బీమా

- వినియోగం పెరగాలి
- టెక్నలాజీతో పారదర్శకత
- ఐఆర్‌డిఎ ఛైర్మన్ టిఎస్ విజయన్ వెల్లడి



ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

దేశంలో బీమా రంగం ఇప్పటికీ 4 శాతం మందికి కూడా చేరువ కాలేకపోయిందని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఎ ఛైర్మన్ టిఎస్ విజయన్ అన్నారు. జీవిత బీమాతో పోల్చితే సాధారణ బీమా వినియోగం మరీ తక్కువగా ఉందన్నారు. టెక్నలాజీ ఉపయోగించుకోవడం ద్వారా బీమా పథకాల క్లయిమ్‌ల పరిష్కారంలో మరింత పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 14వ బీమా బ్రోకర్ల సమ్మిట్ ప్రత్యేక సమావేశంలో విజయన్ మాట్లాడుతూ దేశంలో బీమా వినియోగం పెరిగిందన్నారు. అయితే ఇప్పటికే దేశంలో జీవిత బీమా 4 శాతం లోపు మందికి మాత్రమే చేరువ అయ్యిందన్నారు. సాధారణ బీమా అయితే మరీ అత్యల్పంగా ఉందన్నారు. బీమాలో భిన్నమైన పథకాలు తీసుకురావడం ద్వారా అన్ని వర్గాల వారిని బీమా పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

గతేడాది సాధారణ బీమా ప్రీమియం వసూళ్లు రూ.1,27,000 కోట్లుగా నమోదయ్యిందన్నారు. జీవిత బీమా ప్రీమియం వసూళ్లు రూ.4,00,000 కోట్లుగా చోటు చేసుకున్నాయన్నారు. వైద్య బీమాలో 43 శాతం పెరుగుదల ఉందన్నారు. అదే విధంగా బ్రోకర్ల ద్వారా రూ.30,000 కోట్ల ప్రీమియం వసూళ్లు జరిగాయన్నారు. నూతన బీమాలో 27 శాతం వాటా బ్రోకర్లదే ఉందన్నారు. బీమా రంగం పెరుగుదలకు బ్రోకర్ల భాగసామ్యం మరింత పెరగాలన్నారు. యాప్‌లను సృష్టించడం ద్వారా మరింత మందికి చేరువ కావాలన్నారు. బీమా వృద్ధికి డిజిటల్ వేదికలు కూడా అవసరమన్నారు.

2016–17లో జీవిత బీమాయేతర ప్రీమియం వసూళ్లు రూ.1,28,129 కోట్లకు చేరిందని ఇన్సూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐబిఎఐ) ప్రెసిడెంట్ సంజయ్ కేడియా అన్నారు. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 32.9 శాతం పెరుగుదల ఉందన్నారు. 2016లో జీవిత బీమాయేతర వ్యాపారంలో కేవలం 0.77 శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 428 బీమ బ్రోకర్లు పని చేస్తున్నారని పేర్కొన్నారు. బ్రోకింగ్‌కు డిమాండ్ పెరుగుతుందన్నారు.

విద్యుత్ వాహనాలదే భవిష్యత్తు

మంత్రి పియూష్ గోయల్

దావోస్ / న్యూఢిల్లీ : భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే కావాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో 'డిజైనింగ్ ఫర్ స్మార్ట్ మొబిలిటీ' అంశంపై ఆయన మాట్లాడుతూ భారత జనాభాలో ఇప్పటికీ 80శాతం మందికి సొంత వాహనాలు లేవన్నారు. అలాంటి వారు తొలిసారి విద్యుత్ వాహనాన్ని ఉపయోగించుకోవాలని కోరుకుంటున్నామన్నారు. దేశంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగం శరవేగంగా వద్ధి చెందుతోందన్నారు. గత ఐదేళ్లలో సౌరవిద్యుత్ వినియోగంలో 6 రెట్ల వృద్ధిని సాధించామన్నారు. 2022 నాటికి 10 గిగావాట్ల ఉత్పత్తిని చేరుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు.

. విద్యుత్ వాహనాలకు పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వడం మంచిదని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇ–మొబిలిటీ సమావేశంలో సింగ్ మాట్లాడుతూ ఇ–మొబిలిటీపై అవగాహన కల్పించేందుకు త్వరలోనే సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తేనున్నామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు పన్ను ప్రోత్సాహకాలు అవసరమన్నారు. అదే విధంగా విద్యుత్ వాహనాలకు అవసరమయ్యే ఛార్జింగ్ పాయింట్లు కూడా అవసరమన్నారు. అందుకు అవసరమయ్యే విద్యుత్‌పై ఛార్జీలు తదితర అంశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం విద్యుత్ సవరణ బిల్లును తెచ్చే అవకాశం ఉందన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు నేత ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. నూతన పెన్షన్ స్కీంను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో డిఆర్ఎం కార్యాలయం' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు అనేక రకాలుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేకపోవడం విచారకరమన్నారు. ఎల్ఐసి, బ్యాంకు, పోస్టల్ ఉద్యోగులు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ, కార్మికులు చేస్తున్న ఉద్యమాలకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. జిఎన్.శ్రీనివాసరావు, పి.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో బుధవారం 'చలో డిఆర్ఎం' కార్యాలయాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు

సమస్యలు పరిష్కరించకపోతే 27 నుంచి సమ్మె

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జెఎసి హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన దీక్షలు



కర్నూలులో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఈనెల 26 లోపు పరిష్కరించకపోతే 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జెఎసి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం ఐదో రోజుకు చేరాయి. విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ఎస్ఆర్.ప్రభూజీ ప్రారంభించారు. విశాఖపట్నంలో జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు చేశారు. దీక్షలకు వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి సంఘీభావం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేస్తున్న దీక్షలతోపాటు ఈనెల 27 నుంచి చేయనున్న సమ్మెకు సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. జనసేన నాయకులు తుమ్మలబాబు, తుమ్మలపల్లి చందు, విజయగోపాల్ సంఘీభావం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ నిరాహార దీక్షల వద్ద కార్మికులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. దీక్షలనుద్దేశించి జెఎసి జిల్లా ఛైర్మన్ ఎం.హరికృష్ణ మాట్లాడారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట కార్మికుల దీక్షలను సిఐటియు నాయకులు ప్రారంభించారు. చిత్తూరు జిల్లా ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రారంభించారు. చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్‌రెడ్డి దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. కడప కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలను బిసి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరభద్రయ్య ప్రారంభించారు. ఎల్ఐసి యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎ.రఘునాథ్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి సంఘీభావం తెలియజేశారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్షలకు వైసిపి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య, జనసేన పార్టీ జిల్లా నాయకురాలు రేఖా, బిసి సంఘం నాయకులు శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త టిజి భరత్ సంఘీభావం తెలిపారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ నిరాహార దీక్షలను కొనసాగించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు విరమించేదిలేదని స్పష్టం చేశారు.

అక్రమ అరెస్టులకు నిరసనగా

రెండోరోజూ ఆందోళనలు



కృష్ణా జిల్లా గుడివాడలో సిపిఎం తూర్పు జిల్లా కార్యదర్శి ఆర్.రఘు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- యంత్రాంగం

గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులో దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, సిపిఎం, వామపక్ష నాయకుల అక్రమ అరెస్టలను ఖండిస్తూ రాష్ట్రంలో రెండో రోజూ ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. 'చలో గొట్టిపాడు' సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధుతో పాటు పలువురు వామపక్ష నాయకులను పోలీసులు మంగళవారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అరెస్టులకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యాన బుధవారం విజయనగరం జిల్లాలో విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సీతానగరం తదితర చోట్ల రాస్తారోకోలు జరిగాయి. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్లో నిర్వహించిన రాస్తారోకోలో సిపిఎం పార్వతీపురం ప్రాంత కమిటీ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, సిపిఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద దళిత సంఘాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. కృష్ణా జిల్లా గుడివాడ, పమిడిముక్కల, ముదినేపల్లి, గంపలగూడెం, తిరువూరు, నందిగామలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గుడివాడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు పాల్గొన్నారు. విజయవాడలోని 54, 55 డివిజన్లతో సిపిఎం, కెవిపిఎస్, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిచారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ పాల్గొన్నారు.

జిఎంసి విద్యుత్ కార్మికుల తొలగింపు సరికాదు

మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరు నగరపాలక సంస్థ వీధిదీపాల విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నోటీసులు ఇవ్వకుండానే విధుల నుంచి తొలగించారని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కె.ఉమామహేశ్వరరావు, సభ్యులు ఈదులమూడి మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా విధుల నుంచి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులివ్వాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు జెఎసి ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మధుబాబు మాట్లాడుతూ.. జిఎంసిలో ఈ విభాగంలో పనిచేస్తున్న 66 మంది కార్మికులను ముందస్తు సమాచారం ఏమీ లేకుండా విధుల నుండి నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. అవుట్ సోర్సింగ్ అమలు చేసినా తమ ఉద్యోగ భద్రతకు ఢోకాలేదని గతేడాది డిసెంబర్ 22న మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీనిచ్చారని గుర్తు చేశారు. అయినా ఇప్పుడు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. అనేక ఏళ్లుగా మున్సిపల్ విభాగంలో పని చేస్తున్న వారిని తొలగించడం సమంజసం కాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ జవాబులు

1. యునెస్కో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ అవార్డు
2. 177వ ర్యాంక్
3. ఉత్తరప్రదేశ్
4. జనవరి 24
5. ఉత్తప్రదేశ్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్

ఉద్యమాన్ని కొనసాగిస్తాం..

- చలో గొట్టిపాడు విజయవంతం
- సంఘీభావ పోరాట కమిటీ
- 27న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళితులపై జరిగిన దాడిలో అసలైన నిందితులను అరెస్టు చేసి, దళితులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ చెప్పారు. ఈనెల 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు లాడ్జిసెంటర్ సమీపంలో చర్చి ప్రాంగణంలో బుధవారం రాత్రి సంఘీభావ కమిటీ సమావేశమైంది. అనంతరం కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. సంఘీభావ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన చలో పెదగొట్టిపాడు పర్యటన విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో 32 దళిత సంఘాలు, పౌరసంఘాలు, సిపిఎం, సిపిఐ తదితర పార్టీలు పాల్గొన్నాయన్నారు. ఈనెల 27న నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. పెదగొట్టిపాడు లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎక్కడా జరగకుండా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. త్వరలో నిర్వహించబోయే 'చలో గుంటూరు' కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, పికెఎస్‌కు చెందిన కొండారెడ్డి, న్యాయవాది వైకె, అంబేద్కర్ ప్రజాసంఘం దావులూరి కోటేశ్వరరావు, డిఫెన్స్ లాయర్స్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు, కాంగ్రెస్‌కు చెందిన లింగంశెట్టి ఈశ్వరరావు, గుంటూరు పశ్చిమ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఐ.రోహిత్, కొరివి విజయ్‌కుమార్, పి.రామారావు, చిలక చంద్రశేఖర్, విల్సన్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్



గుంటూరులో పిఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

కనీస పింఛను రూ.6,500 చేయాలని, రద్దు చేసిన సౌకర్యాలు పునరుద్ధరించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిఎఫ్ కార్యాలయాల ఎదుట బుధవారం ధర్నాలు, ఆందోళనలు నిర్వహించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇపిఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణరాజు, అధ్యక్షులు సిహెచ్.మోహన్‌రావు మాట్లాడుతూ కనీస పింఛను సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కనీస పింఛను రూ.7,500, ఐఆర్ రూ.5వేలు ఇస్తున్నట్టు వస్తున్న వార్తలో నిజం లేదన్నారు. అనంతరం ఇపిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగరాజు, మోహన్‌రావు ఆధ్వర్యాన ఆ జిల్లా పెన్షనర్లు, అసోసియేషన్ రాజమహేంద్రవరం నగర కార్యదర్శి జెవివి.రామారావు, పేపర్ మిల్లు నాయకులు ఎల్.అప్పారావు, కె.నాగేశ్వరరావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కడప పిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వి.ఎస్.రాజు మాట్లాడుతూ పెన్షనర్లకు మెడికల్ సదుపాయం కల్పించాలని కోరారు. . కార్యక్రమంలో ఐదు జిల్లాల పెన్షనర్స్ సంఘం నాయకులు పెన్షనర్లు పాల్గొన్నారు. విశాఖలో పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బిటి.మూర్తి మాట్లాడుతూ, పెన్షనర్లను కొన్ని పెన్షన్ సంఘాలు తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యుఆర్ఎస్ఎన్.వర్మ, కనకేశ్వర రావు, జె.కోటేశ్వరరావు, ఎస్‌విఎల్.శాస్త్రి ఎపి.రావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులోని కృష్ణానగర్ పిఎఫ్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు, కడప, రాజమండ్రి, విశాఖలో ధర్నాలో పాల్గొని జయప్రదం చేసిన వారందరికీ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సిపిఐ కృష్ణాజిల్లా 24వ మహాసభలు నందిగామలో బుధవారంతో ముగిశాయి. నందిగామ ఒసి క్లబ్ ప్రాంగణంలో ఈ మహాసభలను ఆపార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సోమవారం ప్రారంభించగా.. మంగళవారం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరై మాట్లాడారు. వీరిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రతినిధులకు వివరించారు.

13 మంది పెల్లెట్ గన్ కాల్పుల బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు

జమ్మూ : 2016లో రాష్ట్రంలో జరిగిన అల్లర్ల సందర్భంగా పెల్లెట్ల గన్ కాల్పుల్లో గాయపడిన 13 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం తెలిపింది. శాసనసభలో అలీ మహమ్మద్ దార్, షౌకత్ హుస్సేన్ గనీ అడిగిన ప్రశ్నకు రెవిన్యూ మంత్రి అబ్దుల్ రెహ్మాన్ వీరీ సమాధానం ఇచ్చారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరో 22 మంది పెలెట్ల గన్ కాల్పుల బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. 2016 జులై-నవంబర్ మధ్య కాలంలో జరిగిన అల్లర్లలో బాధితులను గుర్తించడానికి ఒక కమిటీని వేసినట్లు తెలిపారు.

ప్రాణ రక్షకునికి అవార్డు

52 మంది అమర్‌నాథ్ యాత్రీకుల ప్రాణాలు కాపాడిన షేక్ సలీం గఫూర్‌కు రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన ఉత్తమ్ జీవన్‌రక్ష పదక్ అవార్డును కేంద్రం ప్రకటించింది.



ఏ నిబంధనల ప్రకారం మీడియాను వద్దంటున్నారు
సోహ్రాబుద్దీన్ కేసు విచారణపై హైకోర్టు సూటి ప్రశ్న

ముంబయి : గుజరాత్‌కు చెందిన సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు విచారణ వార్తల ప్రచురణ, ప్రసారాలకు సంబంధించి మీడియాపై ఆంక్షలు విధించటాన్ని ముంబయి హైకోర్టు తప్పుపట్టింది. కోర్టు విచారణలకు మీడియాను నిషేధించటంపై సిబిఐ న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను రద్దు చేసిన న్యాయమూర్తి రేవతి మొహిరే దేరే మీడియాపై ఇటువంటి ఆంక్షలు చట్ట విరుద్ధమని, ప్రస్తుతం కొనసాగుతున్న విచారణ క్రమాన్ని ప్రజలకు చేరనీయకుండా మీడియాను నిరోధించలేవని స్పష్టం చేశారు. కేసు విచారణ వార్తల కవరేజ్‌కు వ్యతిరేకంగా మీడియాపై ఆంక్షలు విధించేందుకు మీకేం అధికారం వుందంటూ ఉన్నత న్యాయస్థానం మంగళవారం నాడు సిబిఐ న్యాయస్థానాన్ని నిలదీసిన విషయం తెలిసిందే. సిబిఐ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తొమ్మిది మంది పాత్రికేయులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు మీడియాను వార్తలు ప్రచురించకుండా నిరోధించేందుకు న్యాయమూర్తి తన అధికారాన్ని వినియోగించవచ్చన్న నిబంధన ఎక్కడైనా వుందా? అని ప్రశ్నించింది. క్రిమినల్ ప్రోసీజర్ కోడ్‌తో సహా ఎటువంటి ప్రత్యేక చట్టాలూ కోర్టు విచారణపై మీడియా కవరేజ్‌ను అడ్డుకోవటం లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది అబద్ పండా కోర్టుకు వివరించారు. సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం అసలు మీడియా ప్రతినిధులను కోర్టు హాలులోకే ప్రవేశించవద్దని ఆదేశించలేదని, కెమెరాలను అనుమతించలేదని ఆయన చెప్పారు.

త్రిపుర ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

అగర్తలా : ఫిబ్రవరి 18న జరగనున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు బుధవారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. మార్చి 5నాటికి ఎన్నికల క్రమం పూర్తవుతుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు, ఓటు రసీదు యంత్రాలు (వివిపిఎటి)లు ఉపయోగిస్తారు. 60మంది సభ్యులు గల త్రిపుర అసెంబ్లీ కాలపరిమితి మార్చి 14తో ముగుస్తుంది. మొత్తం 60సీట్లలో పది సీట్లు ఎస్‌సి అభ్యర్థులకు, 20సీట్లు ఎస్‌టి అభ్యర్థులకు రిజర్వ్ చేయబడ్డాయి. మొత్తంగా 3,214 పోలింగ్ కేంద్రాలున్నాయి. పోలింగ్‌కు వారం రోజులు ముందుగా ఓటరు ఫోటోతో కూడిన ఓటరు స్లిప్పులు అందచేయనున్నారు. రాజకీయ పార్టీలు చేసే ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు 10మంది వ్యయ పరిశీలకులు రాష్ట్రానికి రానున్నారని అదనపు సిఇఓ తపస్ రే తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు 300 కంపెనీల భద్రతా బలగాలను మోహరించనున్నారు.

మోటారు వాహనాల సమ్మెపై కేరళ అసెంబ్లీలో చర్చ

తిరువనంతపురం : ఇంధన ధరలు తరుచూ పెరగడాన్ని నిరసిస్తూ కేరళలో వివిధ రవాణా కార్మిక సంఘాలు చేపట్టిన బంద్ బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో చర్చకు వచ్చింది. ప్రస్తుత పరిస్థితికి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. సిపిఎం ఎమ్మెల్యే పి.కె. శశి అసెంబ్లీలో రవాణా కార్మికుల సమ్మె అంశాన్ని లేవనెత్తారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిన కారణంగా సామాన్యులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సామాన్యుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు పన్ను విధానం వల్లే ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి విజయన్ స్పందిస్తూ పెట్రోలియం కంపెనీల దోపిడి, కేంద్ర ప్రభుత్వపు పన్ను విధానమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని ప్రకటించారు. గత కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ పాలనలో ప్రవేశపెట్టిన సెస్సు మినహా పెట్రోలియం ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వం పన్ను రేట్లను పెంచలేదని విజయన్ తెలిపారు.

మార్చి నాటికి పిఎస్‌బిలలో లక్ష కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల సంస్కరణలకు సంబంధించిన కార్యాచరణను బుధవారం ప్రభుత్వం ప్రకటించింది. మార్చి నాటికి మొత్తం లక్ష కోట్ల పెట్టుబడులను ప్రభుత్వ రంగ బ్యాంకులలో పెట్టనున్నట్లు తెలిసింది. పున: పెట్టుబడి బాండ్ల ద్వారా రు.80 వేల నిధులను ఎలా పెంచుకున్నదీ వెల్లడంచింది. ప్రభుత్వం ఇచ్చిన సంకేతాల మేరకు ఐడిబిఐ బ్యాంకుకు అత్యధికంగా రూ.10, 610 కోట్లు పెట్టుబడులను అందించనున్నదని. ఆ తరువాత బ్యాంక్ ఆప్ ఇండియాకు రూ.9,232 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.8,800 కోట్లను కేటాయించనున్నది. మొత్తం రూ.లక్ష కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులలో పెట్టుబడులుగా పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపింది. ఈ మొత్తం పెట్టుబడులలో రూ.80 వేల కోట్లు పునఃపెట్టుబడి బాండ్ల ద్వారా, రూ.8,139 కోట్లు స్థూల బడ్జెట్ ద్వారా, రూ.10, 312 కోట్లు నిధులు మార్కెట్ నుంచి అందాయని కేంద్రం తెలిపింది. బ్యాంకుల ఆర్థికాభివృద్ధికి మద్దతుగా ఉండేందుకే పెట్టుబడులను అందిస్తున్నట్లు బ్యాంకింగ్ శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఆర్థిక వ్యవస్థలో రూ.5 లక్షల కోట్ల రుణాలను పెంచేందుకు కూడా తోడ్పడతాయని చెప్పారు.

ప్రపంచీకరణను ఎవరూ ఆపలేరు
ఆలిబాబా అధినేత

దావోస్ : ప్రపంచీకరణను ఆపలేమని, వాణిజ్యం ఆగిపోతే యుద్ధం ప్రారంభం లవుతుందని చైనాకు చెందిన ఈ కామర్స్ సంస్థ ఆలీబాబా ఛైర్మన్ జాక్ మా చెప్పారు. సమస్యలను పరిష్కరించటం కోసంమనం ప్రపంచీకరణ మార్గంలో ముందుకుపోవాలని, అది మన బాధ్యత, మనకు లభించిన అవకాశమని ప్రపంచ ఆర్థికవేదిక వార్షిక సమావేశాల సందర్భంగా ఇక్కడ జరిగిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ఆయన చెప్పారు. రానున్న 30 సంవత్సరాలలో ప్రపంచం గుర్తుపట్టలేనంతగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. యుద్ధం అనేది ఉంటే మనుషులపై కాకుండా రోగాలు, పర్యావరణం, దరిద్రంపై జరుగుతుంది. ప్రపంచీకరణను ఎవరూ ఆపలేరని, వాణిజ్యంపై ఆంక్షలు బాంబుల లాంటివని ఆయన పేర్కొన్నాడు. ప్రపంచీకరణను, వాణిజ్యాన్ని ఎవరూ ఆపలేరు. వాణిజ్యం ఆగిపోతే ప్రపంచం ఆగిపోతుంది. యుద్ధాన్ని వాణిజ్యం పరిష్కరిస్తుందని, అది యుద్ధానికి కారణం కాదని ఆయన చెప్పాడు. ఒకవ్యక్తి విజయం సాధించాలంటే అతనికి అత్యధిక మేధాశక్తి కావాలని, ఒకరిని అందరూ గౌరవించాలంటే అత్యధిక తెలివితేటలు కావాలని జాక్‌మా చెప్పాడు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి వలన మారుతున్న ప్రపంచంలో మనం ఉన్నామని, అది ప్రజలు తమకు ఆసక్తి కలిగిన ఉపాధి మార్గాలను ఎంచుకోవటానికి అవకాశం కల్పిస్తున్నదని ఈ వాణిజ్యవేత్త చెప్పాడు.

మోడీ ప్రసంగాన్ని స్వాగతించిన చైనా

బీజింగ్ : రక్షణాత్మక విధానాల(ప్రొటెక్షనిజం)కు వ్యతిరేకంగా భారత ప్రధాని నరేంద్రమోడీ దావోస్ డబ్లుఇఎఫ్ సదస్సులో చేసిన ప్రసంగాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఇరుదేశాలు చేతులు కలపాల్సిన అవసరం వుందని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి హువా చున్‌యింగ్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచీకరణ విధానాలు కొనసాగుతున్నాయన్న సత్యాన్ని ప్రతిబింబిస్తూ భారత ప్రధాని మోడీ రక్షణాత్మక విధానాలపై చేసిన ప్రసంగాన్ని తాము గుర్తించామని ఆయన చెప్పారు. వర్ధమాన దేశాలతో సహా అన్ని దేశాల ప్రయోజనాలకూ ఇది వర్తిస్తుందన్నారు. రక్షణాత్మక విధానాలకు వ్యతిరే కంగా జరుగుతున్న పోరాటం, ప్రపంచీకరణ ప్రోత్సాహంలో భారత్, చైనాలు కలిసి పనిచేస్తే ఉమ్మడి ప్రయోజనాలు పొందవచ్చన్నారు. గత ఏడాది తమ దేశాధ్యక్షుడు సీ జిన్‌పింగ్ దావోస్‌లో రక్షణాత్మక విధానాలకు వ్యతిరేకంగా చేసిన ప్రసంగాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

'పద్మావత్' విడుదలకు వ్యతిరేకంగా రాజ్‌పుట్ మహిళల ఆత్మాహుతి బెదిరింపులు

జైపూర్ : సంజయ్‌లీలా భన్సాలీ ప్రతిష్టాత్మక చిత్రం విడుదలకు నిరసనగా 1900 మంది రాజ్‌పుట్ కర్ణి మహిళలు ఆత్మాహుతి దాడి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని కర్ణిసేన ప్రకటిస్తున్న నేపథ్యంలో ఆ సంస్థ చిత్తోడ్‌గడ్ విభాగ అధ్యక్షుడు గోవింద్ సింగ్ కంగరౌత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు కమలేందు సింగ్ సోలంకిని వారి నివాసంలో మంగళవారం అర్థరాత్రి అరెస్టు చేశారు. ఈ సంస్థలో ప్రధాన సభ్యుల్లో ఒకరైన దేవేంద్ర సింగ్‌ను కూడా అరెస్టు చేశారు. తమ నిరసనలు అరికట్టడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని కర్ణిసేన రాష్ట్ర మీడియా ఇంచార్జ్ రాజ్‌ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. తాము సమావేశాన్ని నిర్వహిస్తామని, తమ ముఖ్యనేత లోకేంద్ర సింగ్ కల్వి పిలుపు మేరకు తదుపరి కార్యక్రమం నిర్ణయించుకుంటామని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పుతో కర్ణిసేన కమ్యూనిటీ ప్రజలు నిరాశకు గురైయ్యారని మంగళవారం కర్ణిసేన ప్రతినిధి ఒకరు పేర్కొన్న సంగతి తెలిసిందే. తాము హింసాత్మక మార్గాన్ని ఎంచుకొని ప్రజలను, పర్యాటకులను ఇబ్బంది పెట్టవచ్చుననీ, కానీ ఎవరికీ ఇబ్బంది కలగకుండా తమ మహిళలు జౌహర్(ఆత్మహుతి)కు పాల్పడతారని కర్ణిసేన ప్రతినిధి పేర్కొన్నారు. దీనికోసం కలపను సిద్ధం చేసుకున్నామని, 1,908 మంది మహిళలు పేరు నమోదు చేసుకున్నారని బెదిరింపులకు దిగారు.

నేటి నుండి

ఆసియాన్ దేశాల సదస్సు

ఢిల్లీ చేరుకున్న ఆసియాన్ దేశాధినేతలు
గణతంత్ర దినోత్సవ అతిథులు కూడా వీరే



న్యూఢిల్లీ : దేశ రాజధాని హస్తినలో ఈ నెల 25,26 తేదీలలో జరుగనున్న భారత్-ఆసియాన్ దేశాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆసియాన్ కూటమిలోని పది దేశాల అధినేతలు బుధవారం ఢిల్లీకి చేరుకున్నారు. వీరు ఈ సదస్సుతో పాటు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అతిథులుగా కూడా పాల్గొంటున్నారు. బుధవారం ఢిల్లీకి చేరిన వారిలో థాయ్‌లాండ్, వియత్నాం, మలేసియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, మయన్మార్, కంబోడియా, లావోస్, బ్రూనే దేశాల నేత లున్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు గురువారం ఢిల్లీకి చేరుకోనున్నారు. వీరందరూ శుక్రవారం నాడు ఇండియాగేట్ వద్ద జరిగే 69వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. ఈ ఏడాది భారత్- ఆసియాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాల రజతోత్సవ సంవత్సరం కావటం విశేషం. వియత్నాం ప్రధాని ఎన్‌గుయెన్ జువాన్ ఫుక్, ఫిలి ప్పైన్స్ అధ్యక్షుడు రోడ్రిగో రోవా డ్యూటెర్ట్, మయన్మార్ ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూకీలతో ప్రధాని నరేంద్రమోడీ బుధవారం విడివిడిగా భేటీ అయ్యారు. ఆసియాన్ దేశాధి నేతల బృందం గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలవనుంది. భారత్ ఇంతకు ముందు అనుసరించిన 'తూర్పు దృక్పథం' విధానం నుండి 'తూర్పు కార్యాచరణ' విధానానికి మారిన సందర్భంలో ఆసియాన్ దేశాధినేతలతో ప్రధాని భేటీ కావటం గమనార్హం.

ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులుగా పది దేశాల అధినేతలు హాజరవుతుండటంతో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల వేదికపై రాష్ట్రపతితో పాటు అతిథులు కూర్చునే ప్రాంతానికి రక్షణగా 100 అడుగుల వెడల్పున్న బుల్లెట్‌ప్రూఫ్ అద్దాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 1950లో అప్పటి ఇండోనేసియా అధ్యక్షుడితో పాటు.. వివిధ సందర్భాలలో ఆసియాన్ దేశాలకు చెందిన ఐదుగురు అధినేతలు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అతిథులుగా పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆసియాన్ దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్న నేపథ్యంలో చేస్తున్న ప్రత్యేక భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఢిల్లీ నగరంలో పోలీసులు అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షల నేపథ్యంలో ప్రజలు స్వల్పదూరంలో వున్న ప్రాంతాలకు సైతం కిలోమీటర్ల కొద్దీ దూరం ప్రయాణించాల్సి వుంటుంది. కొన్ని సందర్భాలలో ఆయా ప్రాంతాలలో గంటల కొద్దీ ట్రాఫిక్ స్థంభించే పరిస్థితులు కూడా తలెత్తే అవకాశం లేకపోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రజలు వీలయినంత ముందుగా తమ గమ్యాలకు చేరుకునే విధంగా తమ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని పోలీసులు సూచించారు. వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించటంలో తమకు సహకరించాలని గూగుల్ మాప్స్ సంస్థను కోరినట్లు అధికారులు చెప్పారు. ప్రముఖుల రాకపోకలకు అనుగుణంగా కొన్ని సందర్భాలలో వాహనాలను కొంత సేపు నిలిపివేసే అవకాశం వుందన్నారు. అతిథులు విమానాశ్రయం నుండి తాము బసచేస్తున్న హోటళ్లకు వెళ్లే సందర్భాలలోనూ, ఆయా కార్యక్రమాలకు హాజరయ్యే సందర్భాలలోనూ, తిరిగి వెళ్లే సమయంలోనూ ట్రాఫిక్ ఇబ్బందులు అనివార్యమవుతాయని అధికారులు చెబుతున్నారు.

స్కూల్ బస్సుపై 'పద్మావత్' ఆందోళనకారుల బీభత్సం



గుర్గావ్ : పద్మావత్ సినిమాను వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనలు శృతి మించుతున్నాయి. ఆందోళనకారులు స్కూల్ బస్సుపై రాళ్లతో దాడికి దిగారు. ఈ సమయంలో బస్సులో 15 మంది వరకూ ఉన్నారు. వీరంతా నర్సరీ నుంచి 12వ తరగతికి చెందినవారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కూడా ఉన్నారు. ఆందోళనకారుల దాడితో చిన్నారులంతా హడలిపోయారు. భయంతో సీట్లకింద దాక్కున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును ఆందోళనకారుల నుంచి దూరంగా తీసుకుని వెళ్ళాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆందోళకారుల దాడితో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. దాడిలో సమయంలో పోలీసులు సమీపంలోనే ఉన్నారని, కానీ ఎలాంటి సహాయం చేయలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనను ఒక విద్యార్థి తన మొబైల్ ద్వారా చిత్రీకరించాడు. చిన్నారులు భయంతో రోదిస్తున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. ఆందోళనకారులు ఢిల్లీ రాష్ట్ర రవాణా శాఖకు చెందిన బస్సును దగ్ధం చేశారు. ఆ సమయంలో సమీపం లోనే ఉన్న స్కూల్ బస్సు పైనా దాడికి దిగారు.

నేడు కర్నాటక బంద్

బెంగుళూరు : కర్నాటకలోని రైతులు, వివిధ సంస్థల పిలుపుతో ఈనెల 25న (గురువారం) రాష్ట్ర బంద్ నిర్వహించనున్నారు. గోవా- కర్నాటక మధ్య మహాదాయి నదీ జలాల పంపిణీలో వివాదంపై ఈ బంద్ చేపడుతున్నారు. ఈ బంద్‌కు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం మద్దతు తెలుపుతూ కేంద్రం కర్నాటక ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బంద్ ప్రభావం తో పలు విద్యాసంస్థలు మూత పడనున్నాయి. నగర జీవనం స్తంభించి పోనుందని పలు సంఘాల నేతలు పేర్కొన్నారు. కర్నాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కెఎస్ఆర్‌టిసి) ఉద్యోగులు, కార్మికులు ఈ బంద్‌కు మద్దతు తెలిపారు.

రోబోలు వస్తున్నాయి.. మహిళల ఉద్యోగాలు పోతాయి

అధ్యయన నివేదిక హెచ్చరిక

బీజింగ్ : రోబోలు వచ్చేస్తున్నాయి....మహిళల ఉద్యోగాలు పోతున్నాయి. ఇదేంటా అనుకుంటున్నారా! కృత్రిమ మేధస్సు (ఎఐ) మన ఉద్యోగాలపై చూపిస్తున్న ప్రభావం ఇది. ఈ విషయంలో ముందుగా ముప్పు ఎదుర్కొనేది మహిళలే అని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో సమర్పించిన కొత్త అధ్యయన నివేదిక పేర్కొంది. "నైపుణ్యాల విప్లవం దిశగా : మనందరి ఉద్యోగాల భవితవ్యం" శీర్షికతో ఈ నివేదిక వెలువడింది. కృత్రిమ మేధస్సు అనేది మనకి పనేమీ లేకుండా చేయడం మొదలుపెడుతోందని, ఇందులో ముందుగా ఉపాధి కోల్పోయేది మహిళలేనని నివేదిక పేర్కొంది. అమెరికాలో 96శాతం ఉపాధి కల్పిస్తున్న దాదాపు వెయ్యి రకాల ఉద్యోగాలపై అధ్యయనం జరిగింది. ఇందులో 57శాతం మంది ఉపాధి కోల్పోయేటువంటి ముప్పును ఎదుర్కొంటున్నారు. వీరందరూ కూడా మహిళలేనని నివేదిక తెలుపుతోంది. 2026 నాటికి, సాంకేతికత కారణంగా దాదాపు 14లక్షల ఉద్యోగాలు అంతర్థానమవనున్నాయి. ఇది ఆందోళన కలిగించే పరిణామమని అధ్యయన నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పనిప్రదేశాల్లో స్త్రీ, పురుషుల మధ్య అంతరం పెరుగుతూ వస్తోందని, లేబర్‌మార్కెట్‌లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం లేకుండా పోతోందని, ఇటువంటి తరుణంలో ఈ పరిణామం మరింత ఆందోళన కలిగిస్తోందని నివేదిక రూపకర్తలు పేర్కొన్నారు. ఇలా ముప్పును ఎదుర్కొనే వారిలో 95శాతం మంది అధిక వేతన చెల్లింపు ఉద్యోగాల్లోనే వున్నారని తెలుతోంది. ఈ 95శాతం మందిలో 74శాతం మంది మహిళలే వున్నారు. రోబోలు వస్తే ఉద్యోగాలు పోయే ముప్పును ఎదుర్కొనే ఉద్యోగులు తమ నైపుణ్యాలకు మెరుగు పెట్టుకునే పనిలో వుండాలని, జీవితాంతం నేర్చుకుంటూనే వుండాలని ఆ అధ్యయనం సూచించింది. యాజమాన్యాలు కూడా తమ సిబ్బంది నైపుణ్యాలకు పదును పెట్టే చర్యలు తీసుకోవాల్సిందేనని సిఫార్సు చేసింది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు, బర్నింగ్ గ్లాస్ టెక్నాలజీస్ సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించాయి.



పర్యావరణ సూచీలో భారత్‌కు 177వ స్థానం

న్యూఢిల్లీ : ప్రపంచ పర్యావరణ నిర్వహణ సూచీలో భారత్ స్థానం దారుణంగా పడిపోయింది. ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతున్న సందర్భంగా దావోస్‌లో తాజాగా 'ప్రపంచ పర్యావరణ నిర్వహణ సూచీ' నివేదకను విడుదలచేశారు. దీనికి సంబంధించి 180 దేశాల ర్యాంకింగ్స్‌లో భారత్ 177 స్థానంలో నిలవటం, ఇక్కడి పర్యావరణ స్థితిగతుల్ని తెలియజేసింది. చైనా 120వ స్థానంలో ఉంది. ఈ సూచీలో గతరెండేండ్లుగా భారత్ 141 స్థానంలో నిలుస్తూ, ఈ ఏడాది ఒక్కసారిగా 177వ స్థానానికి పడిపోవటం గమనార్హం. అడవుల నరికివేత, కాలుష్యం పెరిగిపోవటం 'పచ్చదనం' ర్యాంకింగ్‌లో భారత్ పడిపోవటానికి కారణమని నివేదిక అభిప్రాయపడింది. విస్తారమైన 10 అంశాల్లో, 24 నిర్వహణా సూచికలను, ఆరోగ్యకరమైన పర్యావరణం, జీవావరణం...తదితర అంశాల్ని పరిగణలోకి తీసుకొని నివేదిక రూపొందించినట్టు తెలిసింది. అలాగే వివిధ దేశాలకు సంబంధించి శుద్ధమైనగాలి, నీరు, పారిశుద్ధ్యం, కార్బన్ ఉద్గారాలు, అడవులు, నీటి వృధా... మొదలైనవాటిని మదింపు చేశారు. భారత్, చైనా, పాకిస్తాన్ దేశాల్లో గాలికాలుష్యం పెద్ద ఎత్తున ఉందని, ప్రజారోగ్యాన్ని దెబ్బతీయటంలో ఇది ప్రధాన కారణంగా నిలుస్తోందని నివేదిక హెచ్చరించింది.

కుక్కర్ బాంబు నిర్వీర్యం

శ్రీనగర్ : జమ్ము, కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో పంపోర్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రెషర్ కుక్కర్ ఐఇడి (ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) బాంబును సిఆర్‌ఫిఎఫ్ పోలీసులు గుర్తించి దానిని నిర్వీర్యం చేశారు. గణతంత్ర దినోత్స వానికి రెండు రోజులకు ముందు ఈ బాంబును కనుగొన్నారు. దీంతోఉగ్రవాద దాడులను ఎదుర్కొనేందుకు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మూడు లీటర్ల సామర్థ్యం వున్న ప్రెజర్ కుక్కర్లో అమర్చిన ఈ ఐఇడి బాంబును కండిజాల్-టాంగోపా గ్రామంలో రైల్వే స్టేషన్ సమీపంలో జవాన్లు గుర్తించి, నిర్వీర్యం చేశారని సిఆర్పిఎఫ్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన బాంబు నిర్మూలన బృందం ఈ బాంబును నిర్వీర్యం చేసిందని తెలిపారు.

ఒడిషాలో గిరిజన బాలిక ఆత్మహత్య

భువనేశ్వర్ : గిరిజన బాలిక ఆత్మహత్యకు పాల్పడేందుకు దారితీయడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఒడిషాలో బుధవారం జరిగిన బంద్‌తో జనజీవనం స్తంభించింది. మూడు నెలల క్రితం యూనిఫాం ధరించిన నలుగురు పధ్నాలుగేళ్ళ గిరిజన బాలికపై అత్యాచారం జరిపిన కేసులో న్యాయం జరగకపోవడంతో ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్, బిజెపిలు వేరువేరుగా బంద్ పిలుపునిచ్చాయి. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, మార్కెట్‌లు, కార్యాలయాలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మూతపడ్డాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయని పోలీసులు తెలిపారు. రాష్ట్రంలోని కటక్, పూరి, బర్హంపూర్, సంబ్బూర్, బాలసోర్, భద్రక్, రూర్కెలా, సుందర్‌గఢ్ జర్సుగూడ, బర్‌గఢ్, జగత్సింగ్‌పూర్, జైపూర్, కేంద్రపర, కోరాపుట్‌లు బంద్ ప్రభావాన్ని ఎదుర్కొన్నాయి.

ప్రత్యేకం

ప్రైవేటు ఫైనాన్స్ గూండాల చేతుల్లో రైతు హత్య
యుపిలో ఘాతుకం, ఎఐకెఎస్ ఖండన

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

ఉత్తర ప్రదేశ్‌లో బాకీ తీర్చని రైతుపై ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ గూండాలు దాడి చేసి హత్య చేసిన ఘటనను అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) తీవ్రంగా ఖండించింది. ఈ హత్యకు బాధ్యులైన వారిని ఇప్పటి వరకూ అరెస్ట్ చేయకపోవటంపై ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎఐకెఎస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రు.25 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. సీతాపూర్ జిల్లాకు చెందిన జ్ఞాన్‌చంద్ర అనే రైతు ట్రాక్టర్ కొనుగోలు నిమిత్తం ప్రైవేటు ఆర్థిక సంస్థ వద్ద రుణం తీసుకున్నాడు. అందులో కొంత చెల్లించినప్పటికీ మిగిలిన మొత్తాన్ని సకాలంలో చెల్లించలేదంటూ ఆర్థిక సంస్థకు చెందిన గూండాలు ఈ నెల 20న అతడిపై దాడి చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఆ గూండాల బృందంలో ఒకరు రైతును ట్రాక్టర్ ముందుకు నెట్టటంతో అతడు తన కుటుంబ సభ్యుల కళ్ల ముందే ట్రాక్టర్ కింద పడి మరణించాడు. ఈ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ నేరస్తుల్లో ఒక్కరిని కూడా పోలీసులు అరెస్ట్ చేయకపోవటాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. యుపిలోని ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో క్షీణించిన శాంతి, భద్రతల పరిస్థితిని ఈ ఘటన ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఆదిత్యనాథ్ సర్కారు పాలనలో రాష్ట్రంలో అరాచకం ప్రబలిపోయిందని, ఏ ఒక్కరికీ రక్షణ లేకుండా పోయిందని ఎఐకెఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. యుపిలో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాలను మాఫీ చేస్తామని ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ హామీ ఇచ్చారని, యోగి ప్రభుత్వ హయాంలో రైతులు తమ పొలాల్లోనే హత్యకు గురి కావటం సిగ్గుచేటైన విషయమని పేర్కొంది. అప్పుల భారంతో రైతులు హత్యలకు గురవుతున్న ప్రస్తుత పరిస్థితిపై ప్రధాని నరేంద్రమోడీతో పాటు, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది.



సంక్షిప్తం

కన్నయ్యపై దాడి ఘటనలపై విచారణకు నో..

దేశ రాజధానిలో పటియాలా కోర్టు ప్రాంగణంలో జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ (జేఎన్‌యూఎస్‌యూ) మాజీ అధ్యక్షుడు కన్నయ్యకుమార్ మరి కొందరిపై జరిగిన దాడులపై దర్యాప్తు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసును కొనసాగించాల్సిన అవసరమేమీ ప్రస్తుతం కనిపించడం లేదని వెల్లడించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తులు గోగోయ్, ఆర్ భానుమతిల నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తిరస్కరించింది.

పైలెట్ల లైసెన్స్‌లను రద్దు చేసిన డిజిసిఎ

ముంబై : జెట్ ఎయిర్ వేస్ విమానంలో వాగ్వివాదంతో కొట్టుకునేంత వరకు వెళ్లిన పైలెట్లపై పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ చర్యలు తీసుకుంది. తాజాగా బుధవారం వారిద్దరి లైసెన్సును ఐదేళ్ల పాటు రద్దు చేస్తున్నట్లు డిజిసిఎ చీఫ్ బిఎస్ భుల్లార్ ప్రకటించారు. ఈనెల ఒకటో తేదీన లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం నుంచి 324 మంది ప్రయాణికులు, 14 మంది సిబ్బందితో ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ కు బయల్దేరిన జెట్ ఎయిర్ వేస్ విమానం గాల్లో ఉండగా, సీనియర్ పైలెట్, మహిళా కో పైలెట్ మధ్య వివాదంతో ఒకరిని ఒకరు కొట్టుకున్నారు.

కొత్త బడ్జెట్‌లో ఉచితాలుండవ్ : పనగారియా

న్యూయార్క్ : కేంద్ర కొత్త బడ్జెట్ సంస్కరణలతో కూడినదేనని నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా అభిప్రాయం వ్యక్తం చేశారు. పెట్టుబడుదారులకు భారత్ తరపున ఆకర్షించడానికి వీలుగా నెలవారీ నిర్వహిస్తున్న లెక్చర్స్‌లో భాగంగా పనగారియా న్యూఇండియా అనే అంశంపై మాట్లాడారని న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ సందీప్ చక్రవర్తి తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రజలను ఆకర్షించేందుకు ఉచిత పథకాలతో కాకుండా ఆర్థిక సంస్కరణలతోనే ముందుకు వెళతారని పనగారియా పేర్కొన్నారు. భారత్ ఆర్థికాభివృద్ధి సమస్యలకు యుపిఎ పాలనలోని తప్పిదాలే కారణమన్నారు. ప్రస్తుత ప్రభుత్వమే కొనసాగితే , కాంగ్రెలా తప్పులు చేయదని, భారత్ స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని వివరించారు.

ఫెడరల్ రిజర్వు బ్యాంకు చైర్మన్‌గా పావెల్

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వు బ్యాంకు తదుపరి చైర్మన్‌గా పావెల్ నియమితులు కాను న్నారు. ప్రస్తుత చైర్మన్ ఎలెన్‌కు పదవీ కాలం ఫిబ్రవరితో ముగుస్తుండటంతో ఆ స్థానంలో పావెల్ (64)ను నియమించేందుకు బుధవారం యుఎస్ సెనేట్ ఆమోదం లభించింది. పావెల్ పస్తుతం ఫెడరల్ రిజర్వు గవర్నర్‌గా సేవలంది స్తున్నారు. ఈయన కూడా ఎలెన్ మాదిరిగానే ఆర్థిక విధానాలను కొనసాగించ గలరని భావిస్తున్నారు.

మునిగిన పారిస్

పారిస్ నగరంలో నుండి ప్రవహిస్తున్న సీన్ నది కట్టలు తెగిపోవటంతో పారిస్‌లోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి.



సిరియాపై అమెరికా దుష్ప్రచారం

రసాయన దాడులు చేస్తుందని రష్యాపై ఆరోపణలు

వాషింగ్టన్ : సిరియాలో రసాయన ఆయుధాల దాడికి సంబంధించిన సంఘటనలన్నింటికీ రష్యానే కారణమని ఆరోపించడం ద్వారా ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని అమెరికా చూస్తోంది. సిరియాలోని శాంతి క్రమాన్ని స్తంభింపచేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో తన విధ్వంసక పాత్ర నుండి అందరి దృష్టిని మళ్లించేందుకు చూస్తోందని రాజకీయ విశ్లేషకులు, నిపుణులు పేర్కొంటున్నారు. సిరియాలో రసాయన దాడులను ఎవరు నిర్వహించారనే దానితో నిమిత్తం లేకుండా ప్రతీ దాడికి రష్యానే అంతిమంగా బాధ్యురాలని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ పేర్కొన్నారు. తూర్పు గౌటాలో క్లోరిన్ వాయువుతో దాడి జరిగిందంటూ నిర్ధారితం కాని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. సిరియాలో కొనసాగుతున్న తన అక్రమ సైనిక ఆక్రమణను సమర్థించుకునేందుకు, అక్కడ ఉద్రిక్తతలు పెంచేందుకు ఈ ఆరోపణలు ఉద్దేశించబడ్డాయని ఆర్థిక శాఖ మాజీ సహాయ మంత్రి పాల్ క్రాయిగ్ రాబర్ట్స్ భావిస్తున్నారు. బీరుట్‌లోని లెబనాన్ యూనివర్శిటీలో అంతర్జాతీయ సంబంధాలు, చరిత్ర ప్రొఫెసర్ డా॥జమల్ వకీమ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సిరియాలో ప్రభుత్వ మార్పు జరగాలన్న తన వైఖరి నుండి వాషింగ్టన్ బయటపడడం లేదని, అసద్‌ను ఎలాగైనా మార్చాలన్నదే వారి ధ్యేయమని అందుకే ఈ రీతిన వ్యవహరిస్తోందని బీరుట్‌కి చెందిన జర్నలిస్టు మార్టిన్ జే వ్యాఖ్యానించారు.

శ్రీలంక, సింగపూర్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

కొలంబో : స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై శ్రీలంక, సింగపూర్ మంగళవారం సంతకాలు చేశాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఉద్దేశించబడింది. ప్రస్తుతం శ్రీలంకలో పర్యటిస్తున్న సింగపూర్ ప్రధాని లీ సియెన్ లూంగ్, శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాలా సిరిసేనలు బుధవారం ఇక్కడ జరిపిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఒప్పందంపై సంతకాలు చేశారు. శ్రీలంక అధ్యక్షుని ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికార పర్యటన నిమిత్తం సోమవారం సింగపూర్ ప్రధాని ఇక్కడకు చేరుకున్నారు. ఎంపిక చేసిన వస్తువులు, సేవలకు పన్ను రహిత సదుపాయం అమలు కావడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని చెప్పారు.

అధిక వేతనాలకై జర్మనీలో కార్మిక సంఘాల పోరాటం

బెర్లిన్ : అధిక వేతనాలు కోరుతూ జర్మనీ లోని కార్మిక సంఘాలు పోరు బాట పట్టాయి. దేశంలోని అత్యంత శక్తివంతమైన ఐజి మెటల్ యూనియన్ ఈ పోరాటానికి నేతృత్వం వహి స్తోంది. దేశంలోని కీలకమైన మెటల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పరిశ్రమలకు చెందిన దాదాపు 39లక్షల మంది కార్మికులకు ఈ యూనియన్ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఆరు శాతం వేతనాలు పెంచాలని కార్మికులు డిమాం డ్ చేస్తున్నారు. వోక్స్‌వాగన్, బిఎండబ్ల్యు, బోష్, సీమెన్స్ వంటి కంపెనీలతో సహా పలు కంపె నీలు, సంస్థల్లో సమ్మె హెచ్చరికలతో 6లక్షల మందికి పైగా కార్మికులను సమీకరించారు. కంపెనీ యాజమాన్యలతో బుధవారం కార్మిక సంఘాల నేతలు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చల్లో ఎలాంటి పురోగతి సాధించకపోతే వాకౌట్లు, సమ్మె తప్పదని ఐజి మెటల్ యూనియన్ ఇప్పటికే హెచ్చరించింది.

సురక్షిత దేశాలలో ఒకటిగా చైనా



బీజింగ్ : చైనా ఇప్పుడు ప్రపంచం లోని అత్యంత సురక్షితమైన దేశాలలో ఒకటిగా ఆవిర్భవించిందని ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) కేంద్ర కమిటీ వర్క్‌షాప్ ప్రకటించింది. దేశంలో తీవ్రమైన నేరాల సంఖ్య గత ఏడాది 51.8 శాతం మేర పడిపోయిం దని, రోడ్డు ప్రమాదాల సంఖ్య 43.8 శాతం మేర తగ్గిందని, ప్రతి లక్ష మంది ప్రజలకు 0.81 హత్య కేసులు నమోద య్యాయని ఈ వర్క్‌షాప్ తన ప్రకటనలో వివరించింది. ప్రజా భద్రత విషయంలో 2012లో 87.55 శాతం మేర వున్న ప్రజల సంతృప్త స్థాయి ఇప్పుడు 95.55 శాతానికి పెరి గిందని, రాజకీయ, చట్టవిభాగాల పనితీరు పట్ల సంతృప్తి 69.43 శాతం నుండి 80.24 శాతానికి పెరిగిందని తెలిపింది. సత్వర ఆర్థికాభి వృద్ధితో పాటు సామాజిక సుస్థి రత చైనా సాధించిన మరో ప్రధాన విజయమని చైనా రాజ కీయ నేతలు, విదేశీ నిపుణులు వ్యక్తం చేస్తున్న విశ్వాసం చైనా పరిస్థితులకు అనువైన సోషలిజం ఆధిక్యతను ప్రతి బింబిస్తోందని సిపిసి వర్క్‌షాప్ తన ప్రకటనలో వివరిం చింది. గత ఐదేళ్ల కాలంలో విస్తృత స్థాయిలో అమలుచేసిన న్యాయ సంస్కరణలతో చైనాలో న్యాయవ్యవస్థ పనితీరు, సామర్థ్యత, విశ్వసనీయత గణనీయంగా మెరుగుపడ్డాయని వివరించింది. కేసుల విచారణ, తలసరి కేసుల కేటాయింపు, కేసుల ముగింపు రేటింగ్ వంటివి గత ఏడాది కన్నా 20 శాతం మేర పెరిగాయని తెలిపింది. గత ఐదేళ్లలో 25 వేల మంది విధి నిర్వహణలో పాల్పడిన నేరాలకు శిక్షను ఎదు ర్కోగా, దాదాపు లక్ష మందికి పైగా వ్యక్తులు చిన్న స్థాయి అవినీతి కేసుల్లో శిక్షను అనుభవించారని, దీనికి తోడు 221 మంది ప్రవాస అవినీతి పరులను ఇతర దేశాల నుండి వెనక్కి రప్పించి శిక్షించారని సిపిసి తన ప్రకటనలో వెల్లడిం చింది. చైనాలో అత్యంత ప్రమాదకరమైన రీతిలో పెరుగు తున్న నేరాలలో ఆర్థిక నేరాలు ప్రధానమైనవని, గత ఐదేళ్ల కాలంలో వివిధ విభాగాలలో దాదాపు 60వేలకు పైగా ఆర్థికపరమైన నేరాలను వెలుగులోకి తేవటం ద్వారా రెండు లక్షల కోట్ల ఆర్‌ఎంబిల ఆర్థిక నష్టాన్ని రికవర్ చేయగలిగామని వివరించింది. దీనితో పాటు అక్రమ విరాళాల సేకరణ, ఆన్‌లైన్ పిరమిడ్ విక్రయాలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ వంటి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపినట్లు సిపిసి తన ప్రకటనలో తెలిపింది.

అమెరికా పాఠశాలలో కాల్పులు



వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చోటుచేసుకుంది. స్థానిక కెంటకీ హై స్కూల్‌లోకి ఓ ఆగంతకుడు విద్యార్థులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు అధికారులు తెలి పారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. 2018లో అగ్రరాజ్యంలో జరిగిన తొలి దాడి ఇదేనని పోలీసులు తెలిపారు. కాల్పుల ధాటికి కొందరు విద్యార్థులు భయంతో దగ్గర్లోని పొలాల్లోకి పరుగులు తీయగా, మరికొందరు వాహనాల్లో దాక్కున్నారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. 2013 నుంచి ఇప్పటివరకు అమెరికా పాఠశాలల్లో 283 దాడులు జరిగాయని ఓ నివేదికలో వెల్లడైనట్లు పోలీసులు చెప్పారు.

పెరిగిన హత్యాకాండ

2017 సంవత్సరం అమెరికన్ ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిందని గత ఏడాది కొనసాగిన హత్యాకాండపై న్యూయార్క్ నగరానికి చెందిన యాంటీ వయొలెన్స్ ప్రాజెక్ట్ తన నివేదికలో వెల్లడించింది. విద్వేష నేరాలపై ఈ సంస్థ విడుదల చేసిన తన వార్షిక నివేదికలో గత ఏడాది కాలంలో లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ (ఎల్‌జిబిటి) వర్గానికి చెందిన వారిపై 52 నేరాలు నమోదయ్యాయని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 86 శాతం మేర పెరి గిందని వివరించింది. గత ఏడాది ఆగస్టులో మిస్సోరిలోని సెయింట్ లూయిస్ పోలీసులు కాల్చిచంపిన నల్లజాతి ట్రాన్స్‌జెండర్ మహిళ కివి హెర్రింగ్ (30) హత్య తో సహ ప్రతి హత్యనూ ఈ నివేదికలో సవివరంగా పొందుపర్చారు. బాధితుల్లో అధికశాతం మంది ట్రాన్స్‌జెండర్ మహిళలు, హోమో సెక్సువల్, బైసెక్సువల్, సిస్ జెండర్ పురుషులే కావటం విశేషం. దేశంలో పెరుగుతున్న ఈ హింసా కాండను అడ్డుకునేందుకు శాసనకర్తలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవటం లేదని ఈ నివే దిక ఎత్తిచూపింది. ఈ వర్గాల ప్రజలపై పెరుగుతున్న నేరాల సంఖ్య వారికి భద్రత కు అవసరమైన తక్షణ చర్యల అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని వివరించింది. 2016 రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో ప్రసంగించిన డొనాల్డ్ ట్రంప్ తాను అధికారంలోకి వస్తే వీరిని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుం టానని చెప్పినప్పటికీ, పదవి చేపట్టిన తరువాత వీరిని విస్మరించారని ఈ నివేదిక విమర్శించింది. గత అధ్యక్షుల తరహాలో ఏటా జూన్ నెలను ఎల్‌జిబిటి వర్గానికి గర్వకారణమైన నెలగా గుర్తించే సంప్రదాయాన్ని సైతం ట్రంప్ విస్మరించారించా రని, ఆయన తప్ప విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్‌తో సహా ఇతర మంత్రి వర్గ సభ్యులు జూన్ నెలను ఎల్‌జిబిటి నెలగా గుర్తించారని ఈ నివేదిక వివరించింది.

హాఫీజ్ సయీద్ ఛారిటీలను స్వాధీనం చేసుకుంటాం

పాక్ ప్రధాని ప్రకటన

ఇస్లామాబాద్ : ఉగ్రవాదిగా ప్రకటితుడైన హాఫీజ్ సయీద్ ఆధ్వర్యంలోని జమాత్ ఉద్ దవా, ఫలాఎ ఇన్సానియత్ ఫౌండేషన్ వంటి ఛారిటీ సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పాకిస్తాన్ ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ ప్రకటించారు. ఉగ్రవాదానికి ఆర్థిక అండదండలందిస్తున్న సంస్థలను కట్టడి చేయాలంటూ అమెరికాతో పాటు అంతర్జాతీయంగా వత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో హాఫీజ్ సయీద్ ఆధ్వర్యంలోని ఛారిటీ సంస్థలను స్వాధీనం చేసుకునేందుకు పాక్ ప్రభుత్వం గత నెలలోనే రహస్య ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆంక్షలు విధించబడి, కార్యకలాపాలను అనుమతించని ఛారిటీ సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రధాని అబ్బాసీ ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఐక్యరాజ్యసమితి విధించిన ఆంక్షల అమలుకు పాకిస్తాన్‌లోని ప్రతి ఒక్కరూ కట్టుబడి వున్నారని ఆయన చెప్పారు. అయితే ఈ ఛారిటీలను ఎప్పుడు స్వాధీనం చేసుకుంటారన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ భేటీల తరువాత ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థలను కట్టడి చేయటంలో తమ ప్రభుత్వం కొంత ప్రగతి సాధించిందని ఆయన చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

లాలూకు మరో ఐదేళ్లు 'జైలు'

లాలూ ప్రసాద్ రాంచీ హై కోర్టులో అప్పీల్ చేసుకున్నారు. బుధవారం తీర్పు వెలువరించిన మూడో కేసులో మొత్తం 76 మంది నిందితులుగా ఉన్నారు. వీరిలో 14 మంది కేసు విచారణలో ఉండగానే మృతి చెందారు. ముగ్గురు అప్రూవల్స్‌గా మారారు. ఇద్దరు నేరాన్ని అంగీకరించగా, ఒకరు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణ ఎదుర్కొన్న 56 మందిలో ఆరుగురు రాజకీయ నాయకులు కాగా, ముగ్గురు ఐఎఎస్ అధికారులు, పశుగణాభివృద్ధి శాఖకు చెందిన ఆరుగురు అధికారులు, ఒక ట్రెజరీ అధికారి, సంబంధిత శాఖకు చెందిన 40 మంది సిబ్బంది ఉన్నారు.

మరో మూడు కేసులు

అంతకుముందు దాణా కుంభకోణానికి సంబంధించిన మరో కేసులో సెప్టెంబరు 30, 2013న లాలూను దోషిగా నిర్ధారిస్తూ కోర్టు ఐదేళ్ళు జైలు శిక్ష విధించింది. దాణా కుంభకోణంలో లాలూపై మరో మూడు కేసులున్నాయి.

బిజెపి, ఆరెస్సెస్, నితీష్‌ల కుట్ర : తేజస్వీ యాదవ్

దాణా కుంభకోణానికి సంబంధించి తన తండ్రిపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, బిజెపి, ఆరెస్సెస్‌లు కలిసి కుట్ర పన్నాయని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఆరోపించారు. సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పును హై కోర్టులో సవాల్ చేస్తామని తేజస్వీ తెలిపారు. ఈ విషయమై అవసరమైతే సుప్రీం కోర్టు దాకా వెళ్తామన్నారు. నితీష్, బిజెపి, ఆరెస్సెస్‌లు లాలూను ఈ కేసులో ఇరికించాయన్నారు ఈ ఏడాది డిసెంబరులో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే యోచిస్తున్నదని తేజస్వీ యాదవ్ అన్నారు. అందువల్లే చట్టపరంగా లాలూను ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తేజస్వీ యాదవ్ ఆరోపణలపై బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ స్పందిస్తూ పశువుల దాణాకు సంబంధించి గడ్డి కుంభకోణంలో లాలూ ప్రమేయం ఊహించినదే అన్నారు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదన్నారు. ఆర్‌జెడి నుంచి వ్యాఖ్యలు వెలువడటం దురదృష్టకరమన్నారు.

పాక్‌లో అమెరికా డ్రోన్ దాడి

అధికార వర్గాలు తెలిపాయి. తాలిబన్ ఉగ్రవాద సంస్థకు హక్కాని నెట్ వర్క్ అనుబంధంగా పనిచేస్తోంది. కాబూల్‌లోని ఒక లగ్జరి హోటల్‌పై హక్కాని గ్రూప్ దాడి చేసిందని ఆఫ్ఘన్ అధికారులు ఆరోపించిన కొన్ని రోజుల తరువాత పాక్‌పై అమెరికా డ్రోన్ దాడి జరగడం విశేషం. ఆఫ్ఘన్ సరిహద్దుకు 50 కిలోమీటర్ల దూరంలో పాకిస్తాన్ భూభాగంలోని కుర్రమ్ గిరిజన జిల్లా మముజయ్ గ్రామంలో బుధవారం తెల్లవారుఝామున డ్రోన్ దాడి జరిగిందని, దాడి చేసిన డ్రోన్ అమెరికాదని పాక్ ప్రభుత్వ అధికారులు తెలిపారు. డ్రోన్ దాడిపై వ్యాఖ్యానించేందుకు పాకిస్తాన్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం నిరాకరించింది. రెండు గదులు ఉన్న కాంపౌండ్‌లోకి డ్రోన్ ఒక క్షిపణిని పేల్చిందని, దీంతో ఆ భవనం ధ్వంసమై కమాండర్ మృతి చెందాడని కుర్రమ్‌లోని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. డ్రోన్ దాడిలో మృతి చెందిన కమాండర్‌ను నజీర్ మహ్మద్ అలియాస్ ఇహసునుల్లా ఖుర్యాగా గుర్తించినట్లు ఆయన చెప్పారు. మృతి చెందిన కమాండర్ ఆఫ్ఘన్ దేశస్థుడని తెలిపారు. దాడి జరిపిన తరువాత కూడా అమెరికా డ్రోన్ 15 నిముషాలు అక్కడే చక్కర్లు కొట్టిందని చెప్పారు. అమెరికానే డ్రోన్ దాడి జరిపిందని ఆ ప్రాంతానికి చెందిన పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపారు. ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారం మేరకు డ్రోన్ రెండు క్షిపణులను పేల్చింది. ఆ భవనం కాంపౌండ్‌లో ఉన్న హక్కాని నెట్‌వర్క్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. అమెరికా డ్రోన్ జరిపిన దాడిలో ఒక మిడ్ లెవల్ ఆఫ్ఘన్ కమాండర్ మృతి చెంది ఉంటాడని హక్కాని గ్రూప్‌నకు చెందిన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. రెండు దేశాల మధ్య సరిహద్దుపై ఉన్న ఉగ్రవాద సంస్థలు ఆఫ్ఘనిస్థాన్‌పై దాడికి పాల్పడుతున్నాయని ఎంతో కాలంగా అమెరికా, ఆఫ్ఘనిస్థాన్‌లు ఆరోపిస్తున్నాయి.

పాకిస్తాన్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్‌లకు డిప్యూటి చీఫ్‌గా వ్యవహరిస్తూ హక్కాని నెట్‌వర్క్‌కు నేతృత్వం వహిస్తున్న సిరాజుద్దీన్ హక్కానీ పాక్ ఐఎస్ఐకి పనిచేస్తున్న కీలకమైన వ్యక్తిగా అమెరికా అధికారులు పేర్కొంటున్నారు. కాబూల్‌లోని ఒక ఇంటర్‌కాంటినెంటల్ హోటల్‌లో హక్కాని గ్రూపే దాడి జరిపిందని ఆఫ్ఘనిస్థాన్ దేశీయ మంత్రిత్వ శాఖ ఆదివారం ఆరోపించింది. కొన్ని గంటలపాటు జరిపిన ఈ దాడిలో 22 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ దాడికి తమదే బాధ్యతని ఒక అధికారిక ప్రతినిధి ద్వారా హక్కాని గ్రూపు ప్రకటించింది కూడా. హోటల్ వద్ద ఉన్న భద్రతను దాటుకుని ఉగ్రవాదులు ఎలా ప్రవేశించారన్న విషయమై అధికారులు ఇంకా దర్యాప్తు జరుపుతూనే ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ఎస్ఐ, ఎఎస్ఐసహా నలుగురు జవాన్లు మృతి
- తొమ్మిదిమంది జవాన్లకు తీవ్రగాయాలు
- మందుపాతరకు మరొకరు మృతి, ఇద్దరికి గాయాలు


మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ తరలిస్తున్న జవాన్లు

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా విరపనార్ అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కూంబింగ్‌కు వెళ్లిన పోలీస్ జవాన్లపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఎఎస్ఐ సహా ఇద్దరు జవాన్లు మృతి చెందారు. మంగళవారం నుంచి నారాయణపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో 60 మంది ఎస్‌పిఎఫ్ జవాన్లు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసు జవాన్లు టార్గెట్‌గా మావోయిస్టులు వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. విరపనార్ అటవీ ప్రాంతానికి పోలీసుజవాన్లు చేరుకోగానే అక్కడే మాటువేసిన మావోయిస్టులు ఒక్కసారిగా వారిపై బుల్లెట్లవర్షం కురిపించినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో సబ్ఇన్‌స్పెక్టర్ వినోద్ కౌశిక్, ఎఎస్ఐ మూల్‌చంద్ కవర, జవాన్లు జీవనాథ్‌పూజారి, రాజాసింగ్ మర్కామ్ మృతి చెందారు. తొమ్మిదిమంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హెలికాప్టర్ ద్వారా ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయపూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

మందుపాతర పేలి ఒకరు మృతి

బీజాపూర్ జిల్లాలో బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఒక జవాను మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆ జవాన్ పేరు లకన్ గడపాల్ అని పోలీస్ ఉన్నతాధికారి ఎంఆర్ అహిరా తెలియజేశారు. గణతంత్ర దినోత్సవానికి ముందు మావోయిస్టుల కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం దండకారణ్యంలో చేపట్టిన కూంబింగ్‌లో మావోయిస్టులదే పైచేయి సాధించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక నిరాహారదీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, తమను రెగ్యులర్ చేయాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలకు దిగారు. ఈ దీక్షలను కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు బుధవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు ప్రభుత్వం హామీనిచ్చిందని గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత హామీని అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులు మరణిస్తే రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వారికి ఇస్తున్న పిఎస్ రేటు పద్ధతి రద్దు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(రెగ్యులర్) జనరల్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి దీక్షలను సందర్శించి తమ యూనియన్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు.

సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య విజయరాజు, ఉన్నత విద్యా మండలి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యానాథ్ దాస్, ఆంధ్రప్రదేశ్ హైయర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ఆచార్య ఎస్.వరదరాజన్, ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య పి.నరసింహారావు, ఇంక్యుబేసిన్ సెంటర్ సిఇఒ ఆచార్య వి.వల్లీకుమారి, ఎయు విసి ఆచార్య జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వుడా ఉద్యగ భవన్‌లో జిమ్ ప్రారంభం

సుమారు రూ.12 లక్షలతో వుడా ఉద్యోగులు కోసం వుడా ఉద్యోగ భవన్ తొమ్మిదో అంతస్తులో వుడా ఏర్పాటు చేసిన జిమ్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్‌లోని పరికరాలను చూసి వాటి ప్రాధాన్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వుడా భవనంలోని వివిధ విభాగాల గురించి ఆరా తీశారు. అనంతరం పెందుర్తిలోని ఎస్ఆర్.పురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎలిమెంటరీ పాఠశాలను, చెత్త శుద్ధి చేసే కేంద్రాన్ని గవర్నర్ పరిశీలించారు.

అవే సంస్థలు.. అవే చర్చలు..

సదస్సుల్లో కూడా ఇటువంటి విధానాలే బయటపడ్డాయి. ప్రతి సదస్సుకూ ఒకే సంస్థ హాజరుకావడం, వారితోనే ఒప్పందాలు చేసుకోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. దీనితోనే ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు కూడా వేరే రాష్ట్రాలకు తరలిపోవడం తెలిసిందే. ఈ కారణంగానే లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనాలు వేసుకున్నప్పటికీ పదిశాతం మాత్రమే ఫలితం కన్పించటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి సదస్సుకూ సంస్థల్ని ఆహ్వానించే కార్యక్రమాన్ని సిఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండ్రస్ట్రీ) నిర్వహించేది. దీంతో నిర్దిష్టమైన సంస్థల్ని మాత్రమే ఆహ్వానించడంతో కొత్తవారికి అవకాశం లేకుండా పోయింది. దీని వల్లనే ఎప్పుడు చూసినా ఒకే సంస్థలు కన్పించడం జరుగుతోందని అధికారులు కూడా అంటున్నారు. పెట్టుబడుల సదస్సుల్లో ఒప్పందాలు చేసుకున్న సంస్థలు తరువాత కాలంలో వేరే రాష్ట్రాలకు వెళ్లిపోయారని, దీంతో చేసుకున్న ఒప్పందాలు వృథాగా మారిపోయాయని వారు విశ్లేషిస్తున్నారు.

పద్మావత్‌ను అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

బస్సుపై రాళ్ళు రువ్వారు. శతాబ్దాల చరిత్ర కలిగిన చితోర్ కోటను మూసివేశారు. కర్ణిసేన సభ్యులు కోటపై దాడి చేయడానికి యత్నించడంతో వందల సంవత్సరాల చరిత్రలో కేవలం రెండోసారి కోటను మూసివేయాల్సి వచ్చింది. హర్యానాలో కూడా సినిమా హాళ్ళ యజమానులెవరూ చిత్ర ప్రదర్శనకు ముందుకు రావడం లేదు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దాదాపు 200మంది ఆందోళనకారులు మూడవ నెంబర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. చిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. లక్నో, ఇటావాల్లో కూడా ఆందోళనలు సాగాయి. వాహనాలను ధ్వంసం చేసిన, దుకాణాలను బలవంతంగా మూయిస్తున్న ఆందోళనకార ులపై పోలీసులు లాఠీచార్జికి దిగారు. అహ్మదాబాద్‌లో దాదాపు 30 ద్వి చక్ర వాహనాలను అల్లరి మూక దగ్ధం చేసింది. దుకాణాల కిటికీలను బద్దలు కొట్టారు. దాంతో పోలీసులు మంగళవారం రాత్రి కాల్పులు జరిపారు. ముంబయిలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా 30మంది కర్ణిసేన కార్యకర్తలను అరెస్టు చేశారు. అహ్మదాబా ద్‌లో 44మందిని అదుపులోకి తీసుకున్నారు. కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కాల్వి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ చిత్రాన్ని ప్రదర్శించేందుకు అనుమతించబోమని స్పష్టం చేశారు. చిత్ర ప్రదర్శన నిలువరించేందుకు రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు చివరి యత్నం చేశాయి. వారి ప్రయత్నాలను సుప్రీం కోర్టు తిరస్కరించింది. తమ ఆదేశాలకు కట్టుబడి వుండాల్సిందేనని, కావాలంటే చిత్రాన్ని చూడొద్దంటూ ప్రజలను కోరుకోండని న్యాయమూర్తులు పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించారని, చితోర్ రాణి పద్మినిని అవమానించేలా చిత్రంలో చూపించారని ఆందోళనకారులు పేర్కొంటున్నారు.

నాలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు రద్దు

తమ సభ్యులెవరూ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవాల్లో చిత్రాన్ని ప్రదర్శించబోరని మల్టిప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రాష్ట్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని పేర్కొంది. దేశంలోని 75శాతం మల్టిప్లెక్స్ యజమానులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ అసోసియేషన్ రాజ్‌పుత్ సంస్థలు పాల్పడుతున్న విధ్వంసకాండతో ఈ నిర్ణయం తీసుకుంది. 25వ తేదీన చిత్రం విడుదల కావాల్సి వుంది.

జగన్ వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారు

- వైసిపి నేత జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదాపై జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని వైసిపి నేత జోగి రమేష్ విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హోదా గురించి పోరాడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ అని అన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న జగన్‌కు మద్దతు ఇవ్వకపోగా సిపిఐ నేత నారాయణ ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. ప్రధాని మోడీకి స్టెఫినీ కావాలనుకుంటున్నారా అంటూ జగన్ను వ్యాఖ్యానించడం నారాయణ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కమ్యూనిస్ట్ పార్టీలంటే తమకు ఎంతో గౌరవముందన్నారు. సిపిఐకి వెన్నుపోటు పొడుస్తూ పచ్చ చొక్కాలు వేసుకుని మాట్లాడతారా అని నారాయణను ప్రశ్నించారు. హోదా కావాలనుకునే వారు జగన్‌తో కలిసి రావాలన్నారు. హోదా వద్దు ప్యాకేజీనే ముద్దు అనుకునే వారు మాత్రం చంద్రబాబు వెంట నడవాలని రమేష్ సూచించారు. అచ్చన్నాయుడు, ఆదినారాయణరెడ్డిలకు జగన్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. కామన్ సెన్స్ లేని మంత్రి కామినేని అని విమర్శించారు. నిజంగా ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సదుద్దేశం సిఎం చంద్రబాబుతో పాటు ఇతర మంత్రులకుంటే ముందు కేంద్రంలో ఉన్న టిడిపి మంత్రులతో రాజీనామా చేయించాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని బిజెపి మంత్రులనూ మంత్రివర్గం బయటకు పంపాలని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా విషయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రత్యేక హోదాతోనే ముడిపడి ఉందని, ఎవరు హోదా ఇస్తే వారికి వైసిపి సహకరిస్తుందని, ఇప్పటికే అదే మాటకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని ఒక్క అబద్ధం చెప్పి ఉంటే, వైఎస్ జగనే సీఎం అయ్యి ఉండేవారన్నారు. అలా అబద్ధాలు చెప్పేగుణం తమ నాయకుడికి లేదన్నారు.



లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, వినాయక్, సి. కళ్యాణ్

గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుంది: సి.కల్యాణ్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర ప్రోగ్రెస్ గురించి ఆయన నిర్మాత మాట్లాడారు. చిత్రీకరణ, పోస్ట్‌పొడక్షన్ పనులు పూర్తయ్యాయి. నిన్ననే ఫైనల్ కాపీ చూసుకున్నాను. పూర్తి నమ్మకంతో వున్నా. మా సినిమా దేనికీ పోటీ కాదు. సంక్రాంతికి బాలయ్య సినిమా 'జై సింహా'తో హిట్ కొట్టాం. ఫిబ్రవరిలో ఈ సినిమా వస్తుంది. మాస్, ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఫ్యామిలీలకు కూడా నచ్చుతుంది. నేను గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుంది. నిన్ననే నాకు దర్శకుడు ఈ సినిమాను చూపించారు. చాలా బాగా నచ్చింది. యువతకు, వినాయక్ ఫ్యాన్స్‌కి నచ్చే సినిమా అవుతుంది. రిపీట్ ఆడియన్స్ ఎక్కువగా వస్తారు. డ్యాన్సులు, మూవ్‌మెంట్స్ చాలా బాగా చేశాడు తేజ్. 2018 మా సీకే ఎంటర్‌టైన్‌మెంట్ అవుతుంది. వినాయక్‌గారి ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఎలిమెంట్స్‌తో ఎనర్జిటిక్‌గా ఉండే సినిమా ఇది. ఇంటలిజెంట్‌గా వస్తున్నాం. ఇంటలిజెంట్‌గా కొడతాం' అని చెప్పారు. సప్తగిరి మాట్లాడుతూ.. హీరో స్నేహితునిగా చేశా. మిగిలిన దర్శకుల సినిమాలు చేసేటప్పుడు కాలేజీకి వెళ్లినట్టు ఉంటుంది. కానీ వినాయక్‌గారి సినిమాల షూటింగ్ అయితే ఎగ్జామ్‌లాగా రెండు గంటలే ఉంటుంది. మన పని పూర్తయిన తర్వాత అక్కడ మనం ఉండటానికి ఆయన ఒప్పుకోరు. వెళ్లి వేరే సినిమాలు చేసుకోమంటారు. నటుడిగా ప్రతి శుక్రవారం కనిపించమని చాలా మంది అడుగుతున్నారు. మంచి పాత్రలు వస్తే చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. తప్పకుండా నవ్విస్తానని అన్నారు.

వినాయక్ మాట్లాడుతూ.... కల్యాణ్‌గారి సంస్థలో సినిమా చేయమని మా నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు. నాకు ఆయన సంస్థలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నగారి కోరిక నెరవేరింది. సెట్లో ఇద్దరం అన్నదమ్ములం ఉన్నట్టు అనిపించింది. 'కృష్ణ' సినిమాలాగా ఇందులోనూ అన్ని అంశాలు ఉంటాయి. తేజ్ చాలా బాగా చేశాడు. 'కొండవీటిదొంగ'లోని 'చమక్కు చమక్కు' పాటను ఇందులో రీమిక్స్ చేశాం. తేజ్ వేసిన స్టెప్పులు చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపించింది. శివ ఆకుల మంచి కథ ఇచ్చారు. మా కాంబినేషన్‌లో హిట్ సినిమా అవుతుంది. లావణ్య మా చిత్రంలో గ్లామర్‌గా అనిపిస్తుంది. కెమెరామేన్, తమన్ సంగీతం సినిమాకు హైలైట్' అని అన్నారు.

సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ... అనుకున్న టైమ్‌కి పూర్తి చేశాం. 'ఖైదీ నెంబర్ 150' అయిన తర్వాత వినాయక్‌గారు నాతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. మంచి పాత్ర కుదిరింది. డబ్బింగ్‌లో కొన్ని సీన్లు చేసి షాక్ అయ్యాను. నేనేనా చేసింది అని అనిపించింది. నాతో పాటు 9న వస్తున్న వరుణ్ సినిమా కూడా హిట్ కావాలి' అని చెప్పారు.

'టచ్ చేసి చూడు' సెన్సార్ పూర్తి

రవితేజ హీరోగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశీఖన్నా, సీరత్ కపూర్ నాయికలు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. ఫిబ్రవరి 2న చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు.నిర్మాతలు మాట్లాడుతూ... ఈ వారంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహిస్తాం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన పాటలకు, టీజర్‌కు అనూహ్య స్పందన వస్తోంది. రవితేజ చాలా స్టయిలిష్‌గా కనిపిస్తున్నారని సర్వత్రా అందరూ ప్రశంసిస్తున్నారు. మాకు చిరకాల మిత్రుడైన రవితేజతో ఈ సినిమా నిర్మిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. వక్కంతం వంశీ ఈ కథను తయారు చేశారు. చూసిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుందని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం : జామ్ 8, స్క్రీన్ ప్లే: దీపక్ రాజ్, మాటలు: శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డైలాగ్స్: రవిరెడ్డి మల్లు,కేశవ్, ఛాయాగ్రహణం : చోటా.కె.నాయుడు, దర్శకత్వం : విక్రమ్ సిరికొండ.



రవితేజ, రాశీఖన్నా

ప్రారంభమైన భరతవర్ష క్రియేషన్స్

భరతవర్ష క్రియేషన్స్ పతాకంపై నూతన నటీ నటులతో చెన్నకుని శెట్టి (కుమార్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పూజా కార్యక్రమాలు ఫిలించాంబర్‌లో జరిగాయి. దర్శకులు సముద్ర, తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామ కష్ణగౌడ్, కార్యదర్శి సాయి వెంకట్, జి.వికె4 మ్యూజిక్ అధినేత వి. గోపాలకష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం సముద్ర మాట్లాడుతూ.. సరికొత్త ఆలోచనలతో యంగ్ టీం రూపొందిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందన్నారు. రామకష్ణగౌడ్, సాయివెంకట్ మాట్లాడుతూ... ఈ మూవీ దర్శకుడు మంచి టాలెంటెడ్‌గా కనిపిస్తున్నారు. పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం విజయోత్సవ సభను జరుపుకునే దాకా వెళుతుందనే నమ్మకముందని అన్నారు. చిత్ర దర్శకుడు మాట్లా డుతూ.. మైథలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నూతన నటీనటులతోపాటు పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్టులు సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేయనున్నారు.

'ఇది నా లవ్ స్టోరీ' ప్రమోషన్‌లో తరుణ్ సందడి

'ఇది నా లవ్ స్టోరీ' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సినీ హీరో తరుణ్ బుధవారం గుంటూరు జిల్లాకు వచ్చారు. పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వివిఐటి)లో చిత్ర యూనిట్‌తో కలిసి తరుణ్ బుధవారం సందడి చేశారు. వివా స్కూల్ చిన్నారులతో కొద్దిసేపు ఉల్లాసంగా గడిపారు. తరుణ్‌తో సెల్ఫీలు దిగేందుకు విద్యార్థులు అమితోత్సాహం చూపారు. అనంతరం తరుణ్ మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ ఎంతో విలువైనది, మరపు రానిది అని చెప్పారు. దానిని సఫలీకృతం చేసుకోవాలని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. బృందంలో హీరోయిన్ ఓవియా, నిర్మాత ఎస్‌వి.ప్రకాష్, దర్శకులు రమేష్, గోపి, క్రిష్టోఫర్ జోసెఫ్, శ్రీనాథ్ విజయ్, కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

– ప్రజాశక్తి–కార్పొరేషన్ (గుంటూరు)



ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య తరుణ్ సందడి

మొన్నటి తరం కలలరాణి
కృష్ణకుమారి మృతి



అలనాటి వెండితెర నాయకి కృష్ణకుమారి (83) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం బెంగుళూరులో తుదిశ్వాస విడిచారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఆమె నటించారు. ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు సహా పాతతరం అగ్రహీరోలందరితోనూ అభినయించారు. ఆమె మరణించారన్న వార్త తెలియగానే సినిమా ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతి చెందారు. కృష్ణకుమారి పశ్చిమ బెంగాల్‌లోని నైహతిలో 1933, మార్చి 6న జన్మించారు. షావుకారు జానకి ఈమెకు పెద్దక్క. సుమారు 150 సినిమాల్లో నటించారు. బెంగళూరుకు చెందిన అజయ్ మోహన్‌ను 1969లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి దీపిక అనే కుమార్తె ఉన్నారు.

నేలమీద జాబిలి

కృష్ణకుమారి తెలుగునాట తొలి గ్లామరస్ హీరోయిన్. లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్. 1951లో 'నవ్వితే నవరత్నాలు'తో కెరీర్ ఆరంభించారు. తెలుగులో ఎక్కువగా ఎన్‌టిఆర్, అక్కినేనితో నటించారు. 50నుంచి 65 వరకు తెలుగు స్వర్ణయుగ కాలంలో అద్భుతమైన సినిమాలు చేసిన నాయిక ఆమె. సావిత్రికి పోటీగా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేశారు. 'కానిస్టేబుల్ కూతురు', 'తిరపతమ్మ కథ' వంటివి ఆమె నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు. గ్లామర్‌పరంగా ఇంకో అడుగు ముందుకు నడిపించిన నాయిక. అందుకే ఆమెను నేలమీద జాబిలి అని పిలిచేవారు. చక్కటి అందగత్తె.. తన అక్క షావుకారు జానకి ఆమె ద్వారా వెండితెరకు పరిచయమై అనంతరం అక్కయ్యను దాటిపోయింది. దాదాపు సూపర్‌స్టార్‌గా నిలిచింది. సావిత్రి, కష్ణాకుమారి నువ్వానేనా అన్నట్లుగా నటించేవారు. ఎన్‌టిఆర్‌తో 'అగ్గిపిడుగు, బందిపోటు, లక్షాధికారి, తిక్క శంకరయ్య, పుచ్చి పుల్లయ్య, ఉమ్మడి కుటుంబం, వరకట్నం.. ఇలా 25 సినిమాలు నటించింది. ఎన్‌టిఆర్ స్థాపించిన ఎన్‌ఎటి బేనర్‌లో తొలి హీరోయిన్ ఈమెనే. చిత్రమేమిటంటే... ఎన్‌టిఆర్ కెరీర్ మొదలు పెట్టాక.. తొలి హీరోయిన్ ఆమె అక్క జానకి. 'షావుకారు'తో జానకిగా మారిపోయింది. ఇక అక్కినేనితో.. 'చదువుకున్న అమ్మాయిలు', 'భార్యాభర్తలు, కులగోత్రాలు, శాంతి నివాసం.. వంటి గొప్ప సినిమాల్లో నటించారు. మూడు సార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు పొందారు. కాంచనమాల, సావిత్రి, ఎన్టీఆర్ అవార్డులు, బ్రిటన్‌లోని బర్మింగ్‌హాం సంస్థ వారి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు.. అన్నిటికీ మించి అంతులేని ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్నారు. ఆ మధ్య చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో సహనటీమణులతో ప్రత్యక్షమయ్యారు.

కృష్ణకుమారి జ్ఞాపకాలు

ఆ కార్యక్రమంలో ఆమెను ఓ విలేకరి పలుకరిస్తే జ్ఞాపకాలను, అనుభవాలను ఇలా పంచుకున్నారు : 'నాకు పదహారేళ్ళప్పుడు మా అమ్మా నేనూ 'స్వప్నసుందరి' సినిమా చూడ్డానికి వెళ్లాం. తమిళనాడు టాకీసు సౌందరాజన్‌గారి అమ్మాయి భూమాదేవి కూడా అదే థియేటర్‌కు వచ్చారు. సినిమా హాల్లో నన్ను చూశారావిడ. అప్పటికి సౌందరాజన్‌గారు 'నవ్వితే నవరత్నాలు' అనే సినిమా ప్లాన్ చేశారట. అందులో కథానాయిక పాత్ర కోసం అమాయకంగా కనిపించే అమ్మాయి కావాలని వెతుకుతున్నారట. నేను ఆవిడకి ఇన్నోసెంట్ అమ్మాయిలా కనిపించానో ఏమో.. నా గురించి వాకబు చేశారు. మర్నాడు నేరుగా ఇంటికే వచ్చి మా అమ్మగారిని అడిగారు. అప్పటికి మా నాన్నగారు కోల్‌కతాలో ఉన్నారు. మరి ఆయన అనుమతి తీసుకోవాలి కదా! అసలే మాది సంప్రదాయ కుటుంబం. సినిమాలంటే ఆ రోజుల్లో చాలామంది ఇష్టపడేవారు కాదు. ఇక నటించడమంటే..! సరే, ఏదైతే అదే అయిందని పరిస్థితిని వివరిస్తూ నాన్నగారికి ఒక ఉత్తరం రాశాను. ఆయన దగ్గర్నుంచి వెంటనే సమాధానమొచ్చింది. 'చెడిపోవటమన్నది మనిషి మనసును బట్టి ఉంటుంది. నీ క్యారెక్టర్, విల్‌పవర్ స్ట్రాంగ్ అయితే ఎక్కడున్నా చెడు జరగదు. నువ్వు సినిమాల్లో నటించడానికి నాకైతే ఏమీ అభ్యంతరం లేదు. మిగతాది నీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అంటూ అనుమతిచ్చేశారు. మొదటి సినిమాలోనే ఫుల్‌లెంగ్త్ హీరోయిన్ పాత్ర చేయడం నా అదృష్టం.'చిన్నప్పుడు ఆంధ్ర మహిళాసభ స్కూల్లో ఏదో చిన్న చిన్న కార్యక్రమాల్లో నాటకాల్లో పాల్గొనేదాన్ని. శ్రీకృష్ణతులాభారం నాటకంలో నేను రుక్మిణి, అక్కయ్య (షావుకారు జానకి) సత్యభామ, రుషేంద్రమణిగారి అమ్మాయి శ్రీకృష్ణుడు పాత్రలు వేశాం. అలా స్కూల్లో తప్ప నటనానుభవం బొత్తిగా లేదు. కూచిపూడి నత్యంపై ఆసక్తి ఉండటం వల్ల వేదాంతం జగన్నాథశర్మగారి వద్ద నేర్చుకున్నాను.

"అన్నీ మంచి అవకాశాలే కాదు, తొలి రోజుల్లో నాకో చేదు అనుభవం కూడా ఎదురైంది. అప్పట్లో నాకు టాన్సిల్స్ ఉండేవి. దాంతో గొంతు కొంచెం కీచుగా వినిపించేది. నా స్వరం విన్న దర్శకుడు వి.సుబ్బా రావుగారు 'ఏమిటీ అమ్మాయి గొంతు చాలా కీచుగా ఉంది' అన్నారు. అయితే ఆపరేషన్ అయిన తర్వాత గొంతు బాగా రావడంతో ఆయన తీస్తున్న 'మైరావణ' సినిమాలో నాకు పిలిచి మరీ అవకాశం ఇవ్వడం మర్చిపోలేని అనుభూతి'

"ఎన్టీఆర్, ఎఎన్నార్, కాంతారావు, జగ్గయ్య, హరనాథ్.. ఎంతటి మహానటులండీ. వారందరితోనూ నటించిన నా అదృష్టం ఇంకెంత గొప్పది. ఒకటా.. రెండా. 'సతీ సుకన్య', 'బాల సన్యాసమ్మ కథ', 'తిరుపతమ్మ కథ', 'బందిపోటు', 'అగ్గిపిడుగు', 'లక్షాధికారి', 'ఇలవేల్పు', 'కులగోత్రాలు', 'వద్దంటే పెళ్లి'.. ఒక్క రామారావుగారితోనే 25 సినిమాలు, ఇంకా కాంతారావు, జగ్గయ్య, హరనాథ్, రామకృష్ణ.. ఇలా అందరితో కలిపి 110 సినిమాల దాకా చేశాను. కన్నడంలో 15 చిత్రాల్లో నటించాను. ఎన్నో గుర్తు లేదు కానీ, తమిళంలో అవకాశాలు బాగానే వచ్చాయి. కానీ, అక్కడి పద్ధతులు నాకంతగా నచ్చకపోవడంతో ఎక్కువ సినిమాలు చేయలేదు. మా అక్క జానకి సినిమాల్లోకి వచ్చిన కొద్దినెలలకే నేనూ చిత్ర రంగంలోకి ప్రవేశించాను. అప్పటికే తనకు పెళ్లై కాపురానికి వెళ్లిపోయింది. భానుమతిగారంటే భలే ఇష్టం. ఒకరకంగా నేనావిడ అభిమానిని. ఆవిడ నటించిన 'స్వర్గసీమ' చూసిన తర్వాత 'అలాంటావిడకు చెల్లెలిగా పుడితే ఎంత బాగుండేది' అని ఎప్పుడూ అనుకునేదాన్ని. అలాంటిది ఆ మహానటితో కలిసి నటిస్తానని అప్పట్లో కల్లో కూడా ఊహించలేదు. 'కులగోత్రాలు', 'పుణ్యవతి' సినిమాల్లో భానుమతి గారితో కలిసి నటిస్తున్నప్పుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యాను. ఆ మాటే ఆవిడతో అన్నాను కూడా. చల్లగా నవ్వారావిడ. ఇక సావిత్రి గారైతే నన్ను సొంత చెల్లెల్లా చూసుకునేవారు. ఆవిడనే ఏముంది, అప్పట్లో నటీనటులందరం ఎంతో అభిమానంగా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉండేవాళ్లం. నిజంగా అది స్వర్ణయుగమే.



అలనాటి సహనటీమణులతో కృష్ణకుమారి

మరచిపోలేని అనుభవాలు

షూటింగ్‌లో మరిచిపోలేని అనుభవాలూ ఎదుర య్యాయి. విఠలాచార్య 'బందిపోటు'లో 'వగలరాణివి నీవే' పాట చిత్రీకరణ జరుగుతోంది. రామారావు గారు చెట్టుమీద ఆ పాట పాడుతుంటారు. నేను ఆయన్ని పట్టుకోవడానికి గుర్రం మీద వస్తుంటాను. నాకు గుర్రపు స్వారీ రాదు. విఠలాచార్యగారిచ్చిన ధైర్యంతో గుర్రం ఎక్కాను. అది ఉన్నట్టుండి స్పీడ్‌గా పరుగు లంకించుకుంది. భయంతో దాన్నే గట్టిగా పట్టేసుకున్నాను. ఆయన ముందు చూపుతో సెట్‌కి కొద్దిదూరంలో నాలుగు మగ గుర్రాల్ని నెలబెట్టారు. వాటిని చూడగానే నేనెక్కిన ఆడగుర్రం ఆగిపోయింది. దాంతో నాకు గండం గడిచింది. ఇక 'లక్షాధికారి'లో 'దాచాలంటే దాగదులే, దాగుడు మూతలు సాగవులే' పాట లాస్ట్‌సీన్ చిత్రీకరణ సమయంలో.. నేనూ ఎన్టీఆర్ చేయీ చేయీ కలిపి ఒడ్డునుంచి అలా సముద్రంలోకి కొంచెం దూరం నడుచుకుంటూ వెళ్లే సీన్ అది. మేం అలా వెళుతుండగానే ఒక పెద్ద కెరటం దూసుకొచ్చి ఇద్దర్నీ లోపలికి లాగేసింది. కన్నుమూసి తెరిచేలోపే కొద్దిదూరం సముద్రం లోపలికి వెళ్లిపోయాం. నేనేమో భయంతో నీళ్లు తాగేశాను. అదృష్టమేంటంటే.. అంత జరిగినా ఎన్టీఆర్ నా చేతిని వదల్లేదు. ఎలాగోలా బయటకి లాక్కొచ్చారు. ఇప్పటికీ తల్చుకుంటే భయం వేసే ఆ రెండు సంఘటనల్నీ నా జీవితంలో మర్చిపోలేను.

బాలకృష్ణ సంతాపం

కృష్ణకుమారి మృతి పట్ల నందమూరి బాలకృష్ణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రామారావుగారి సంస్థలో తొలిసారి స్వయంగా నిర్మించిన 'పిచ్చి పుల్లయ్య' (1953)తో సహా దాదాపు పాతిక సినిమాల్లో నాన్నగారి సరసన కథానాయికగా నటించారు. "దేవాంతకుడు, బందిపోటు, ఉమ్మడి కుటుంబం, వరకట్నం" లాంటి సంచలన విజయం సాధించిన చిత్రాల్లోనూ నాన్నగారితో నటించడం విశేషం. అటువంటి మేటి నటీమణి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఆమె కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని కోరుకొంటున్నా... అని ఆయన పేర్కొన్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఛాంబర్ ప్రతినిధులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

తీరని లోటు : మోహన్‌బాబు

"నేను కృష్ణకుమారిగారితో కలిసి నటించకపోయినా ఆమెతోపాటు మాత్రమే కాక ఆమె కుటుంబంతోనూ మంచి అనుబంధం ఉంది. అన్నగారు ఎన్టీయార్‌తో కలిసి ఆమె ఎక్కువ సినిమా చేయడం వల్ల ఆవిడతో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆమె మరణం చిత్రపరిశ్రమకు తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ఆ శిరిడీ సాయినాధుని దీవెనలు ఉండాలని కోరుకొంటున్నాను.

'ఇట్లు... అంజలి' ఫస్టులుక్

కార్తికేయ, హిమాన్సీ, శభాంగి పంతే జంటగా నటిస్తోన్న చిత్రం 'ఇట్లు ...అంజలి'. వొమా ప్రొడక్షన్స్ పతాకంపై నవీన్ మన్నేల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్టులుక్‌ను బుధవారం సారథి స్టూడియోలో సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు ఆవిష్కరించారు. అనంతరం చిత్ర దర్శక, నిర్మాత నవీన్ మన్నేల మాట్లాడుతూ, లవ్‌లెటర్ బ్యాక్ డ్రాప్‌లో కథ సాగుతుంది. చక్కని ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్. ప్రతీ సన్నివేశాన్ని నేచురల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు సరికొత్త అనుభూతి కల్గుతుంది. మంచి సాహిత్యం దానికి తగ్గ చక్కని ట్యూన్స్ చక్కగా కుదిరాయి. సినిమా విజయం, సాధించి అందరికీ మంచి పేరు రావాలి' అని అన్నారు.

హీరో కార్తికేయ మాట్లాడుతూ, ఓ అమ్మాయి ప్రేమలేఖ చుట్టూ కథ తిరుగుతుంది. పోస్టర్ కొంచెం మాస్‌లుక్‌లో ఉన్నా సినిమా అంతా క్లాస్‌గా ఉంది. కథనం ఆసక్తికరంగా సాగుతుంది. మాటలు, పాటలు హైలైట్‌గా ఉంటాయి. తెలుగు ప్రేక్షకులందరికీ నచ్చే సినిమా అవుతుందని అన్నారు. హీరోయిన్ హిమాన్సీ మాట్లాడుతూ, వైవిధ్యం ఉన్న ప్రేమకథా చిత్రమిది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది. ఇలాంటి చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శక, హీరోలకు క తజ్ఞతలు తెలిపారు. సంగీత దర్శకుడు కార్తీక్ కొడగండ్ల మాట్లాడుతూ, కథకు తగ్గట్టు చక్కని పాటలు కుదిరాయి. పాటల కంపోజింగ్ మొత్తం పూర్తయింది. త్వరలోనే టీజర్, ట్రైలర్, పాటలు విడుదల చేస్తామని అన్నారు.



హిమాన్సీ, కార్తికేయ, శభాంగి పంతే

ప్రభాస్ విని ఎలాగైనా చేయాలన్నారు : అశోక్

'పిల్ల జమిందార్'తో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న అశోక్... ఆ తర్వాత 2012లో 'సుకుమారుడు' చేశాడు. ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. అయినా తన ప్రతిభపై నమ్మకంతో అప్పుడే రాసుకున్న 'భాగమతి' కథను యువి క్రియేషన్స్ అధినేతలకు చెప్పడంతో సెట్‌పైకి ఎక్కింది. అయితే ఈ కథ కోసం అనుష్కనే అనుకున్నారు. బాహుబలికి ముందే ఈ కథను చెప్పినా తను కమిట్‌మెంటు వల్ల ఆమె కోసం ఆగి చేయాల్సివచ్చింది. అందుకే ఇంత కాలం పట్టిందని... దర్శకుడు అశోక్ తెలియజేశారు. ఈనెల 26న విడుదల కానున్న చిత్రం గురించి ఆయన మాట్లాడారు.

- సహజంగా హారర్ సినిమా అంటే భయం కల్గించే చిత్రమని అర్థం. దాన్ని మనవాళ్లంతా దెయ్యం చిత్రంగా మార్చేశారు. ఇది హార్రర్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం. ఇప్పటికే పెద్ద అంచనాలు క్రియేట్ చేసింది.
- 2012లో 'సుకుమారుడు' సినిమా ఫైనల్ స్టేజ్‌లో ఉన్నప్పుడే యువి. క్రియేషన్స్‌కి ఈ కథ చెప్పాను. వాళ్ళతో ఐడియా ఇలా షేర్ చేశానో లేదో, ఆ స్టోరీని వాళ్ళు ప్రభాస్‌కి చెప్పమన్నారు. ప్రభాస్ వినగానే ఇంప్రెస్ అయి పోయారు. ఈ సినిమాని ఎలాగైనా ముందుకు తీసుకు వెళ్లాలని చెప్పారు. అలా వెండితెరకు ఎక్కింది.
- రుద్రమదేవి సినిమా తరవాత ఇమ్మీడియట్ 'భాగమతి' సెట్స్ పైకి రావాలి. కానీ రుద్రమదేవి లేట్ అయ్యేసరికి, అటు అనుష్కకు బాహుబలి డేట్స్ దగ్గర పడటంతో కుదరలేదు. లక్కీగా ఆ టైమ్ నాకు ప్రీ ప్రొడక్షన్‌పై ఫోకస్ చేయడానికి పనికొచ్చింది. ముఖ్యంగా సినిమాలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ భాగమతి బంగ్లా. సినిమా 70% ఆ బంగళాలోనే ఉంటుంది.
- భాగమతి అనే పేరు హైదరాబాద్‌కి సంబంధించింది కాదు. భాగమతి నది ఉంది. మహా రాష్ట్రలో చాలా ఫేమస్. పాత రాజ్యవ్యవస్థలో చాలామంది రాణుల పేరు భాగమతి అని ఉంది. నేపాల్‌లో పెద్ద రివర్ ఉంది ఈ పేరు మీద. తరతరాలుగా భాగమతి అనే పేరుతో మనకు రిలేషన్ ఉంది.
- బాహుబలి లాంటి సినిమా తరవాత అనుష్కతో ఈ సినిమా చేయడం విధి అనుకుంటా. అందరికీ ఉత్సుకత ఉంది, దేవసేన తరవాత ఈ సినిమాలో భాగమతిలో ఎలా కనిపించబోతుంది అని. అలా సినిమా లేటయినా నాకు మంచే జరిగిందనే చెప్పాలి.
- సినిమా చాలా లార్జ్ స్కేల్‌లో తీయడం జరిగింది. సెట్ దగ్గర నుండి, రోప్ వర్క్, గ్రాఫిక్స్ వరకు దానికి తోడు 4 టెక్నాలజీ వాడాం. టైం టేకింగ్ అన్న క్లారిటీ బిగినింగ్ నుండే ఉంది. కాకపోతే పండక్కి రిలీజ్ అనుకున్నాం కుదరలేదు. అందుకే ఇప్పుడు వస్తున్నాం.
- ట్రైలర్‌లో చూసినట్లు ఓ చేయి పైకెత్తి మేకు కొట్టుకున్నట్లుగా వుండే ఆ ఒక్క షాట్ కోసం 2 రోజులు తను అలా ఆ చేయి పైకి పెట్టుకునే ఉండాలి. అదో రకం పనిష్మెంట్. అంతా అయ్యాక మేము షాట్ అద్భుతంగా వచ్చిందని ఓ వైపు హ్యాప్పీగా ఫీల్ అవుతూనే, అనుష్కని ఎంతలా ఇబ్బంది పెట్టాం అనిపించింది. అయినా తనేం ఫీల్‌కాలేదు. పాత్రకోసం ఆమె పరితపించారనే చెప్పాలి.



దర్శకుడు అశోక్

11 ప్రజాశక్తి విజయవాడ గురువారం 25 జనవరి 2018

www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



ఈ రోజుల్లో ఏదైనా ఒక నాటకం ఆడాలన్నా, వేదిక కల్పించాలన్నా.. అనేక కష్టనష్టాలు ఎదుర్కోవాలి. ఆర్థిక అంశాలు ఎలాగున్నాగానీ.. నిర్వహణ బాధ్యతల విషయాల్లో తలమునకలైతేగానీ.. ఆయా నాటకాలు ప్రజల ముందుకు తీసుకొచ్చే పరిస్థితులు లేవు. ఎందుకంటే నాటకాన్ని పోషించే వాణిజ్యసంపద, వనరులు మనకు అంతగా లేవు. అలాంటిది.. పదేళ్ళకుపైబడి జాతీయస్థాయిలో ఇతర భాషా నాటకాలను సైతం తెలుగువేదికపై ప్రదర్శించేందుకు వ్యక్తిగా, శక్తిగా తన వంతు వారధి కడుతుతోంది 'అభినయ నేషనల్ థియేటర్'. దీనికి కర్త, కర్మ, క్రియ ఒకే ఒక్కడు. అతడే అభినయ శ్రీనివాస్. నటనపై ఆసక్తితో సినిమాల్లోకెళ్ళి.. ఆనక నాటకంపై అనురక్తితో అవన్నీ మానుకుని.. కేవలం తెలుగు నాటక ప్రయోజనమే లక్ష్యంగా నాటక రంగానికి సేవలందింస్తున్న శ్రీనివాస్... అలియాస్ గద్దే శ్రీనివాస్ ముప్పయ్యేళ్ళ నాటక రంగ విశేషాలు ఆయన మాటల్లోనే ..





తెలుగు నాటకపు అభినయ వేదిక

పుట్టింది గుంటూరు జిల్లా, పొనుగుపాడు గ్రామం. మా ఊరిలో స్వాతంత్ర్యం రాకముందు నుంచే అంటే 1930 నుంచే నాటక సమాజాలు ఉండేవి. మా ఊరికి నాటకం కొత్తకాదు. ఎన్నో ఏళ్ళుగా పరిషత్ నాటకాలు, నాటకోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. చిన్నప్పటి నుంచీ ఆ ప్రభావం నాపై పడింది. నాటకం గురించి విన్నది, తెలుసుకున్నది, నేర్చుకున్నది మా ఊరిలోనే.

ఆరోజుల్లోనే ప్రయోగాలు

నాకు పదేళ్ళ వయసున్నప్పుడు మా ఊర్లో 'బ్రహ్మంగారి జీవితచరిత్ర' అనే నాటకం ప్రదర్శించారు. ఇక్కడో విషయం చెప్పాలి. తెలుగునాట.. ప్రయోగాత్మక నాటకాలు అనేవి ఆరోజుల్లోనే ఉండేవి. బ్రహ్మంగారి నాటకంలో కక్కడు అనే పాత్ర ఊళ్ళోంచి నడుచుకుంటూ డప్పు కొట్టుకుంటూ.. స్టేజ్ మీదకు వచ్చేది. అలాగే పీర్‌సాయిబు అనే పాత్ర కూడా జనాల్లోంచి లాంతరు పట్టుకుని సన్నివేశానికి తగ్గట్టుగా వేదికపైకి వచ్చేది. అలాంటి విషయాలన్నీ నన్ను చాలా ఆకట్టుకునేవి. నాటకం చూసిన మర్నాడు.. ఆ నాటకంలోని సన్నివేశాలన్నీ బుర్రలో గిరగిరా తిరిగేవి. నాటకంలోని పాత్రల్ని ఇంట్లోవాళ్ళ ముందు చేసి చూపించేవాడ్ని. అది ఆశ్చర్యంగా అనిపించి, చేయమని ప్రోత్సహించేవారు. ఇలా ఊహ తెలిసిన వయసు నుంచి నాటకాలపై మొదలైన ఆసక్తి.. క్రమేణా పెరుగుతూ వచ్చింది.

నటునిగా.. ప్రయాణం

నటునిగా.. నాటకంతో నా ప్రయాణం మొదలై ముప్పయ్యేళ్ళు పూర్తవుతోంది. నేను తొలిసారిగా వేషం కట్టింది కూడా మా సొంతూరు పొనుగుపాడులోనే. 1989లో మా ఊళ్ళోని కుర్రాళ్ళమంతా.. పరిషత్ నాటకం ఏదైనా వేయాలని అనుకున్నాం. వెంకటేశ్వర్రావుగారని.. సీనియర్ ఆర్టిస్టు ఒకాయన ఉండేవారు. ఆయన నన్ను ఒక క్యారెక్టర్‌కి ఎంపిక చేశారు. ఎంపిక చేస్తే చేశారుగానీ.. రిహార్సల్స్ చేయడానికి పెద్దగా ఆసక్తి చూపించేవాడ్నికాదు. వెళ్ళి చేసినప్పుడు మాత్రం.. మిగతా ఆర్టిస్టులు నన్ను..చాలా బాగా చేస్తున్నావని అనేవారు. అలా.. తొలిసారిగా 'గాలివాన' అనే నాటకంలో హాస్యపాత్ర చేశాను. ఊళ్ళో ఆ నాటకం చూసిన జనాలంతా.. ఆ తర్వాత నుంచి నన్ను ప్రత్యేకంగా చూడ్డం మొదలెట్టారు. ఫలానా నాటకంలో ఆ పాత్ర వేసింది.. ఈకుర్రాడే కదా.. అని ఆసక్తిగా చెప్పుకునేవారు. అది నాకెంతో గర్వంగా ఉండేది. అలా.. అక్కడ్నుంచి వేషం వేయడంలో కలిగే ఆనందం ఏమిటో తెలిశాక.. నటన పట్ల మరింత ఆసక్తి పెరిగింది. నేను హీరోగా చేసిన 'మర్రి విత్తనం' అనే నాటకం అయితే దేశవ్యాప్తంగా చాలాచోట్ల ప్రదర్శించాం. ఈ క్రమంలో ఊళ్ళోని పెద్దలు, బంధువులు నన్ను సినిమాల్లో చేయమని ప్రోత్సహించారు. కోడెల శివప్రసాద్ వంటి రాజకీయ పెద్దలకీ నా గురించి చెప్పి, నన్ను పరిచయం చేశారు. అలా సినిమాల్లో చేయాలనే ప్రయత్నం నాలో మొదలైంది. అదే సమయంలో మా బంధువు ఒకరు సినిమారంగంలో పనిచేస్తున్నారు. ఆయన ద్వారా తొలిసారిగా "వన్ బై టూ" అనే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అక్కడ్నుంచి సుమారు పదిపన్నెండు సినిమాలు చేశాను. ఇతర భాషల్లోనూ నటించాను. చేసిన సినిమాలు తక్కువైనా.. నుంచుని వెళ్ళిపోయే పాత్రలు చేయలేదు. డైలాగ్‌లు ఉండి, ప్రాధన్యతగల పాత్రలే చేశాను.

నటశిక్షణలో

నిజానికి 1993 నుంచే సినిమాలు చేయడం మొదలైంది. నటుడిగా రాణించాలంటే నటశిక్షణ కూడా చాలా అవసరం అని ఎవరో అనడంతో 1996లో దీక్షితులుగారి నిర్వహణలో నటశిక్షణా శిబిరంలో చేరి.. శిక్షణ తీసుకున్నా. దేవదాసు కనకాల, లక్ష్మీదేవిగారు వంటి పెద్దలు మాకు శిక్షణ ఇచ్చేవారు. ఆ సమయంలోనే దేవదాసు కనకాలగారితో.. ఏదో విషయంపై మాట్లాడుతుండగా "నాటకరంగం కోసం ఎవ్వరూ చేయనిది నేను ఏదో ఒకటి చేస్తాను సార్.." అని ఆవేశంగా అన్నాను. "నీలా చాలామంది అన్నవారే. తర్వాత నాటకం వదిలేసి.. సినిమాల్లోకెళ్ళి పోయారంతా" అని నవ్వారు. కానీ, ఎందుకనో.. అప్పుడే.. తెలుగు నాటకరంగానికి ఏదో చెయ్యాలనే కోరికో, తపనోగానీ బలంగా మనసులో నాటుకుపోయింది.

నాటకం కోసం 'అభినయ'

నటుడిగా.. సినిమా, నాటకాలు చేస్తున్న క్రమంలో.. ఇతర భాషలకు చెందిన నాటకాలు చూస్తుండేవాడిని. ఆ క్రమంలో అడబాల అని.. సీనియర్ మేకప్ ఆర్టిస్టు ఉండేవారు. ఆయనతో నాటకం పట్ల నాకున్న అభిప్రాయాలు. పంచుకునేవాడిని. ప్రాంతీయ, ప్రాంతీయేతర నాటకాలు చూసినప్పుడు అందులోని మంచి, చెడ్డలు విశ్లేషించేవాడిని. అది చూసి.. ఇలాంటి విషయాలన్నీ రాసి.. ఏదైనా పత్రికకు పంపించు.. అందరికీ చేరుతుంది అనేవారాయన. అయితే, పత్రికల్లో రాయాలంటే.. తెలిసినవారు ఉండాలి. అలాకాకుండా.. నాటకకళ గురించి పత్రిక పెడితే.. అలాంటి విషయాలెన్నో రాయవచ్చు. కళాకారులకీ మేలు జరుగుతుంది. అనే ఆలోచన వచ్చింది. అలా 2004 జనవరి నెలలో 'అభినయ' పేరుతో రంగస్థల మాసపత్రిక ప్రారంభించా. పత్రికను కొనరని తెలుసు. లాభాలు రావనీ తెలుసు. కానీ నాటకరంగానికి ప్రయోజనం చేకూరాలి. అది కళాకారులకు చేరాలనే ఉద్దేశ్యంతో పత్రికను ఉచితంగా పంచిపెడుతూ వచ్చాను. గతంలో జరిగిన నంది నాటకోత్సవాల్లో ఏయే నాటకాలు ప్రదర్శించారనే వివరాలు, వర్తమాన నాటకరంగ విశేషాలు, విమర్శలు, సమీక్షలు, పరిషత్ నాటకోత్సవాల సమాచారం, కళాకారుల పరిచయం వంటివి 'అభినయ'లో ఇస్తూ ఉండటంతో మెల్లగా పత్రికకు ఆదరణ పెరిగింది. గండవరపు సుబ్బరామిరెడ్డి వంటి నాటకరంగ ప్రముఖులు నా పత్రికలో నాటకాలపై సమీక్షలు రాసేవారు. ఆయా సమీక్షలు నాటకరంగ ప్రముఖుల్నీ ఆలోచింపజేసేలా చేసేవి. కాలగమనంలో గద్దె శ్రీనివాస్ అనే నా పేరు అభినయ శ్రీనివాస్‌గా స్థిరపడిపోయింది.

అభినయ నాటకపరిషత్

నాటకరంగానికి ప్రయోజనం కలిగేలా.. నా వంతు ఏదోఒకటి చేయాలని.. ఇతర వ్యాపకాలన్నీ వదిలేసి, కేవలం 'అభినయ' పత్రికనే నడుపుతున్న తరుణంలో.. ఇంకా ఏదైనా చెయ్యాలనే తపన మొదలైంది. దాంతో నేను పుట్టి, పెరిగిన ఊర్లోనే 'అభినయ నాటక పరిషత్' పేరుతో నాటకోత్సవాలు ప్రారంభించాను. కొంతమంది స్థానిక స్నేహితులు, స్వశక్తి, సొంత ఖర్చులతోనే 2006లో రంగస్థల, సినీనటులు మిక్కిలినేని చేతుల మీదుగా సొంత ఊళ్ళో నాటక పరిషత్ మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా విజయవంతంగా ఏటా పొనుగుపాడులో 'అభినయ పరిషత్' పోటీలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఒకే నాటకం.. ఐదు భాషలలో

ప్రస్తుతం సాంస్కృతికశాఖ అధికారిగా ఉన్న ప్రముఖ నాటకరంగ రచయిత డి.విజయభాస్కర్‌గారు రాసిన 'గాంధీ జయంతి' అనే నాటకాన్ని 2007 సంవత్సరంలో ఐదు భాషల్లో రవీంద్రభారతి వేదికగా 'అభినయ' నిర్వహణలో ప్రదర్శించాం. ఒకే నాటకాన్ని ఐదు భాషల్లో ఒకే వేదికపై చేయడం అనేది ఇప్పటిదాకా జరగలేదు. వీటితోపాటు విజయనగరంలో నటరత్న నాటకపరిషత్ పేరుతో స్నేహితుడితో కలిసి నాటకోత్సవాలు జరుపుతున్నాం. ఇప్పటిదాక అన్నీ కలుపుకుని దేశవ్యాప్తంగా 43 థియేటర్ ఫెస్టివల్స్ నిర్వహించాం. ఈ వేదికలపై మూడువందలకుపైగా నాటకాలు ప్రదర్శించాం. దక్షిణభారతదేశంలోనే ఒకే బ్యానర్‌పై ఇన్ని నాటకప్రదర్శనలు జరగలేదు. ఒకరకంగా ఇది రికార్డ్. ఇలా ముప్పయ్యేళ్ళ నాటకరంగ ప్రయాణంలో నాటకం తప్ప.. నా జీవితంలో మరో అంశం లేదు. రాలేదు కూడా..!

సంభాషణ : గంగాధర్ వీర్ల

జాతీయ నాటకోత్సవాలు ఇలా

నటుడిగా జాతీయస్థాయి నాటకాలెన్నో చూశాను. ఆయా నాటకాల్లోని ప్రత్యేకతలు, ఆధునికత ఇవన్నీ తెలుగునాటక ఉద్దీపనకు అవసరం. అలా జరగాలంటే.. ఆయా నాటకాలను మన సొంతగడ్డపై చూడగలగాలి. అందుకే ఒక వేదిక కావాలి.. అని ఆలోచన వచ్చింది. ఫలితంగా 'అభినయ' నేషనల్ థియేటర్ ఫెస్టివల్‌కు భీజం పడింది. 2006లోనే రవీంద్రభారతి వేదికగా ఫెస్టివల్ ఆరంభమైంది. దీనివల్ల ఆయా భాషల్లోని నాటకాలపై అవగాహనతోపాటు.. అందులో స్వీకరించదగ్గ వైవిధ్యం, సాంకేతిక అంశాలను పరిశీలించడంతో సాంస్కృతికపరమైన సంబంధాలూ బలపడతాయి. ఈ నేషనల్ ఫెస్టివల్‌లో మణిపురి నాటకకళాకారులు ప్రదర్శించిన ఓ నాటకం చూసి, ప్రఖ్యాత నాటకకళాకారుడు కళావాణి ప్రసాదమూర్తిగారు చెమ్మగిల్లిన కళ్ళతో 'నా జీవితం ధన్యమైంది శ్రీనివాస్!' అంటూ ఆయన నన్ను అభినందించడం ఇప్పటికీ మర్చిపోలేను. అలా ఆరోజు నుంచి నేటిదాకా.. జాతీయ స్థాయిలో 'అభినయ' నాటకోత్సవాలు అటు హైదరాబాద్ ఇటు ఏడేళ్ళుగా తిరుపతిలో నిరవధికంగా నిర్వహిస్తున్నాం.

- అభినయ శ్రీనివాస్
ఫోన్: 9391111622

గిరిజన యువతుల థింసా నృత్యం



నేస్తరికానికి శ్రీకారం కందికొత్తలు


ప్రకృతిని ఆదాయవనరుగా భావిస్తూ విధ్వంసం చేసి.. లాభాలు పిండుకోవడం పెట్టుబడిదారుల అలవాటైతే- ప్రకృతిని ప్రాణప్రదంగా భావిస్తూ దానిలో మమేకమై జీవించటం ఆదివాసీల సాంప్రదాయం. కందికొత్తల పండగ అందుకొక ఉదాహరణ. తూరుపు కనుమల్లో మారుమూల అడవి గ్రామాల్లో కంది పంటని తినడానికి ముందు.. అడవికి నీరాజనాలు అర్పించే ఆదిమ సాంస్కృతిక సంప్రదాయమీ కందికొత్తలు. 'కొత్తగలవడం' అంటే కొత్తపంట గింజల్ని మొదటిసారిగా తినడం అని అర్థం. అదీ పూజ చేశాక, ప్రసాదం తిన్న తరువాతనే. కందికొత్తలు చేయడం అంటే కొత్తగలవడం అని అర్థం. కొత్తగలవకుండా ఏ పంటనీ ముట్టుకోరని అర్థం. ప్రతి పంటకూ కొత్తల సందడి ఉంటుంది. కానీ కొత్తల్లో కందికొత్తలు సందర్భమూ, సందడీ ప్రత్యేకం.

కందికొత్తల పండగలో ప్రధాన దేవత గొడ్డలమ్మ. గొడ్డలి గిరిజనుల ప్రధాన పనిముట్టు. అయితే గొడ్డలిని పూజించడం దసరాలాగ ఆయుధపూజ కాదు.. ఇది శ్రామికపూజ. అందుకే గొడ్డలిని దేవతగా భావించి పూజించడం వారి సాంప్రదాయం. మరోలా చెప్పాలంటే గొడ్డలి శ్రమకి గుర్తు. దాన్ని పసుపునీళ్ళ స్నానమాడించి, కుంకుమబొట్టు పెట్టి, బంతిపూల దండలు గట్టి, కొత్త కందికాయల హారమేసి, బలిచ్చిన కోడితో పూజించి, పండగ చేయడం... ఒక సాంప్రదాయంగా కొనసాగించడం.. తమ విధిగా విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని గిరిజనులు భావిస్తుంటారు. ఇది తమ హక్కుగా వారు ఆచరిస్తారు.

ప్రతి ఊరికీ ఒక గొడ్డలమ్మ ఉంటుంది. ఊరి మొత్తానికీ ఆమె దేవత. 'శతర' అనే పేరుతో మరో దేవత కూడా ఉంటుంది. పొడుగాటి కొత్త వెదురు కర్రకి నెమలీకలు దట్టంగా కట్టి, చివర కొత్త తెల్లగుడ్డని వెండితీగతో బిగించి ఉంచిన ఒక ప్రత్యేక ఆకర్షణ ఈ శతర. ఇది గ్రామ దేవత కాదు.. కుటుంబ దేవత. ఏ కుటుంబం మొక్కుకుంటే ఆ కుటుంబం ఈ శతరని నిర్మించి, కొత్తల పండగలో ఊరేగించి, దీవెనలు అందుకుంటుంది. ఈ నిర్మాణంలో వెదురుకర్ర అడవికి గుర్తు. నెమలీకలు అడవిలో జంతు సముదాయానికి సంకేతం. వెండితీగతో బిగించిన తెల్లగుడ్డ ఆ ఏడాది ఆ కుటుంబానికి వచ్చిన ఆదాయం లేదా సంపద.

ఒక గ్రామానికి గొడ్డలమ్మ ఒకటి. శతరలు ఆ ఏడాది ఎన్ని కుటుంబాలు మొక్కుకుంటే అన్ని. ఈ కొత్తలు ఏడాదికి ఒకసారి డిసెంబరు మాసాంతంలో మూడు నుంచి ఐదు రోజుల వరకూ జరుపుకుంటారు. ఈ రోజుల్లో ఊళ్లోని ఝాకరమ్మ వద్ద గొడ్డలమ్మని పూజచేసి, ఇంటింటికీ తీసుకొని వస్తాడు ఎజ్జోడు. ఇలా వచ్చినపుడు తుడుము, డప్పుల దరువులతో ... సన్నాయి నాదాల్తో... టిల్లకాయ, గజ్జెల లయతో... వీధుల్లోంచి ఊరేగింపుగా వచ్చి, ఊళ్లోని అందరిళ్ళ ముందుకొచ్చి.. దీవెనలిచ్చి వెళ్తాడు ఎజ్జోడు. గొడ్డలమ్మ ఊరు దాటి ఇంకో ఊరుకెళ్తే దాన్ని 'దుర్ల'గా వ్యవహరిస్తారు. దుర్ల కెళ్లినప్పుడు ఊరు ఊరంతా కదిలి వెళ్తుంది. పొన్నూరు (వేరే ఊరు వాళ్ళు) గొడ్డలమ్మ ఊరిలోకొస్తే అది నేస్తరికం. డప్పులమోత, థింసా ఆడడంలో పోటీ ఉంటుంది. ఒక ఊరి డప్పుల మోతగాళ్ళు వాయిద్యాలెంతలా ఆపకుండా మోగిస్తారో.. ఆడపిల్లలు దరువులకు అనుగుణంగా ఎంతసేపు థింసా ఆడగలరో పోటీ! వచ్చిన అతిథులకు ఆతిథ్యమివ్వడం ఆ ఊరి బాధ్యత. నేస్తరికం పేరుతో ఊళ్ళ మధ్య స్నేహం, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది.... ఇదీ తూర్పు కనుమల్లోని గిరిజన సాంప్రదాయం.


వెజ్జోడు



ఇప్పుడిప్పుడే కనుమరుగవడానికి సిద్ధంగా ఉందీ సాంప్రదాయం. దానికి కారణాలనేకం. వేరే మతాల ప్రభావం, ఆధునిక పోకడలూ.... వస్తు వినిమయ సంస్కృతి... ప్రపంచీకరణ.... ఇలా అన్నీ! కారణాలేవైనా.... సాంప్రదాయం కనుమరుగవడం శోచనీయం. మార్పు సహజమే కానీ అది క్రమానుగతమై మంచిదిగా పరిణమిస్తే బాగుంటుంది. కానీ అలా జరగడం లేదు. ఇప్పుడు జరుగుతున్న మార్పు ఒక కొనసాగుతున్న జీవన విధానానికి అడ్డుకట్టగా మారిపోతూ వస్తోంది.

సేకరణ : బెందాళం క్రిష్ణారావు

సెమీస్‌లో హలెప్ x కెర్బర్



హలెప్ (రొమేనియా)



కెర్బర్(జర్మనీ)



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి స్విట్జర్లాండ్ స్టార్, నెంబర్-2 రోజర్ ఫెదరర్ ప్రవేశించాడు. బుధవారం చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19వ సీడ్ బెర్డిచ్‌పై 7-6, 6-3, 6-4తో సునాయాస విజయాన్ని సాధించాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 14వసారి సెమీస్‌లోకి చేరిన ఆటగాడిగా ఫెదరర్ గుర్తిం పుపొందాడు. మరో మ్యాచ్‌లో జకోవిచ్‌ను ఓడించిన దక్షిణకొరియాకు చెందిన హుయాన్ చంగ్ 6-4, 7-6(7-5), 6-3 వరుస సెట్ల తేడాతో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు శాండ్రెన్‌ను ఓడించి ఫెదరర్‌తో అమీతుమీకి సిద్ధమయ్యాడు. సీడెడ్ క్రీడాకారులైన సిలిక్, ఫెదరర్‌లు అన్‌సీడెడ్ క్రీడాకారులతో సెమీఫైనల్లో తలపడి గెలుపొందితే... ఫైనల్లో సిలిక్, ఫెదరర్‌లు టైటిల్‌పోరుకై తలపడే అవకాశముంది.



ఫెదరర్

మహిళల విభాగంలో నంబర్ వన్ సీడ్ హలెప్(రొమేనియా) 6-3, 6-2 సెట్ల తేడాతో 6వ సీడ్ ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. మరో క్వార్టర్‌ఫైనల్లో 21వ సీడ్ కెర్బర్(జర్మనీ) 6-1, 6-2 సెట్ల తేడాతో కయాన్(అమెరికా)పై సునాయాస విజయాలతో గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

సెమీస్‌కు బొప్పన్న జోడీ...

ఇండో-హంగరీ జోడీ రోహన్ బొప్పన్న-బార్బోస్ జోడీ 6-4, 7-6(7-5)తో కొలంబియా-అమెరికా జోడీ కుగర్-కింగ్‌ల జోడీపై మిక్సిడ్ డబుల్స్‌లో గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్స్

మహిళలు...

హలెప్(1) × కెర్బర్(21)
కరోలినా వాజ్నొంకీ(2) × ఎలెస్ మెర్టెన్స్

పురుషులు...

సిలిక్ (6) × ఎడ్మండ్
ఫెదరర్ (2) × హుయాన్ చంగ్

హైదరాబాద్ నగరంలోని కొంపల్లి సరస్వతి క్రికెట్ మైదానంలో గురువారం నుండి మొత్తం 16 టీమ్‌లు 31 మ్యాచ్‌లలో 45 రోజులపాటు ఈ ట్రోఫీకై పోటీపడనున్నాయి.



'టివిఎస్ సంపూర్ణ భరత్ షా క్రికెట్ ట్రోఫీ'ని అవిష్కరిస్తున్న టాలీవుడ్ హీరో శ్రీకాంత్

మహిళల టీ20 ప్రపంచకప్‌కు విండీస్ ఆతిథ్యం

దుబాయ్: ఈ ఏడాది మహిళల టీ20 ప్రపంచకప్‌కు వెస్టిండీస్ ఆతిథ్యమివ్వనున్నది. బుధవారం అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) నవంబర్ 9-24 తేదీలలో ఈ పోటీలు జరగనున్నట్లు ధృవీకరించింది. టీ20 టోర్నీ మ్యాచ్‌లకు విండీస్‌లోని ఆంటిగ్వా, గయానా, సెయింట్ లూయిస్ ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నీలో వెస్టిండీస్‌తో పాటు ప్రపంచ విజేత ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్, పాకిస్థాన్, సౌతాఫ్రికా, శ్రీలంక ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన రెండుస్థానాల కోసం బంగ్లాదేశ్, హాలండ్, ఐర్లాండ్, పపువా న్యూగినియా, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, ఉగాండ, యూఏఈ పోటీపడనున్నాయి.

మూడో టెస్ట్‌లోనూ టీమిండియా బ్యాటింగ్ తీరు మారలేదు. పుజారా(50), కోహ్లి(54), భువనేశ్వర్ కుమార్ (30) మినహా మిగతా బ్యాట్స్‌మెన్‌లు ఎవ్వరూ రెండంకెల స్కోర్ సాధించలేకపోయారు. తొలిరోజు టీమిండియాపై ఆతిథ్య దేశం పైచేయి సాధించింది. ముగ్గురు బ్యాట్‌మెన్ డకౌట్ అవ్వగా... మరో నలుగురు కలిసి చేసింది 27 పరుగులు మాత్రమే...

దక్షిణాఫ్రికాతో మూడో టెస్ట్

భారత్-187, దక్షిణాఫ్రికా - 6/1



84 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించిన కోహ్లి, పుజారా

తీరు మారలేదు...

జోహాన్స్‌బర్గ్ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులోనూ టీమిండియా బ్యాటింగ్ తీరు ఏమాత్రం మారలేదు. మన క్రీడాకారులు వ్యక్తిగతంగా విజయ్(8), రాహుల్(0), రహానే(9), పార్థివ్ పాటిల్(2), పాండ్యా(0), షమి(8), ఇషాంత్(0)... సాధించిన పరుగులివే... ఛటేశ్వర పుజారా(50), కోహ్లి(54), భువనేశ్వర్ కుమార్ (30) మినహా మరెవ్వరూ రాణించలేకపోయారు.

బుధవారం ఉదయం టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన టీమిండియా 187 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు ఒక వికెట్ నష్టానికి ఆరు పరుగులు చేసింది. తొలిరోజు ఆట నిలిపివేసే సమయానికి ఎల్గర్ 4, రబడ 6 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. భారతజట్టు తొలిసారి ఒక్క స్పిన్నర్‌కూడా లేకుండా బరిలోకి దిగింది. మూడో టెస్ట్ జట్టు కూర్పులోనూ రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. రోహిత్ శర్మ స్థానంలో అజింక్య రహానే... అశ్విన్ స్థానంలో భువనేశ్వర్ కుమార్‌కు చోటు కల్పించారు.

దక్షిణాఫ్రికా జట్టు కూడా స్పినర్ లేకుండానే బరిలోకి దిగింది. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ స్థానంలో ఆల్‌రౌండర్ ఆండిలె ఫెహ్లుక్వాయోను తీసుకున్నట్టు కెప్టెన్ డుప్లెసిస్ వెల్లడించాడు. మొదటి రెండు టెస్టుల్లోనూ సఫారీ టీమ్ గెలిచిన సంగతి తెలిసింది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను క్వీన్‌స్వీప్ చేయాలని ఆతిథ్య జట్టు ఉవ్విళ్లూరుతోంది. చివరి మ్యాచ్‌లోనైనా పరువు నిలుపుకోవాలని టీమిండియా భావిస్తోంది.

దక్షిణాఫ్రికా బౌలర్ల సహనాన్ని పరీక్షించిన పుజారా...

దక్షిణాఫ్రికా బౌలర్ల సహనాన్ని పుజారా పరీక్షించాడు. తొలి పరుగు సాధించడానికి అతడు 54 బంతులను తీసుకున్నాడు. దీంతో ఒక్క పరుగు లేకుండానే అర్ధశతకం సాధించాడంటూ ట్వీట్‌లు టీమిండియాకు వచ్చాయి. రాహుల్ అవుటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చి 3.2 నుంచి 19.5వ ఓవర్ల మధ్య పుజారా 50 బంతులను ఎదుర్కొన్నాడు. కానీ ఒక్క పరుగు కూడా చేయ లేదు. ఆ తర్వాత 21.3వ ఓవర్లో ఎంగిడి వేసిన బంతిని ఎదుర్కొన్న పుజారా ఒక పరుగు తీసి తన పరుగుల ఖాతాను తెరిచాడు.

భారత్ స్కోర్‌బోర్డ్...

మురళీ విజయ్ (సి)డికాక్ (బి) రబడా	8
లోకేష్ రాహుల్ (సి)డికాక్ (బి) ఫిలాండర్	0
ఛటేశ్వర పుజారా (సి)డికాక్ (బి) ఫెహ్లుక్వాయో	50
కోహ్లి (సి) డివిలియర్స్ (బి) లుంగ్డి	54
రహానే (ఎల్‌బి) మోర్కెల్	9
పార్థివ్ పాటిల్ (సి)డికాక్ (బి) మోర్కెల్	2
హార్దిక్ పాండ్యా (సి)డికాక్ (బి) ఫెహ్లుక్వాయో	0
భువనేశ్వర్ కుమార్ (సి)ఫెహ్లుక్వాయో (బి) రబడా	30
మహ్మద్ షమి (సి) రబడా (బి) ఫిలాండర్	8
ఇషాంత్ శర్మ (సి)డుప్లెసిస్ (బి) రబడా	0
బుమ్రా (నాటౌట్)	0
అదనపు పరుగులు	26

మొత్తం (76.4 ఓవర్లలో)187 ఆలౌట్

బౌలింగ్

మోర్కెల్ 17-5-47-2
ఫిలాండర్ 19-10-31-2
రబడా 18.4-6-39-3
లుంగ్డీ 15-7-27-1
ఫెహ్లుక్వాయో 7-1-26-2

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:

ఎల్గర్ (నాటౌట్)	4
మార్కమ్ (సి)పార్థీవ్ (బి) భువనేశ్వర్	2
రబడా (నాటౌట్)	0

మొత్తం (6 ఓవర్లలో వికెట్ నష్టానికి 6 పరుగులు)

బౌలింగ్ :

భువనేశ్వర్ కుమార్ 3-2-3-1 :: బుమ్రా 3-2-3-0

అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌కు పాకిస్తాన్, ఆస్ట్రేలియా

బే ఓవల్ (న్యూజిలాండ్) : అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్లోకి పాకిస్తాన్ జట్టు ప్రవేశించింది. బుధవారం దక్షిణాఫ్రికాతో తలపడిన ఆ జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన పాక్‌జట్టు దక్షిణాఫ్రికా జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. పాక్ బౌలర్లు కట్టడిగా బౌలింగ్ చేయడంతో సఫారీ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 189 పరుగులు మాత్రమే చేసింది. మహ్మద్ మూసా 3, షాహెన్ అఫ్రిది 2 వికెట్లు సాధించారు. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ జట్టు 47.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అలీ జర్యబ్ (74 నాటౌట్)కు లభించింది. మంగళవారం ఇంగ్లండ్‌పై విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే సెమీస్‌కు చేరింది.

నేడు జరిగే మ్యాచ్‌లు : న్యూజిలాండ్ X ఆఫ్ఘనిస్తాన్ (సెమీఫైనల్ బెర్త్‌కోసం)
పప్పున్యూగేనియా X ఐర్లాండ్, కెన్యా X నమీబియా, జింబాబ్వే X శ్రీలంక
(మరో సెమీఫైనల్ బెర్త్‌కోసం టీమిండియా బంగ్లాదేశ్‌తో 26న తలపడనుంది)



తెలంగాణ, తమిళనాడు జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

ఉత్సాహంగా సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

సౌత్‌జోన్ 39వ హ్యాండ్‌బాల్ పోటీలు గుంటూరు జిల్లా తెనాలిలో బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సీనియర్స్ విభాగంలో మహిళలు, పురుషుల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎన్నో టోర్నీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, గోవా, పాండిచ్చేరి జట్లు తలపడుతున్నాయి. మహిళల విభాగంలో తమిళనాడు, కేరళల మధ్య, పురుషుల విభాగంలో తమిళనాడు పాండిచ్చేరి మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. టోర్నీ ప్రారంభ సూచికంగా జాతీయ జెండా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జెండా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జెండాలను ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాప్ మాజీ ఛైర్మన్ మోహన్ ఎగురవేశారు. వైద్యారోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతోపాటు కొద్దిసేపు మ్యాచ్‌లను తిలకించారు. ఏడు రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు

- వారంలో రెండు రోజులు పిఎస్‌కు హాజరుకావాలని షరతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి న్యాయస్థానం బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10వేల నగదు, ఇద్దరు వ్యక్తుల పూచీకత్తు సమర్పించడంతో పాటు వారంలో రెండు సార్లు పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని కోర్టు పేర్కొంది. బెయిల్ పిటిషన్‌పై మంగళవారం ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి బుధవారం తీర్పును వెలువరించారు. ఈ కేసులో ఏ2 నిందితురాలు పార్వతి పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కూడా బుధవారం కోర్టులో వాదనలు సాగాయి. పార్వతికి ముందస్తు బెయిల్‌కు న్యాయమూర్తి అంగీకరించారు. దీంతో ఈకేసులో ఆమె అరెస్టు నుంచి తప్పించుకున్నట్లయ్యింది. గజల్ శ్రీనివాస్ తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ డిసెంబర్ 30న పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కొన్ని వీడియోల్ని కూడా పోలీసులకు అందజేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం జనవరి 2న గజల్ శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నాలుగు దశల్లో డ్వాక్రా రుణమాఫీ

- ప్రజా సంకల్పయాత్రలో జగన్

ప్రజాశక్తి- పెళ్లకూరు/నాయుడుపేట (నెల్లూరు)

తాను అధికారంలోకి వస్తే నాలుగు దశల్లో డ్వాక్రా రుణమాఫీ చేస్తానని వైసిపి నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్ర బుధవారం నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలం సిఎస్‌పేట నుంచి ప్రారంభమై రాజుపాళెం మీదుగా శిరసనం బేడు, పెళ్లకూరు, నాయుడుపేట పట్టణంలో కొనసాగింది. జిల్లాలో రెండో రోజు 14 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. రాజుపాళెం వద్ద బంగారంపేట, మోదుగుల పాళెం ప్రజలు జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడున్న ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. పిల్లల్ని బడికి పంపితే ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని చెప్పారు. అక్కడ నుంచి శిరసనంబేడు చేరుకున్నారు. గ్రామంలో వైసిపి జెండా ఆవిష్కరించారు. కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక కార్మికులు జగన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారి దీక్షలకు జగన్ మద్దతిచ్చారు. అక్కడి నుంచి చావలి చెక్‌పోస్టు వద్దకు చేరుకోగా.. కొంతమంది యువకులు పోస్టర్లతో నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా మన హక్కు-మీతోనే సాధ్యమంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేడజంగం, మొలకజంగం కులస్తులు తమకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పెన్నేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద భోజన విరామం తీసుకున్నారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమైన పాదయాత్ర పెన్నేపల్లి, కానూరు, కానూరురాజుపాళెం మీదుగా సాగింది. పెన్నేపల్లి, తాళ్వాయిపాడు వద్ద జెండా ఎగురవేశారు. మధ్యాహ్నం 3.40కి పెళ్లకూరు మండలంలో పాదయాత్ర ముగిసింది. అనంతరం నాయుడుపేటలోని ఎల్ఎసాగరానికి పాదయాత్ర చేరుకుంది. దారి పొడవునా ప్రజలు నుంచి సమస్యలు తెలుసుకుంటూ నడిచాడు. అన్నీ చోట్లా సాగు, తాగునీరు కొరత ఉందని ప్రజలు జగన్ దృష్టికి తీసుకు వచ్చారు.



నెల్లూరు జిల్లా పెళ్లకూరులో మహిళలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి - వాల్మీకిపురం (చిత్తూరు)

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనంతరం మదనపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆ విద్యార్థిని రాసిన సూసైడ్‌నోట్‌లో ఉండటం గమనార్హం. ఈ సంఘటన చిత్తూరు జిల్లా వాల్మీకిపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తొట్టంబేడు మండలం పిల్లమేడు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, మునెమ్మ దంపతుల కుమార్తె సుమలత (15). వాల్మీకిపురం ఎస్‌సి గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇటీవల సంక్రాంతి సెలవులకు సొంతూరు వెళ్లొచ్చింది. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు పాఠశాలకు వచ్చింది. 22, 23 తేదీల్లో నిర్వహించిన పరీక్షలను సైతం రాయలేదు. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు స్టడీ అవర్స్‌కు వచ్చినట్లు తోటి విద్యార్థులు చెబుతున్నారు. తన ఇంటి నుంచి వచ్చేటపుడే సుమలత వెంట సూపర్ వ్యాస్‌మాల్ ఆయిల్ 33ని తెచ్చుకుని రాత్రి 12.30 గంటల సమయంలో తాగినట్లు సమాచారం. సుమలత వాంతులు చేసుకుంటుండడంతో గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. ఉపాధ్యాయ బృందం హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా విద్యార్థి మృతి చెందింది. విద్యార్థి మృతికి కుటుంబ సమస్యలే కారణంగా సూసైడ్ నోట్‌లో రాసినట్లు సిఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని కేసు విచారణ చేపట్టారు.



మృతి చెందిన విద్యార్థిని సుమలత



జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి

- ఎపిడబ్ల్యూజెఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రూ.100కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షతన బుధవారం విజయవాడలో సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను ప్రధాన కార్యదర్శి జి అంజనేయులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సంక్షేమ నిధి కమిటీని నియమించి ఆపదలో ఉన్న జర్నలిస్టులకు ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులకు రూ.30కోట్లతో సంక్షేమ నిధిని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఫిబ్రవరి నెలాఖరులో ఫెడరేషన్ పదేళ్ల పండుగ జరపాలని నిర్ణయం తీసుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులుతో పాటు అన్ని రాజకీయ పక్షాల నాయకుల్నీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ ఇంటి వసతి కల్పించేందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయించే విధంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లుగా పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి దాడులకు వెనకడుగు వేసేది లేదు

- ఓటు బ్యాంకు రాజకీయాలు చేయం
- అంబేద్కర్, పూలే విధానాలే మార్గదర్శకం
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- తెలంగాణలో ముగిసిన మొదటి విడత పర్యటన



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి దాడులకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు జనసేన దూరంగా ఉంటుందన్నారు. నిర్మాణాత్మకమైన బాధ్యత, విశ్వసనీయత కలిగిన రాజకీయ మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఉడుకు నెత్తురు కలిగిన యువత తమతో కలిసి రావాలన్నారు. బుధవారం ఖమ్మం పట్టణంలోని ఎంబి గార్డెన్స్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మానవత్వంతో కూడిన రాజకీయాలే తమ లక్ష్యమన్నారు. అయితే ప్రస్తుత సామాజిక వ్యవస్థను అర్థం చేసుకోకుండా రాజకీయాల్లో మార్పు తీసుకురాలేమన్నారు. ప్రతి కార్యకర్తా స్థానిక సమస్యల్ని గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరు దాడి చేసినా, విమర్శలు చేసినా స్వీకరిస్తానన్నారు. ఒక గొప్ప లక్ష్యంతో పార్టీని ప్రారంభించానని, దీనికి అందరి సహకారం కావాలని కోరారు. అంబేద్కర్, పూలేల విధానాలే జనసేనకు మార్గదర్శకాలన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య తనను ఎంతగానో బాధించిందని, అసలు రాజకీయాల్లోకి రావడానికి ఇది కూడా ఒక కారణమన్నారు. ఫ్లోరైడ్ సమస్యను పూర్తిగా రూపుమాపేందుకు జనసేన కృషి చేస్తుందన్నారు. అంతకుముందు కొత్తగూడెం నుంచి ఖమ్మంకు బయలుదేరుతూ మీడియాతో మాట్లాడిన పవన్ ప్రజాయాత్రలో భాగంగా అభిమానులను కలవడం కుదరడం లేదని, వారు దయచేసి అర్థం చేసుకోవాలన్నారు. 2009లో కొత్తగూడెంకు వచ్చానని, ఇక్కడి సమస్యలపై తనకు కొంత అవగాహన ఉందని తెలిపారు. కొత్తగూడెం ప్రాంతంలో అపారమైన ఖనిజ సంపద ఉందని, ఇక్కడ మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందన్నారు. మైనరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ ప్రాంతానికి కొత్త పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి దొరుకుందన్నారు. అంతకుముందు కేన్సర్‌తో బాధపడి కోలుకున్న అభిమాని శ్రీజ ప్రజాయాత్రలో భాగంగా కొత్తగూడెం వచ్చిన పవన్‌ను కలిసింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ శ్రీజ కోలుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీజతో పాటు అత్తారింటికి దారేది సినిమా విడుదల సమయంలో గోడకూలి గాయపడ్డ అభిమాని కుటుంబాన్ని కూడా పరామర్శించారు.

పవన్‌పై చెప్పు విసిరిన గుర్తుతెలియని వ్యక్తి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ర్యాలీలో చెప్పు కలకలం రేపింది. కొత్తగూడెం నుంచి ఖమ్మంకు ర్యాలీగా ఓపెన్ టాప్ కారులో అభిమానులకు అభివాదం చేస్తూ వెళ్తున్న పవన్‌ని చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ క్రమంలో తల్లాడ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పవన్‌పైకి చెప్పు విసిరాడు. అయితే చెప్పు పవన్ దాకా వెళ్లకుండా కారు ముందు భాగంలోనే పడటంతో బౌన్సర్స్, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68